# స్వతంత్ర దినోత్సవ సంచిక

# ఆంధ్ర సచిత్ర వారపత్రిక

16-8-61





జీ వ యా త"

ఫొటో విజయ్ (ముమ్మిడివరం)



అమరుల మెప్పించి అప్సరసల పరిణయమాడిన
అసాధారణ యువకుని అమర గాథ...
ఆగస్టు
9
విడుదల
విజయా వారి
జగదేకవీరుని కథ
డైరెక్షన్ కె వి రెడ్డి B Sc (HONS)

# ఉత్తరాలు

## 'తెలుగు వెలుగు' పోటీవ్యాసం

తెలుగు వెలుగు పోటీ వ్యాసం అనగానే ఎవర్నో ఒక వ్యక్తిని తీసుకొంటా రనుకొన్నాము కాని వ్యక్తి కన్న గొప్ప సంస్కర్తగా పరిగణించబడిన గిరీశం పాత్ర ఎన్నుకొని చక్కగా వర్ణన చేసిన శ్రీ ఎం వి రామస్వామి గార్కి మా అభినందనలు

వడాది సూర్యనారాయణమూర్తి (బలభద్రపురం)

*   *   *

"తెలుగు వెలుగు" పోటీ బహుమతి వ్యాసం చాల బాగుంది గిరీశం పాత్ర పారకలోకములో వేళ్ళు పాతుక నాటుకపోయినది కోతలరాయుడు గిరీశం, 'అప్‌టుడేట్' సంఘ సంస్కర్తగా, రూపొంది "డామిట్ కథ అడ్డం తిరిగింది" అని విస్మరించాడే గాని, అతనీ లోకంలో చిరంజీవి

కె పార్వతీశ్వరరావు (ఉర్లాం)

*   *   *

"డామిట్ ! కథ అడ్డం తిరిగిందే!!" గిరీశాన్ని నేను అసలు "తెలుగు వెలుగు" గా వూహించనే లేదునుమండీ !

ఎన్నినాళ్ళనుండో ఎదురు చూస్తున్న తెలుగు వెలుగు పోటీ ఫలితం చదివి బ్రహ్మానందభరితుడ నయ్యాను

ఆర్కే మంగు (విజయనగరం)

## రేఖా' చిత్ర కథ

ఆంధ్రపత్రికను (సచిత్ర వార పత్రిక) "గందర గోళము"లో అమ్మితే ఎన్ని "నయా పైసలు" వస్తాయి? వై సుబ్బారావు (విశాఖపట్నం)

**అమ్మేవరకూ చెప్పలేము**

## న్యూఢిల్లీ లేఖ

"న్యూఢిల్లీ" లేఖలో శ్రీ కృష్ణగారు ప్రభుత్వోద్యోగులిని ముఖ్యంగా ఢిల్లీ సచివాలయోద్యోగులిని చాలా క్రూరంగా విమర్శించారు అదనపు పనికి చెల్లించే భత్యాలవలన ఉద్యోగుల జీతాలు ఆరు నెలలలో రెండింతలుగా పెరుగుతా యన్నది, వారు ఆఫీసు కాలాన్ని కాఫీ, సిగరట్లు త్రాగుతూ, వాలీబాలు ఆడుతూ వృధా చేస్తారన్నది సత్యదూరం కొన్ని వేలమంది పనిచేస్తున్న కార్యాలయంలో ఎప్పుడు చూసినా కొద్దిమంది కాఫీ, సిగరెట్లు త్రాగుతూ బయటికి కనిపించటం అసహజం కాదు అందరికీ విరామ సమయంలో కాంటీనులో చోటుండదు పిలునుబట్టి బయటకుపోయి వస్తుంటారు

ఎక్కువ పనికి అధికభత్యం యివ్వటం తప్పా? ప్రభుత్వోద్యోగులు కాఫీ, సిగరెట్లు త్రాగటానికి అనర్హులా ? అని శ్రీ కృష్ణగారిని ప్రశ్నిస్తున్నాను

ఎ ఎస్ ఆచారి (విజయవాడ)

## కథలు

యద్దనపూడి సులోచనారాణిగారు వ్రాసిన కథకు 'తెలిసిన విలువలు' అను పేరుకంటే 'తెలియని విలువలు' అని అంటే సరిపోయేది

వై రామకృష్ణ (పాలకొండ)

'తెలిసిన విలువలు' చాలా బాగుంది రచయిత్రి యద్దనపూడి సులోచనారాణికి అభినందనలు భార్యా భర్తల సున్నితమనస్తత్వాలను చక్కగా పరిశీలించి విమర్శించి వ్రాయడంలో ఆమె మంచి పరిజ్ఞానము సంపాదించుకున్నారు

జి వి కృష్ణారావు (విశాఖపట్నం)

## ఉత్తరాలు

శ్రీ ఎస్ రామసుబ్బారావుగారు వ్రాసిన 'ప్రేమలేఖ కథలో రవి రాజా రామం స్నేహితులనీ వారి మధ్య అభిప్రాయ భేదాలు లేవని వ్రాశారు అలాంటప్పుడు రాజా రవి తెచ్చిన లైబ్రరీ పుస్తకంలోని చిత్రాలను చింపెయ్యడమే కాకుండా అతను వ్రాసిపెట్టిన ప్రేమలేఖ ద్వారా అతనికే ద్రోహం చేయడం స్నేహ లక్షణమా ?

అంగర వేంకటరావు (హైదరాబాదు)

★



బుధవారం 16-8-61
ప్లవ సం॥ శ్రావణ శుద్ధ పంచమి
సంపుటము 53 సంచిక · 49

స్థాపితము:
1908

* * *

ముఖ్యసంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

* * *

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

* * *

విడిప్రతి: 25 న పై
సంవత్సర చందా: 13-0-0 రు

* * *

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి, మద్రాసు-1

★

## లోకంపోకడ



ప్రభుత్వ ఆస్పత్రులు మీరు చెబుతున్నంత బాగా ఉంటే రాష్ట్రపతి ప్రైవేట్ నర్సింగ్ హోముకి ఎందుకు వెళ్ళాల్సొచ్చింది?

# ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

## విషయానుక్రమణిక

ముఖచిత్రం: స్వాతంత్ర్యదిన కోలాహలం

### కథలు



### బుడుగు బొమ్మల కథ



### సీరియల్ కథలు



### శీర్షికలు




### కవిత




'లోకం పోకడ' అన్న శీర్షికక్రింద ఈ పేజీలో ఇకమీద వారం, వారం ఊమెన్‌గారి కార్టూన్ ప్రచురించ దలచామని తెలుపటానికి సంతసిస్తున్నాము.

## శ్రీశైల ఆలయ ఉద్ధరణ నిధి

'ఆంధ్రపత్రిక' సేకరిస్తున్న శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివారి ఆలయ ఉద్ధరణ నిధికి ఆగస్టు 5 తేదీనాటికి రు. 25,294-05 వసూలు అయింది. యధాశక్తి విరాళాలు ఇచ్చి, ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందని ప్రజలకు, ప్రజాసంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


స్వతంత్ర భారత దేశం
వరద బాధితులు
హెచ్చు ధరలు
జనసంఘం
కమ్యూనిస్టు పార్టీ
సోషలిస్టు
ఎదుగు లేని ప్రతిపక్షాలు
కాంగ్రెస్ వృషభాలు
పొడవ గలవు!
సామ్యవాదం
కమ్యూనిటీ
ప్రాజక్టులు
దుబారా
అవినీతి
అధికారుల
జాగు
ప్రజలకు
కడుపు నిండా
భోజనం కలలోనే!



స్వస్థతపొందిన రాష్ట్రపతి డా॥ సెన్ కర్నల్ మైత్రా మిస్ కౌర్‌లను చిత్రంలో చూడవచ్చు

## త్రివర్ణ ప్రశస్తి

**తే. శ. రావు**

ప యనఁగా వర్ణ మిచ్చును పచ్చరంగు
తె యనఁగ వర్ణ మిచ్చును తెలుపురంగు
క యనఁగా వర్ణ మిచ్చును కావిరంగు
అల్పపదమైన నెంతటి యర్థమిచ్చు

* * *

గోఖలే తిలకు పటేలు గాంధీజీలు
శ్రీహరి సుభాసు మున్నగు నాయకులును
త్యాగ మొనరించినారు పతాకకొరకు—
వారి పేరులు మూడేసి వర్ణములును

* * *

మూడు లింగాల సీమ—మానాడు కాదె?
తేనెవంటి భాష మనకు తెనుఁగు కాదె?
తెనుఁగు తెలుఁగు నాంధ్రమనెడు తెలుఁగునాడె
మూడు వర్ణాల ఘనతను మురియుచుండు

* * *

రాయలును బాల రాదిగ రాజవరులు
నన్నయా పోతనాదిగ మిన్న కవులు
క్షేత్రయ త్యాగయాది సంగీత నిధులు
మూడు వర్ణాలతోడను కూడియుండ్రు

* * *

గౌతమి తపతి కావేరి యితర నదుల
మగువ మూఁడాల క్షుద్రము మ మాది
నారిమణులును వెలసిరి భారతాన
ఔర! మూడక్కరాల కెంత సొబగుకలదు

న్యూఢిల్లీ లేఖ — శ్రీకృష్ణ

# త్రివిధ బలాల ప్రధానాధిపతికి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స!

రాష్ట్రపతికి సంభవించిన అకారణము ఆకస్మికమైన అనారోగ్యం ఈవారం ప్రాధాన్యం వహించిన విషయాల్లో ఒకటి. నిజానికి ఈ అనారోగ్య వార్త న్యూఢిల్లీ ప్రజా జీవనాన్నే స్తంభింపజేసిందనొచ్చు. రాష్ట్రపతికి స్వాస్థ్యం చేకూర్తున్నకొద్దీ వైద్య శాస్త్రవేత్తలు ఈ ఆకస్మిక అనారోగ్యానికి కారణమేమిటా అని చర్చిస్తున్నారు. అధ్యక్షులకు ఆకలి లోపించటం కారణంచేత వ్యాధి పుట్టుకురావు కాదని తేలింది. రాష్ట్రపతి ఇప్పుడు మామూలు ఆహారాన్ని పుచ్చుకుంటున్నారు. పోగా కడుపులో ఏదో ఒక విధమైన వ్రణ వుందని తేలింది. ఏమైతేనేం రాష్ట్రపతికి ఇప్పుడు స్వాస్థ్యం చేకూర్తున్నందుకు అందరికీ ఆనందంగావుంది.

ఇక్కడ కొన్ని ప్రశ్నలు వచ్చాయి. రాష్ట్రపతికి జబ్బు చేసినప్పుడు వారిని ఒక ప్రైవేట్ వైద్యాలయానికి తీసుకువెళ్ళటం జరిగింది. మరి రాష్ట్రపతిని ప్రభుత్వ ఆస్పత్రికి ఎందుకు తీసుకు వెళ్ళలేదు? వారు త్రివిధబలాల అధిపతి. సైనిక స్వంత వైద్యులేగాక, ఆస్పత్రి వైద్యులు ఇంకా వైద్యాలయంలో వుంటే వారిమంచి నిపుణులు పరీక్షించడానికి వీలుండేది. ఆస్పత్రిలోవున్న ఇద్దరు మిలిటరీ డాక్టర్లు, ఒక శస్త్రచికిత్స నిపుణుడు, ఒక సాధారణ వైద్యుడు వీరిమూలంగానే న్యూఢిల్లీ ప్రజలందరూ సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి ఇతోధికస ఖ్యాతి పొంది ఉపయోగించుకుంటుంటే రాష్ట్రపతి తాము వైద్యం చేయించుకునేందుకు ప్రైవేట్ వైద్యాలయానికి వెళ్ళటం విడ్డూరంగా కన్పిస్తుంది. అంటే తమ ప్రభుత్వం నియమించిన వైద్యదళంపైన ప్రధాన మంత్రి మాదిరిగానే రాష్ట్రపతికి కూడా విశ్వాస లేదన్నమాట.

ఈ కథ ఇంతటితో అయిపోలేదు. పాట్నా నుంచి రాష్ట్రపతి స్వతంత్ర వైద్యులను విమానంలో రప్పించటం జరిగింది. వీరిలో ఒకరికి విమానంలో చోటు దొరకలేదు. కారణమేమిటయ్యా అంటే ఈ వైద్యులకన్నా ముందుగా కేంద్ర ఆర్థిక శాఖకు సంబంధించిన ఒకానొక ఉపమంత్రిణి చోటు సంపాయించుకున్నారట!

అధ్యక్షులకు రక్తం ఎక్కించేందుకుగాను, భగవంతునిమీద భారం వేసి చేసే ప్రయత్నంగా, పాట్నానుంచి ఒక సైనిక వైద్యుని విమానంలో రప్పించాల్సివచ్చింది. ఈ వైద్యుడే రెండి నిజానికి రాష్ట్రపతి ప్రాణాలు రక్షించింది. రాష్ట్రపతి కుటుంబానికి, బంధు మిత్రులకు, పరివారకులకు గాను ఐదు ఎయిర్ కండిషన్డు గదులు కేటాయించారు. మంత్రులు చాలా పర్యాయాలు (వైద్యాలయానికి రాష్ట్రపతిని సందర్శించేందుకు కనీసం అలా వెళ్ళినట్లు కనబడేందుకైనా) వెళ్ళాల్సి వచ్చింది. ఒక గదిలో అన్ని వైద్య విధానాలకు చెందిన నిపుణులు రాష్ట్రపతి అస్వస్థతను గూర్చి చర్చిస్తుండేవాళ్ళు. తమ స్పర్శ ప్రభావం వల్ల రాష్ట్రపతి కోలుకొంటున్నారన్న భావ కనబరుస్తూ పండితులు పూజలు చేస్తుండేవారు. వీటన్నితో పాటు ఉజ్జయినీ మహారాజ్ జీ సూరజ నారాయణ వ్యాస్ రాష్ట్రపతి జాతకంపై తమ భావాలు ప్రకటిస్తూ రోజూ ఒక సందేశం పంపేవారు.

సరే ఇవన్నీ అలా వుంచండి. ప్రపంచ వ్యాప్తమైన గౌరవం పొందిన వ్యక్తి మన రాష్ట్రపతి. ఏది ఏమైనా ఇప్పుడు వారి వైద్యాలయం ముందు మూగిన జనంకన్న ఎక్కువ మంది వల్లభ్ నివాస వద్ద ఆయన మరణశయ్యపై వుండగా మూగారు. సరే. దీంట్లోకి పోవద్దు. అసలింతకీ విశేషం ఏమిటంటే 'సెన్ నర్సింగ్‌హోమ్' అనేది ఏదో మధ్య రకం ప్రజల వైద్యాలయం. రాష్ట్రపతి అక్కడికి వైద్యానికి వెళ్ళటం మూలంగా మామూలుగా ఆస్పత్రికి వచ్చే మంది పెరగటమే కాక, ఇదివరకునుంచీ వైద్యం పొందుతున్నవారికి కొన్ని చిక్కులు కలిగాయి. ఒకాయనకు సోమవారం సాయంత్రం ఒక అరగంటవరకు పర్చు జాడే

(59-వ పేజీ చూడండి)



# చదరంగం

**ఆరవి. గణపతి**

అలనాటి దక్షిణాపథరాజధాని విజయనగరంలో హజారా రామస్వామిదేవాలయానికెదురుగా ఉన్న పెద్ద రచ్చ సావడిలో మొట్టమొదట చేరిన వారప్రముఖు లయిదారుగురే కాని పొద్దు కొంచెం వాలినకొద్దీ క్రమక్రమంగా వారి సంఖ్య పెరిగింది

ఒక పండు ముదుసలి, ఇంకొక తరుణుడు ఊపిరయినా విడవనీయని ఏకాగ్రదృష్టితో చదరంగం ఆడుతున్నారు వృద్ధమూర్తి కెవ్వరుసాయపడాలని సాహసించలేదు కాని చిన్నవాడని తిమ్మన్న కేవేవో సలహా లివ్వడం ప్రారంభించారు అంతే వారి పలుకులేవి అతని చెవి కెక్కడంలేదు! ఒకరిద్దరు సాహసించి తామే అతని పక్షాన ఎత్తులు వెయ్యాలని తొందరపడ్డారుకాని తిమ్మన్న కస్సుమని బుసకొట్టి చేతులలోనించి జంతువు టాడ లాగుకొని కారిసీసడించాడు ఆపైన ఆట మరికొంతసేపటివరకు నిమ్మకు నీరెత్తినట్టు నిశ్శబ్దంగా సాగిపోయింది

రామ దేవాలయం ఘంటా ధ్వని ఆ పరిసరంలో అంతట మాటిమాటికి మారుమోగింది అపరాహ్ణ సూర్యకాంతిలో, ప్రాకార గోపుర శిఖరాలపైడి కలశాలు పసుపు పచ్చని వేయి రేకుల తామర పూవులవలె తరలించాయి విశాలవీధిలో సాగిపోయే రౌతుల చేతులలో కళ్ళాలతోబాటు, వారి ఒరలలో కైజారుల పిడులలో రతనాల పొడు లప్పుడప్పుడు తళుక్కుమని మెరిశాయి

వృద్ధుడు వెంకటపతినాయుడు చదరంగంలో రాజధానిలో అంతటా బాగా పేరెన్నికగన్న గట్టి దిట్ట తిమ్మన్న ప్రాయంలో అతనికంటె బాగా చిన్నవాడయినా, గుర్రాల నడకల మెలికలలో మంచి మెళకువ గడించుకొన్నాడు శకటాలు, ఏనుగులు, చిట్టచివరికి మంత్రి కూడా చెయ్యిదాటిపోయినాసరే! అతనికి లక్ష్యంలేదు గుర్రాలుంటేచాలు కాలికి, మెడకి లంకెవేసి ఎంతెంతటివారి ఆటలయినా ఇట్టే కట్టించివేస్తాడు

వెంకటపతికి, అతనికి ఇటీవలే గట్టి పోటీ పడింది నాయునిది బాగా నిదానమయిన ఆట మిన్నువిరిగి మీదపడినా ఎక్కడ తొణకడు! బెణకడు! మరి లాభంలేదు ఆట కట్టిపోయిందన్నాసరే!




ఎలాగో అలాగ బయటపడి గెలుపుతవదే అనిఎంచుకుంటాడు కాని తిమ్మన్న ధోరణివేరు కళ్ళు మూసుకుని ఎదటివారి బలంలోపలికి చొరబడి, చిందరవందరచేసిచేసి ఆ కంగారులో ఒక రెండు జంతువులెక్కువగా చేజిక్కించుకొంటాడు గుర్రాలు రెండు మాత్రం ప్రాణప్రదంగా సంరక్షించుకుంటాడు అతని చేతిలో చిట్టవచిరి కొక కుంటి గుర్రం మిగిలినాసరే! అది తెరసిలోనించి మెరుపులా దూకుతుంది! ప్రత్యర్థి గుండెలో బల్లెంలా పొడుచుకుంటుంది కన్నుమూసి తెరిచేలోగా ఆట కట్టిపోతుంది గుర్రాల నడకలలో చిన్ననాటినించి అలవడిన నైపుణివల్లనే కుర్రకారు ఆటగాళ్ళందరిలోను అతనికి 'చతురంగ తురంగం' అన్న ఘన బిరుదం లభించింది

ఆట మాంచి పట్టయిన ఘట్టంలో పడింది ఎలాగో అలాగ గుర్రాలజంట కాజేస్తే తిమ్మన్నకి మరి చేతులాడవని వెంకటపతి గ్రహించకపోలేదు పందు దొరికినప్పుడల్లా వాటి సంహారంకోసం శాయశక్తులా ప్రయత్నించాడు కాని సాధ్యపడలేదు అంతలోనే అతని తురంగమాలు రెండు శకటంతో కలిసి చెంగు చెంగున ఎగిరి వెంకటపతి బలంలోపలికి చొచ్చుకుపోయాయి అప్పైన తిమ్మన్న ఆ శకటానికొక గట్టి బంటుటెంకం అతికించాడు దానితో అది వెంకటపతి చతురంగబలం మధ్య ఒక పెద్ద మరమేకులా బిగుసుకుపోయింది ఆటంతా అకటావికటంగా తయారయింది!

ఆవిధంగా పరిస్థితి తారుమారయ్యేసరికి అక్కడికి చేరుకొన్న ఆటగాళ్ళందరు వెంకటపతి వాయకుని పక్షం వహించారు సన్న సన్నని కనుసన్నలతో చిన్న చిన్న సలహా లందించారు ఆటలోపడి సతమతమవుతున్న వారికి కూడా తోచని మంచి మంచి ఎత్తు లొక్కొక్కప్పుడు పైవారి కిట్టే స్ఫురిస్తాయి ఆరహస్యం గ్రహించిన వెంకటపతి వారొక్కొక్కరు అతి రహస్యంగా తన చెవిలో ఊదిన సన్నాగాలతో, తెరపి ఎత్తులతో కొంచెం పుంజుకున్నాడు ఆవిధంగా వారందరు ఏకమై తనమీదికి విజృంభించగానే తిమ్మన్న అట్టుడి నట్టుడికి పెంపెక్కని

(55-వ పేజీ చూడండి)


ఫలాగమ వేళ
భవిష్యత్తును గూర్చి స్వతంత్ర పార్టీ నాయకుల నిర్విరామ చర్చలు.
పింఛను
భీమా
ప్రావిడెంట్ ఫండ్
ఉపాధ్యాయులు
లాభత్రయం
ఒకసారి వేళ్ళు కాల్చుకున్నాం కదండీ! మళ్ళీ ఎందుకీ బలవంతం
కాశ్మీర్
చూసుకోలేదండోయ్! ఇట్టే విస్మయించి పోలా!
అమెరికా
రష్యా


**కౌండిన్య**

# తెలంగాణాకు జరిగిన అన్యాయమేమిటి?

ఆంధ్ర తెలంగాణాల కలయికతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడి నాలుగున్నర సంవత్సరాలైంది. ఉభయ ప్రాంతాల ప్రజలమధ్య రాకపోకలు, సంబంధ బాంధవ్యాలు పెంపొందించి మునుపటి అనుమానాలు తీరిపోయి చాలామటుకు మనస్సులు కలిశాయి. కొందరు చేతన్ నాయకుల ధోరణిలో మాత్రం ఈ పరివర్తన కన్పించడంలేదు. అందుకనే అడపా దడపా ముఖ్యంగా శాసనసభ సమావేశమైనప్పుడల్లా తెలంగాణాకు ఏదో అన్యాయం జరుగుతున్నదంటూ విమర్శలు వింటున్నాం. క్రిందటి పర్యాయం బడ్జెట్ సమావేశానికి ముందు ప్రాంతీయ సంఘం అధ్యక్షుడు కొన్ని ఆరోపణలు చేయడం, వాటికి ప్రభుత్వం తరపున తెలంగాణా నాయకుడు ఉపముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి అధికారపూర్వకంగా సుదీర్ఘమైన సమాధానమివ్వడం జరిగింది. ఆ తరువాతనైనా ఈ గొడవ ఆఖరైపోగలదని ప్రభుత్వం ఆశించింది. కాని ఈసారి సమావేశంలో కూడా ఈ ఆరోపణలు తప్పలేదు. తెలంగాణాకు అన్యాయం చేయాలని తెలంగాణా డబ్బు అపహరించాలనే దురుద్దేశ్యం ఎవరికీ లేదని ముఖ్యమంత్రి అన్నారు. కాని ఈ అన్యాయమైన ఆరోపణలు గురించి ప్రభుత్వం ఎంత బాధపడుతున్నదో వూహించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడే సందర్భంలో తెలంగాణా ప్రయోజనాలు కాపాడే నిమిత్తం ఒక ప్రాంతీయ సంఘాన్ని రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా ఏర్పాటు చేశారు. తెలంగాణాకు సంబంధించిన ఏ శాసనం చేయాలన్నా ముందు ఈ సంఘానికి పంపి ఆమోదం పొందిన పిమ్మటే శాసనసభ వాటిని చట్టాలుగా చేస్తుంది. ఇందులో తెలంగాణా శాసనసభ్యులు, తెలంగాణా మంత్రులు సభ్యులుగా ఉండటంచేత ఈ ప్రాంతీయ సంఘం తెలంగాణా ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా పరిగణించి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఈ సంఘం సిఫార్సుల అమలుపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడానికి తెలంగాణ ప్రాంతానికిచెందిన ఉన్నతాధికారి అధ్వర్యాన సచివాలయంలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం, ముఖ్యమంత్రి ప్రధానకార్యదర్శుల ప్రత్యక్ష అజమాయిషీ క్రింద ఆ విభాగం పనిచేస్తుండటం తెలిసిన విషయమే. తెలంగాణాకు సంబంధించిన ప్రభుత్వ సమాచారం ఏదికావలసినా అధికారులు ఈ సంఘాన్నికి అందజేసే ఏర్పాటు కూడా ఉంది. మంత్రివర్గంలో చూద్దామా—ఐదుగురు తెలంగాణా మంత్రులు వారిలో ఒకరు ఉపముఖ్యమంత్రి ఉన్నారు. ప్రధానమైన శాఖలలో రెవిన్యూ, పి. డబ్ల్యు. డి. (సంజీవరెడ్డి హయాంలో) హోమ్ (ఇప్పుడు లేదు) ప్లానింగ్ (కొత్తగా ఇచ్చారు) ఇవన్నీ వారి చేతుల్లోనే పెట్టారు. ఇన్ని కట్టుదిట్టాలు రక్షణలు ఏర్పాటు చేసినా ఇంకా ఎవరో ఏదో అన్యాయం చేస్తున్నారని అనడంలో అర్థమేమిటో బోధపడదు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడకముందు సర్కార్ ఆంధ్రులను గురించి రాయలసీమ వారికి కూడా ఇలాగే అపోహలు అనుమానాలు ఉండేవి. కాని వారికి ఇటువంటి రక్షణలేమైనా కల్పించారా? ఇవేమీ లేకుండానే సర్కార్ రాయలసీమ ఆంధ్రులు సమైక్యమై పూర్వపు అనుమానాలను మరచిపోలేదా?

ఇంతకూ తెలంగాణావారు చేస్తున్న ఆరోపణలో ప్రధానమైనవి తెలంగాణాకు మిగులుతేలిన 9 కోట్ల పైచిలుకు డబ్బును తెలంగాణాకు వినియోగించక, అభివృద్ధి నిర్లక్ష్యం చేసి, ఇతరత్రా



దివి సీమలో కృష్ణానది వరద బీభత్సం

వినియోగిస్తున్నారని, తెలంగాణా తాలూకు 12 కోట్ల రూపాయల సెక్యూరిటీలను రిజర్వుబ్యాంకు అప్పు క్రింద తాకట్టుపెట్టి తమకు కాకుండా చేస్తున్నారని, తెలంగాణావారికి ఉద్యోగాలలో అన్యాయం జరుగుతున్నదని. తెలంగాణా అభివృద్ధిని నిర్లక్ష్యం చేయకపోగా ఏవిధంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నదీ దేశంలో వెనుకబడ్డ ప్రాంతాలన్నిటిలోకి అభివృద్ధి కృషిలో తెలంగాణా ఏవిధంగా అగ్రగామియైనదో అంకెలతో సహా ప్రభుత్వం ఈవరకే వివరించిఉంది. తెలంగాణా ఆయవ్యయాలలో మిగుల తేలిన 9 కోట్లు భద్రంగా ఉన్నదని రిజర్వుబ్యాంకుకు తాకట్టుపెట్టిన హామీ పత్రాలు మూడవ ప్రణాళికాకాలంలో విడుదల కాగలవని స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి ఇదే విషయం మొన్న శాసనసభలో ప్రస్తావించి ఈ 20 కోట్ల ధనాన్ని ఏవిధంగా తెలంగాణాకు సద్వినియోగం చేయాలో ఆలోచిస్తున్నామని ఆర్థిక మంత్రి త్వరలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారని హామీ యిచ్చారు.

ఈ మిగులు డబ్బు అట్లా ముదువుగానే ఉంచి తెలంగాణా అభివృద్ధి కార్యకలాపాలకు కేటాయించినదానికన్నా ఎక్కువే ఖర్చు చేశారు. ద్వితీయ ప్రణాళిక క్రింద మొత్తం రాష్ట్రానికి 175 కోట్లు కేటాయించగా 180 కోట్లు పైగానే ఖర్చయింది. అదనంగా అయిన ఈ 5 కోట్లు తెలంగాణాకే ఖర్చుపెట్టామని ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా మూడవ ప్రణాళికలో మొత్తం రాష్ట్రానికి కేటాయించిన 305 కోట్లకూ తెలంగాణాకు న్యాయంగా 102 కోట్లే ఇవ్వాల్సిఉన్నా అదనంగా 15 కోట్లు కలిపి ఆ కేటాయింపు 117 కోట్లకు పెంచారు. ఇక ప్రాజెక్టులు పరిశ్రమల విషయంలో చూచినా తెలంగాణకు జరిగిన అన్యాయమేమో కన్పించదు. నిజాంసాగర్ ఉస్మాన్‌సాగర్ వైరా ఇత్యాది మధ్యరకం ప్రాజెక్టులు ఇదివరకే ఉన్నవి. కడెం మూసి కోయిల్‌సాగర్ మొదలైనవి నిర్మాణంలో ఉన్నవి. రేపు నాగార్జునసాగర్ పూర్తి అయితే నల్గొండ వరంగల్ జిల్లాలు సుక్షేత్రాలవుతాయి. మధ్యరకం ప్రాజెక్టులలో పెద్దదైన పోచంపాడు కోసం ప్రభుత్వమూ యావదాంధ్ర ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తికాగానే ఇప్పుడు సాగవుతూన్న 5 లక్షల ఎకరాలతో కలుపుకుని 32 లక్షల ఎకరాలు సాగులోకి వస్తుంది. పరిశ్రమల సంగతి చూచినా తెలంగాణాదే అగ్రస్థానం. ఒక్క విశాఖపట్నం మినహాయిస్తే తెలంగాణాలో తప్ప

(49-వ పేజీ చూడండి)



# ఆదర్శాలు అంతర్యాలు

సింగరాజు లింగమూర్తి

---

## జరిగిన కథ

బోలయ్య అంటే ఆ ఊళ్ళో చాలా మందికి అభిమానం, గౌరవం కొంతమందికి అతనిపై అయిష్టం కలగడానికి కూడా కారణం లేక పోలేదు నరసింహప్ప చలమయ్య ఒకరినొకరు సాధించుకోవాలని ఎత్తులు వేస్తూ ఉంటారు నరసింహప్ప బోలయ్యను తన పక్షంలో చేర్పించటానికి ప్రయత్నిస్తాడు బోలయ్యకు, నరసింహప్ప పెద్దకూతురు ఇందిరకు, రాజారావు ట్యూషన్ చెబుతూ ఉంటాడు ఇందిర చెల్లెలు లలిత రాజారావును ప్రేమిస్తుంది నరసింహప్ప రాజారావు ట్యూషన్ మాన్పిస్తాడు పాఠశాల వార్షికోత్సవానికి వచ్చిన మంత్రి ఎన్నికలలో పోటీ చెయ్యమని రాజారావుకు సలహా ఇస్తాడు రాజారావును మంచిచేసుకునేందుకు చలమయ్య అలివేణిని నియోగిస్తాడు.

---

ఒక రాత్రివేళ లలితకు మెలకువవచ్చి పక్కకు తిరిగిచూసింది ఇందిర నిద్రట్లో నవ్వుకోడం కనిపించింది "తన కిప్పుడు మెలకువ ఎందు కొచ్చింది" అని ప్రశ్నించుకుంది లీలగా ఏదో కల కనినట్టు తోచింది 'ఏమిటా కల' అని జ్ఞాపకం చేసుకుంటూ లేచి కూర్చుంది

"పిండి ఆరబోసినట్టుగా ఉంది వెన్నెల తోటలో పూలవాసనలు గుబాళిస్తున్నాయి నన్న జాజిచెట్టుకు పక్కగా ఉన్న తిన్నెమీద లలిత ఎవరికోసమో ఎదురుచూస్తున్నది తెల్లటి నున్నని వెన్నెల, పూల వాసనలు, ననసన్నగా పిల్ల గాలులు ఆమెకు ఎరుగని మత్తుతో స్పృశిస్తున్నాయి ఇంతలో వెనుకనుంచి ఎవరో కళ్ళు మూశారు లలిత చేతులతో తడిమి "దొంగను పట్టుకున్నా" అని నవ్వింది కళ్ళుమూసిన చేతులు విడివడినాయి మునుసిగ్గు దొంతరలతో 'రాజా' అంటూ అతని గుండెల్లోకి ముడుచుకు పోయింది రాజారావు చెదరిన ఆమె ముంగురులను సవరిస్తూ ముఖం మీదకు వంగాడు, ఇంతలో ఏదో గర్జన అదిరిపడి లలిత అతని ఒడిలోంచి లేచి బెదురుతూ ప్రక్కకు నిలుచుంది ఇంతలో ఎవరో వెనుకనుంచి కర్రతో రాజారావు తల మీద బలంగా కొట్టారు 'అబ్బా' అంటూ రాజారావు నేలమీదకొరిగాడు ఆమె కంపించిపోతుంటే తండ్రి చెయ్యి పట్టుకుని బరబర లాక్కుపోయాడు కల కరిగిపోయింది

కల జ్ఞాపకంరావడంతో ఏదో తెలియని భయం ఆమెను ఆవరించింది "అక్కా అక్కా"అంటూ లలిత ఇందిరనుభుజంతట్టిలేపింది

"అబ్బ ఏమిటే నిద్దర రావడంలా" అంది—ఇందిర ప్రక్కకు ఒత్తిగిలుతూ

"నా కేమిటో భయంగా ఉందక్కా"

"ఏం కలేమైనా వచ్చిందా ?" అంటూ లేచి కూర్చుంది ఇందిర

లలిత తనకు వచ్చిన కల చెప్పింది

"కలలు నిజమౌతాయిటే ఎందు కంత భయపడతావు ?"

(50-వ పేజీ చూడండి)


బంగారం - సింగారం - 'రాఖీ' చిత్రకథ -
డబ్బు మారిపోయిందిరా గోళ్ళు కొట్టుట - నోట్లు! మన నోట్లే - నేను మళ్ళా కోటీశ్వరుణ్ణే - ఇది తెలిస్తే
హుర్రా!
కోటక్
హా! నా ప్రాణ నాథా —
అబ్బ - ఈ దిక్కుమాలిన మొక్కలు కుదురుగా వుండవు కాబోలు - గాంతేస్తే ఎగిరి మీద పడుతున్నాయ్
హా! వనిత తనంత తావలచి వచ్చెను.
అది మొక్క కాదు అంకుల్! గోరువంక ది గ్రేట్ బ్యూటీ ఈ లోకంలో అందాలరాణి
అల్లాగా! రాణీ గారూ - ఏమీ అనుకోకండేం - చత్వారం వల్ల సరిగా ఆనలేదు -
నాన్నా సింగారం డబ్బు వెర్రిరా - పెద్ద పథకం వేశా - ఇక్కడి వాళ్ళతో టీ
ష్ ష్
ఏమా పథకం? ఎవరా కథ?
ఏం పథకమేమిటో - మనం ఇక్కడికొచ్చిందసలు దేనికో మర్చిపోయావా? ఇక్కడి వాళ్ళకి మరేదో గోళంలో నిధికి ప్లాను తెలుసునని కదా -
అసలు వాళ్ళు దొరికారు - అంతా మాట్లాడాను ప్లానుకు బేరం చేసి నూట తొంభై తొమ్మిది వేల రూపాయలకి ఒప్పించాను - అడ్వాన్సు కూడా ఇచ్చేశా - ఆ నిధంతో పిడకలూ, గోళ్ళూ కాకుండా మన లోకం డబ్బేట - ఇప్పుడు వాళ్ళూ మనం కలిసి ఆ గోళానికెళ్ళి నిధి తవ్వుకోవాలి
రాకెట్ కదిలింది
అబ్బ - చంద్రగోళం వదిలింది
చంద్రుడికో నూలుపోగు
ఓ! ఏదయ్యా మాపు?
ఇదిగో నండి
మనం ముందిక్కడికి వెళ్ళి, నిధి తవ్వుకుని, తీసుకొని, వాళ్ళనిక్కడికి తెచ్చి దింపేసి, మన అసలు డబ్బు దాచుకోడానికి ఇంకో గోళం వెతుక్కోవాలి - తెలిసిందా?
యెయస్
నాకంతా అయోమయంగా వుంది
17

# హరివంశము

## సాందీపనిపర్వం - 23

(గత సంచిక తరువాయి)

దీక్షితాయణి సమనస్కయైనదో! శుచి అయినదో! ఆమె కన్నులలో మందహాసములు విరిసినవి ఆ కన్నులతోడి నిశ్చలా పాంగములుగా ఆమె సాందీపని కన్నులలో చూచినది ఆయనయు మందహాసము చేసినాడు ఆ మందహాసములో ఆనంద మున్నదో? దీక్షితాయణి "స్వామీ!" అన్నది సాందీపని "అమ్మీ" అనినాడు అట్టులు ఆయన తన్ను సంబోధించి ఎన్నిదినము లైనది "స్వామీ! బిడ్డ బ్రతికివచ్చినట్లు ఉన్నది" అన్నది దీక్షితాయణి సాందీపని ఆమె వంక సాలోచనుడై చూచినాడు దూరమున రథములు కదులుచున్న సవ్వడి వినవచ్చుచున్నది దూరమునుండి మహానందుని గానమును చెవులో వూదుచున్నట్టు విన్పించుచున్నది మహానందుడు మరల ఇట్టుల గానము చేసినాడు

> "విజ్ఞాన సారథిర్యస్తు
> మన ప్రగ్రహవాన్నర
> సో ధ్వన పారమాప్నోతి
> తద్విష్ణో పరమంపదం"

రథము కదిలిపోయినది శ్రీ కృష్ణసారథికమై రథము ముందుకు సాగినది ఆ వెనుక దారుక సాధికము, ఉద్ధవాదికాధిష్ఠితము అయిన రథము కదిలినది సారథియైన శ్రీ కృష్ణదేవుడు మొగలుపై సత్యమును పోలి, శివమునుపోలి, సౌందర్యము యొక్క కాష్ఠనుపోలి ప్రకాశించినాడు సర్వ కాశియు ఆయనను చూచి, ఆనందమును పొందినది ఈనల్లని యతడు, ఈ పద్మపత్ర విశాలాక్షుడు, ఈ ఆజాను దీర్ఘ బాహుయుగళుడు, సారథి, ఎవ్వరో అని అందరు అనుకొన్నారు అంతలో వారికి ఎవరో చెప్పినట్లుగా తెలియవచ్చినది ఇతడు కృష్ణుడట వాసుదేవుడు సాందీపని వద్ద శిష్యరికము చేయగా వచ్చినాడట అన్న వార్త ఆనోట ఆనోట, కాశిక యంతయు వ్యాపించినది సజల గంభీరము, స్తనయిత్ను ప్రఘోషము అయిన మేఘ మొక్కడు కాశిలో ఆనాడు సంచరించినది ఆ మేఘము ఏ దిక్కునకు పోయినను, అచ్చట చల్లని తనము, అచ్చట శాంతి, అచ్చట ఆనందము— తాండవించినవి శ్రీ కృష్ణదేవుని రథము తొలుతగా మణికర్ణికకు పోయినది అచ్చట భగవంతుడు రథమును ఆపి సాలోచనుడు, సానందుడు అయినాడు ఆయనలో ఏవో తలపులు దుసిలింత లయినవి అది ఎప్పటి సంగతి? చక్రమును తొలుత తాను ఇచ్చట శివప్రీతికరముగా ప్రయోగించినాడు అప్పుడు పరమశివుడు, ఇందూత్తంసుడు, కాశికాధిపతి, విశ్వేశుడు, తనకు ప్రత్యక్షమై బహుమానశ్లాఘ కావించినాడు ఆ దినమున తాను కాశికాతీర్థ మాహాత్మ్యమును గూర్చి అడిగినదియు ఇప్పుడు ఆయనకు జ్ఞాపకము వచ్చినది అప్పటికి ఇంకా దైవతధుని, భగీరథానీతయై, భూమికి దిగిరాలేదు ఇప్పుడు వచ్చినది ఇప్పుడనగా ఎప్పుడు ఎప్పుడో కృతమున? భగీరథుని కాలమున సగరుని పుత్రులు కపిలర్షి ప్రదీప్త కోపానల దగ్ధులయినారు వారిని నిరయమువలన ఉద్ధరించవలసిన బాధ్యతయు, భాగ్యమును భగీరథునివలన పడినవి భగీరథుడు వేల సంవత్సరములు తపస్సు చేసినాడు దైవతధుని కరుణించి నది భూమికి వచ్చినది కాశికలో మణికర్ణిక మీదుగా ప్రవహించినది భగవంతుడు తనతో అనుకొనినాడు ఆమ్నాయ శాస్త్రాగమాధ్యయనము భాగీరథీ స్నానపరతతో సరితూగగలదా! గంగాభివీక్షణముచేత మనోవాక్కాయ దురితావళి విదళించబడుతున్నది మరి ఈ త్రిదశ గంగానదీతీరములలో వసతి లభించవలెను అనగా, శ్రీ కంఠ



దేవుని కృపలేక సిద్ధించునా! పరమశివుడు ఆ కడచనిన దినములలో తనతో అన్న మాటలు భగవంతుని మనస్సులో ఆడినవి "విష్ణూ! అది యుగములో అన్నియు తీర్థములే త్రేతయందును ద్వాపరము నందును కురుక్షేత్రమును, సుపర్వ నిమ్నగయు తీర్థములు" అన్నాడు ఆ సుపర్వ నది ఇప్పుడు వారాణస్యుప కంఠదేశ విలుఠద్వార్వేణీవీచీ ఘటాఘీరధ్వానపరంపరాకలకలోద్విగ్నఘనమై ప్రవహించుచున్నది ఆ ప్రవాహమును బడి శ్రీ కృష్ణదేవుడు రథమును నడిపించినాడు ఎచ్చట వరణయు, గంగము కలిసినవో, అచ్చట తిరిగి రథము ఆగినది అప్పటికి సూర్యాస్తమయవేళ యయినది శ్రీ కృష్ణదేవుడు, స్రగ్జుడై రథమును అవరోహణము చేసి, గంగావరణా సంగమమున పాణిచరణ తలములను ప్రక్షాళించుకొనినాడు కృతకాలోచిత క్రియాకలాపుడైనాడు మహానందుడును, సుదాముడును గూడ అందు పాల్పినారు

మహానందునకు శ్రీ కృష్ణదేవునకు కాశిక ఇంత తెలియునా అనిపించినది ఆయనకు మణికర్ణిక ఇచ్చటను అని ఎవరు చెప్పినారు ఇచ్చట గంగా వరణ సంగమమని ఎవ్వరు చెప్పినారు? అతనికి అదియే తెలియలేదు అతడు సాకూతియై శ్రీ కృష్ణదేవుని వంక చూచినాడు శ్రీ కృష్ణదేవునకు నవ్వు వచ్చినది ఆయన నవ్వినాడు

"మహానంద! ఇది పాదోదక తీర్థమని నాకు తెలియునా, లేదా అని నీవు ఉత్కంఠితుడ వగుచున్నావు!"

"అదికాదు శ్రీకృష్ణ! నీకు ఈ తీర్థము యొక్క పుట్టుక తెలియునా? అని ఆలోచించుచున్నాను"

"సాధు! మహానంద! సాధు! నాకు తెలియునయ్యా! నీబోటి పెద్దలు చెప్పగా విన్నాను విష్ణువు దివోదాసునుచ్చాటనార్థము కాశికకు పుణ్యకీర్తియై వచ్చి, తొలుత నిచ్చట, ఈ సంగమ స్థానమున పాణిచరణతలములను ప్రక్షాళించుకొనినాడట ఆ తరువాతనే కాశిలో ప్రవేశించినాడట అందువలన ఈ తీర్థమునకా పేరు వచ్చినది నిజమా?'

మహానందు డాశ్చర్యపడినాడు "అవును! శ్రీ కృష్ణ! అవును" అన్నాడు మరి ఈ వరణ ఎట్లు పుట్టినదో తెలియునా అన్నాడు

శ్రీ కృష్ణదేవుడు "నీవలన వినవలయునని యున్నది" అన్నాడు

"అట్లాగా తండ్రీ! అయితే విను"

మహానందుడు వరణావతరణ వృత్తాంతమును ఇట్లు వారికి వినిపించినాడు

"అది ప్రళయకాలము మహాకార భైరవుడు తాండవం అవధరించినాడు ఆరభటివృత్తితో ఆయన తాండవం ఆచరిస్తూవుంటే, ఆయన పాదములయొక్క అభిహతిచేత ఉర్వీకటాహం ఉట్టూతలూగిపోయినది నిర్భరతరజటానికురుంబకములు చెదిరిపోయినవి బాహార్గళస్తంభ పరివర్తనములలో దిక్చక్రవాళము త్రెవ్విపడినది వితత నిశ్వాస మారుత వర్తనమువలన పృథ్వీధరములు పెళ్ళగిలి పడినవి డమరు, ఘోన్నాదములతో సముద్రములు కలగిపోయినవి ఉద్ధత తాండవం ఇట్టులుగా ఆడీ ఆడీ అభవుడు డస్సిపోయినాడు ఆయనకు దాహం అయినది సప్త లోకములు అణిగిపోయినవి ఎక్కడను జిహ్వకు ఇంపైన తేటనీరు కనబడలేదు అప్పుడు పరమశివుడు అనుకున్నాడు 'ప్రళయకాలమునందుగూడ ఏమి చెడనిది కాశి అక్కడికి పోయెదనుగాక" అనుకొని శివుడు ఈశానుడై కాశికి బయలుదేరినాడు మరి కాశి ఎటువంటిది? తండ్రీ! కాశి సంసార సస్యబీజములకు వూషరభూమి నిర్వాణ లక్ష్మికి నిలువనీడ అల్లా నేరెడుదేవికి అవతంస కుసుమము ముక్తికాముకులకు కామధేనువు నాయనా శ్రీకృష్ణ! కాశివున్నదే, ఇది, విశ్వనాయకునకు విహరణ స్థానము సర్వకళ్యాణములకు ఆదికారణము అంతియకాదు ఇది దుంఠి గంధద్వీపమునకు కట్టు కంబమయ్యా! అంతియేనా! కాదు పరబ్రహ్మము

(49-వ పేజీ చూడండి)

హారీత శివశర్మ



బియోవుల్ఫ్



## బాలసాహితీ సీరియల్

ఆంగ్ల భాషలో కనుపిస్తున్న ప్రాచీన ఇతిహాసాలలో బియోవుల్ఫ్ కథ ఒకటి. ఈ కథ బ్రిటన్‌లో జరిగినట్టు లేదు. దీనిలో క్రైస్తవానిక పూర్వపు మతాల ప్రభావమే కనుపిస్తున్నా, బ్రిటన్ వాస్తవ్యుడైన ఒక క్రైస్తవుడు వ్రాసి ఉండవచ్చుననిపిస్తుంది.

బాలలూ! మంచికథ చెప్తా వినండి! డేనిష్ రాజుల పరాక్రమం, వారుసాధించిన ఘనకార్యాలు, మనం చరిత్రలో చదివాం కదూ! వారిలో స్కైల్డ్ స్కెఫింగ్ అనే రాజు ఉండేవాడు. ఆ రోజుల్లో ఆయనంటే ఆ చుట్టుపట్లలో ఉన్న రాజులందరికీ హడల్! చాలామంది రాజులు ఆయనకు కప్పం చెల్లించి సామంతరాజులుగా ఉండేవారు.

స్కెఫింగ్ మహారాజు తర్వాత ఆయన కుమారుడు బియోవుల్ఫ్ రాజ్యం పరిపాలించాడు. ఈయన కూడా తండ్రి మాదిరిగానే అవక్ర విక్రమంతో, ప్రజారంజకంగా పరిపాలించాడు.

ఈ బియోవుల్ఫ్ మహారాజుకు హియోరోగార్, హ్రొత్గార్, హాల్గా, అనే ముగ్గురు కుమాళ్ళు ఒక కుమార్తె ఉన్నారు. ఈ కుమార్తెను స్వీడన్ మహారాజు ఒనెలాకు ఇచ్చి వివాహం చేశారని చారిత్రకు లంటారు.

**స్వేచ్ఛానువాదం**
**నాగరాజ్**

మన కథాకాలం నాటికి హ్రొత్గార్ మహారాజు పరిపాలన చేస్తున్నాడు. ఆయన మహావీరుడు. తండ్రి తాతల్లాగానే యుద్ధాల్లో పేరు పొందాడు. ఆయనకు ఒక విచిత్రమైన సంకల్పం కలిగింది. ప్రపంచంలో ఎవరూ కనీవినీ ఎరుగనంతటి మహాభవనాన్ని నిర్మించాలనీ, ఆ భవన ప్రవేశోత్సవంనాడు తన హక్కుభుక్తాల్లో ఉన్న సమస్తమైనవాటినీ (ప్రజల ధన, ప్రాణాలు తప్ప), చిన్నా పెద్దా భేదం లేకుండ అందరికీ పంచిపెట్టాలని అనుకున్నాడు. రాజు తలుచుకుంటే కొదవేముంది? ఇంకేం, కొద్దికాలంలోనే ఒక అపూర్వమైన మహాభవనం లేచింది. ఈ భవనానికి హ్రొత్గార్ మహారాజు 'హియొరాట్' అని పేరు పెట్టారు. మరి, మహారాజులు ఆడినమాట తప్పరుగా! ఆయన తనకున్న ధనమంతటినీ ప్రజలకు పంచిపెట్టాడు. ప్రజలంతా ఆనంద సాగరంలో మునిగి తేల్తున్నారు.

రోజూ ఆ భవనంలో విందులూ, సంగీత సభలూ జరుగుతుండేవి. కవులు భగవల్లీల గూర్చి, సృష్టి క్రమం ఎలా ఉండేది, భగవంతుడు ప్రపంచాన్ని ఎలా సృష్టించింది, సముద్రం చుట్టూ జ్యోతిర్వలయం ఎలా ఏర్పడింది, సూర్యచంద్రులు శక్తిమంతులైన విధానం, ఈ క్రమంలో ప్రాణి

(45-వ పేజీ చూడండి)




అలపర్తి వెంకటసుబ్బారావు

పండు వెన్నెల పిండారబోసినట్టుగా వుంది. కన్నుల పండుగ జేస్తూ వుంది

"తాతయ్యా! కథ చెప్పవా?" అని అడిగాడు ఆరుబయట మంచంమీద కూర్చున్న మనుమడు

ఇంకేం! ఆరిపోయిన చుట్టని తిరిగి వెలిగించి, కథ మొదలుపెట్టాడు తాతయ్య.

* * *

పూర్వం ఒక అడవిలో ఒక నక్క నివసిస్తూ వుండేది ఒకనాడది షికారుకి బయలుదేరింది దారిలో ఒక కొలనులో ఒంటికాలిపై నిలబడి జపంజేస్తూవున్న కొంగని చూసింది దాన్ని చూడగానే నక్కకి నవ్వాగింది కాదు. ఆజపం నిజంజపమో, దొంగజపమో తేల్చుకోవాలనుకుంది

అనుకున్నదో లేదో వెంటనే, "మిత్రమా! బకోత్తమా! ఈనాడు

నా పుట్టినరోజు పండుగ. కనుక, మిత్రుడవైన నీకు విందు జేయదలచాను నీవు సకుటుంబ బంధుమిత్ర సపరివారముగ విచ్చేసి, నన్నాశీర్వదించి, నేనొసంగు చందన తాంబూలాది సత్కారముల గైకొన ప్రార్థన" అంది నక్క

జపంలోవున్న కొంగకి యీ మాటలు వినగానే నోరూరింది చేస్తూవున్న జపం కాస్తా వదిలేసి, "పదవోయీ జంబుకోత్తమా! నీవు పిలవటం నేను రాకపోవటమూనా? లాంఛన ప్రాయంగా సకుటుంబ బంధుమిత్ర సపరివారంగా రమ్మని నన్ను నీవు ఆహ్వానించినా, మర్యాద తెలిసినవాడిని, నీమేలు కోరినవాడిని గనుక ఒంటరిగానే వస్తాను అంతేగాని, రమ్మన్నావు గదా అని సకుటుంబ బంధుమిత్ర సపరివారంగా వస్తే, నీయిల్లు గుల్లయిపోయి, ఏనుగంత వాడివి పీనుగైపోవా!" అని నవ్వుతూ నక్కవెంట బయలుదేరింది కొంగ

కొంగది దొంగజపమో నిజం జపమో తేలిపోయింది అందుకనే దొంగజపం చేసేవాళ్ళని 'కొంగజపం' చేస్తున్నాడని అంటూ వుండడం సహజమైపోయింది

ఇక యిప్పుడు నక్కకి మరో సమస్య యెదురైంది అన్నమాట ప్రకారం కొంగని తన యింటికి తీసుకువెళ్ళి విందుజేసి పంపించాలి కాని, తన యింటిదగ్గర మధ్యాహ్నం తను త్రాగటానికని అట్టిపెట్టకున్న గ్లాసుపాలు మినహా ఏమీలేవు అవికాస్తా కొంగకర్పిస్తే, తనకిక ఆపూట పస్తే!

కాబట్టి, విందూలేదు ఏమీలేదు ఎగతాళికన్నానని కొంగతో చెప్పాలనుకుంది నక్క కాని వెంటనే మరో ఆలోచన వచ్చింది "తానుగనుక అలాచెప్తే, నల్లీ యింకొకసారి తనమాట నమ్ముతుందా కొంగ? నక్క వట్టిఅబద్ధాలకోరని అడవంతా చాటదూ? మాటపోయాక యింకా బ్రతికేం బ్రతక్కేం!" అనుకొని, ఆ ప్రయత్నం కాస్తా విరమించుకొని మరో ఉపాయం ఆలోచించసాగింది నక్క

ఆలోచించగా ఆలోచించగా నక్కకి ఒక చక్కని ఉపాయం తట్టింది దాంతో, విందు జరిపినట్టుగానూ వుంటుంది ఆపాలు కొంగకు దక్కకుండానూ వుంటాయ్! అప్పుడు మాటకి మాటా దక్కుతుంది పాలకిపాలూ దక్కుతాయి

ఇంకేం! నక్కకి ధైర్యం కలిగింది



తన వెంట యింటికి తీసుకెళ్ళింది. ఒక సాసరులో పాలుపోసి, కొంగముందు వుంచింది పొడుగుపాటి ముక్కు కావడంవల్ల కొంగ ఆసాసరులోని పాలను త్రాగలేకపోయింది దగా పడినందుకు దిగాలుపడి నక్కను లోలోన తిట్టుకొంటూ వచ్చిన దారినే తిరిగి వెళ్ళింది కొంగ

కొంగని మోసంజేయ గలిగినందుకు ఉప్పొంగిపోతూ ఆ సాసరులోని పాలను గుటకాయస్వాహా జేసి, బ్రేవ్ మని త్రేన్చింది జిత్తులమారి నక్క

కొలనుకి జేరిన కొంగ, తనకుజరిగిన అవమానాన్నిగూర్చి తలపోసింది ఎలాగైనా నక్కకి తగిన శాస్తి చెయ్యాలనుకుంది. ఎత్తుకు పైఎత్తు వేసి, ఆ జిత్తులమారి నక్కని చిత్తుజేసి, బిత్తరబోగొట్టి, "తాడిదన్నే వాడుంటే, తలదన్నే వాడుంటా" డని నక్కకి తెలియ జెప్పాలనుకుంది కొంగ

ఇంకేం! మర్నాడు నక్కదగ్గర కెళ్ళి, తన తండ్రిగారి తద్దినంగనుక భోజనానికి రమ్మని ఆహ్వానించింది.

తన మోసాన్ని కొంగ గ్రహించి వుండదులే అనుకున్న నక్క విందు భోజనం దొరికినందుకు పరమానంద భరితురాలై కొంగను అనుసరించింది

ఈసారి కొంగ, సన్నని మూతి గల పొడుగుపాటి కూజాలో చేపలను వేసి, నక్కముందు వుంచింది ఆ కూజాలోని చేపల్ని చూడగానే నక్కకి ఎక్కడలేని ఆకలి ఒక్కసారిగా పుట్టుకొచ్చింది గబగబా ఆ కూజాలో మూతిపెట్టబోయింది నక్క కాని మూతి పట్టలేదు ఏంజేస్తుంది బిక్కముఖం వేసింది నక్క దానికిక్క అరాగే అణగాలిలే అనుకుంది కొంగ

ఎత్తుకు పైఎత్తు వేసిందిగదా అని చింతిస్తూ అవమానభారంతో కుంచించుకొని అక్కడినుంచి జారుకుంది నక్క

* *


"ఓస్. యీ కథేనా? ఇదైతే మా వాచకం పుస్తకంలోనూ వుంది" అన్నాడు మనుమడు ఎంతో చులకనగా

"ఆగాగు అయితే మీ వాచకం పుస్తకంలో కథ యింతటితో అయిపోయింది గదూ?"

"అవును"

"కాని, నే చెప్పేకథ యింకా పూర్తికాలేదు? "

(43-వ పేజీ చూడండి)




దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

**16-8-1961** బుధవారము మొదలు
**22-8-1961** మంగళవారము వరకు

## మేషం

**(అశ్విని, భరణి, కృత్తిక 1 పా )**

ఈ సమయంలో ప్రయత్నించిన ప్రతిపనీ సాధించగలుగుతారు సుఖం కూడా లభిస్తుంది ఇతరుల పనులలో మీ అభిప్రాయం అవసరం అవుతుంది పిల్లల ఆరోగ్యంగురించి జాగ్రత్తగా ఉండటం అవసరం ఒకానొక సందర్భంలో మాట కట్టుబాటులేని మ< ృంతో తగాదావచ్చే సూచనలున్నవి ఖర్చులు చాలావరకు తగ్గుతవి అధికారులు మొదలయిన వారితో సంప్రదింపులు సులభంగా ఫలిస్తవి వారం రెండవ భాగంలో గాలి వార్తలవల్ల మనస్సుకు ఆందోళన కలుగుతుంది విద్యా వ్యాసంగము, సాహిత్య గోష్ఠి మొదలయిన విషయాలలో ఉత్సాహంతో పాల్గొంటారు ఎదురు చూస్తున్న వార్తలు ప్రస్తుతం అందవు 17, 18 తేదులలో శుభ కార్యాలు, వృత్తిలో అభివృద్ధి

* * *

## వృషభం

**(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా )**

మీ శక్తిని సమయానుకూలంగా వినియోగించుకోగలుగుతారు బంధువులను నమ్ముకుని ఏ పనీ ప్రారంభించవద్దు అతి ముఖ్యమైన సమస్యలు ఈ వారంలో నిర్ణయానికి వచ్చి మనశ్శాంతి కలుగుతుంది డబ్బు విశేషంగా ఖర్చు కాతగిన అవకాశాలున్నవి విశేషంగా స్నేహితుల ప్రోత్సాహం లభిస్తుంది మీ ఆరోగ్యం ఇంతకుముందుకన్నా బాగుంటుంది చాలా రోజులముందు ఆరంభించిన ఒకానొక కార్యం దైవానుగ్రహంవల్ల అనుకూలించిందనే సంతృప్తి కలుగుతుంది రావలసిన డబ్బు ఎప్పటి కప్పుడు వస్తుందని అనుకుంటూ ఉంటారు కాని, ప్రయోజనం కనుపించదు సంఘంలో

> **గ్రహస్థితి**
>
> మిథునంలో శుక్రుడు, కటక సింహాలలో సూర్యుడు, సింహంలో బుధ, రాహువులు, కన్యలో అంగారకుడు, మకరంలో గురు, శనులు, కుంభంలో కేతువు, కన్య, తుల, వృశ్చిక, ధనుస్సులలో చంద్రుడు

గౌరవం లభిస్తుంది వృత్తి, ఉద్యోగాలలో ఒడుదుడుకులు లేకుండా ప్రశాంతంగా ఉంటుంది 19, 20 తేదులలో క్రొత్త పనులవల్ల ఆదాయం, నిరుత్సాహకరమైన వార్తలు

* * *

## మిథునం •

**(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా )**

ప్రతివిషయంలోనూ నిష్ఠురప్రసంగాలతో మిమ్ములను నొప్పించే మనుష్యులు ప్రత్యక్షమవుతారు వృత్తి వ్యాపారాదులలో మీ శ్రమ ఫలిస్తుంది మధ్య మధ్య వచ్చే భయంకరమైన వార్తలవల్ల మీరే ఒక అడుగు వెనుకకు వేస్తారు కార్యభారం క్రమంగా దానంతట అదే తగ్గుతుంది విలువగల వస్తువులు కొంటారు ముందు ముందు ఎప్పుడో ఉపయోగించగల పనులనిమిత్తం ప్రయత్నాలు సాగుతవి అందువల్ల ఖర్చులున్ను పెరుగుతవి వాహనాలు వినియోగించుకునే సందర్భాలలో మెళకువ, నిదానము అవసరం పిల్లల మూలంగా సుఖ సంతోషాలు లభిస్తవి ముఖ్యమైన లెక్కలలో పొరపాట్లు రావటంవల్ల చిక్కులను ఎదుర్కొనవలసి వస్తుంది ఏ విషయంలోనూ మాట మిగలవద్దు 21, 22 లలో అసౌఖ్యము, శుభవార్తలు, క్రొత్తవారితో లావాదేవీలు

* * *

## కర్కాటకం •

**(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)**

తెల్లనివన్నీ పాలు అనుకుని మోసపోతారు శ్రమపడి ఒక పని సాధించిన తరువాత అసలు ప్రయత్నించకుండాఉంటే బాగుండునని అనుకుంటారు ర్థంలేని ఖర్చులు, కలహప్రసంగాలు వీటితో కాకు పెరుగుతుంది వృత్తిలో మాత్రం మీకు రియకుండా మీకు మేలు చేయగల మిత్రులు లభి ్తారు శుభవార్తలు తెలుస్తవి ఈ సమయంలో ఆస్తిపాస్తులు కొనటంకాని, మార్పులు చేయటం కాని అంత మంచిదికాదు తమ మనస్సులోని మాటను చెప్పకుండా మీ అభిప్రాయాన్ని, శక్తి సామర్థ్యాలను తెలుసుకొనటానికి ప్రయత్నించే వారుంటారు జాగ్రత్తగా ఉండండి కుటుంబంలోని వారి మాటతో మీరు ఏకీభవించలేకపోతారు ప్రయాణాలు చేస్తారు వారాంతంలో ధనలాభము, కార్యసిద్ధి పొందగలుగుతారు 16, 17 తేదులలో శుభవార్తలు, నౌకరులతో పేచీలు, అపవాదులు

* * *

## సింహం

**(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**

ఈవారం అంతా పోటీని ఎదుర్కొంటు, మీ డబ్బును మీరు ఖర్చు చేసుకుంటు ఇతరులవల్ల ఎక్కడ మాట వస్తుందోనని ఆందోళన పడవలసి వస్తుంది ఒక్కొక్క సమయంలో తెలిసే వార్తలు నిరుత్సాహాన్ని కలిగిస్తవి ఇతరులవద్దనుంచి రావలసిన డబ్బు వస్తుంది శుభకార్యాలు సులభంగానే నెరవేరవు, కాని, మాట దక్కుతుంది వ్యవహార రంగంలో మీ మాటకు ఎదురు వుండదు అకస్మాత్తుగా ఆదాయం పెరగగల అవకాశాలున్నవి వృత్తిలో కార్యభారం, అధికంగా కనుపించినా మంచి వారి స్నేహము, చివరకు సంతృప్తికరమైన ఫలితము లభిస్తవి ఈ సమయంలో ఒకరి నిమిత్తం ఎదురుచూడకుండా, ఉద్రేకాన్ని తగ్గించుకుని నిబ్బరంగాఉండి అవకాశాన్ని వినియోగించుకొనటం మంచిది 18, 19 తేదులలో ధనలాభం, నీచులతో కలహాలు, తొందరవల్ల దుబారా ఖర్చులు

* * *

## కన్య

**(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా)**

మనస్సుకు నిరుత్సాహం తోస్తున్నా తోటివారి మాటలవల్ల ధైర్యంతో ముందుకు పోగలుగుతారు ఆరోగ్యంగురించి జాగ్రత్తగా ఉండవలసిన సమయం త్రిప్పట అధికం అవుతుంది ఇతరుల సలహాలను తొందరపడి ఆచరించవద్దు మీ వీలునుబట్టి నడచుకొనటంవల్ల క్రమంగా ఫలితం పొందగలుగుతారు పుణ్య కార్యాలలో పాల్గొంటారు మిమ్ములను నిష్కర ప్రసంగాలతో చికాకు కలిగించటానికి ప్రయత్నించే మనుష్యులు దైవికంగా తమకు తామే చిక్కుకొంటారు వారం రెండవ భాగంలో లాభ వార్తలు తెలుస్తవి వ్యవహార విషయాలలో సాహసం పనికిరాదు కొన్ని సందర్భాలలో దండగలను భరించవలసి వస్తుంది మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకొనండి 21, 22 తేదులలో కార్యసిద్ధి, బంధువులవద్దనుంచి శుభ వార్తలు

* *

## తుల

**(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)**

ఒకచోట స్థిమితంగా ఉండటానికి అవకాశం తక్కువ పేరు, ప్రతిష్ఠలు బాగుంటవి ఒకరిద్దరు స్నేహితులు మిమ్ములను పొగడుతూ ఉంటారు అయితే వారివల్ల మోసం జరుగకుండా చూచుకొనటం అవసరం వృత్తిలో అదృష్టం కలసి రాతగిన సమయం మీ ఆలోచనలు సులభంగా, సకాలంలో కార్యరూపంలోకి వస్తవి రుణ, శత్రు బాధలు చాలావరకు తొలగిపోయి సుఖంగా ఉండగలుగుతారు పిల్లల మూలంగా ఖర్చులు అధికమవుతవి మీయందు మీ బంధు మిత్రులకు తోచిన సందేహాలు, అనాదరభావము తొలగిపోతవి కార్య భారంవల్ల సాధారణంగా శ్రమ తోస్తుంది కాని, ఉత్సాహము, స్నేహితులసహాయము బాగా లభిస్తవి అనుకున్నదానికంటె ఆదాయం పెరుగుతుంది 19, 20 తేదులలో ఖర్చులు అధికం, ఏ పనియందు ఆసక్తి లేకపోవటం

## వృశ్చికం

**(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)**

ఇంతకుముందు మీరు అనుకున్నవన్నీ ఈ సమయంలో ఒక రూపం పొందుతవి మీ ధైర్యానికి తోడు మీ మాటను సమర్థించి సహాయపడే మనుష్యులు లభిస్తారు దూరపు ప్రయాణాలను గురించిన ప్రయత్నాలు సకాలంలో ఫలిస్తవి మీ అంచనాకుమించి ఆదాయం పొందగల సమయం విలువగల వస్తువులు కొనే సందర్భాలలో పొరపాట్లు రాకుండా చూచుకొనండి కుటుంబంలోనివారి అభిప్రాయాలు మీకు అసంతృప్తికరంగా తోచవచ్చు ఇతరుల కార్యభారం పైన వేసుకొనటంవల్ల వివాదాలు రాకుండా చూచుకొనండి వారాంతంలో అకస్మాత్తుగా ఆదాయం పెరుగుతుంది ధర్మ కార్యాల నిమిత్తం ఖర్చులు 16, 17 తేదులలో స్వల్ప విషయాలలో చికాకు, విలాసాల నిమిత్తం ధనవ్యయం

* * *

## ధనుస్సు

**(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా)**

సమయానికి ఆలోచన తోచకపోవటంవల్ల అవకాశాన్ని జారవిడచుకుంటారు పట్టుదలతో ప్రయత్నిస్తేకాని, ఏ పనీ చేయలేకపోతారు కొన్ని సందర్భాలలో శ్రమ అధికం కావటంవల్ల విరక్తి కలిగే అవకాశాలున్నవి శుభ కార్యాలలో పాల్గొంటారు శనిస్తోత్రపారాయణం చేసుకొనటంవల్ల కుటుంబ ధనసమస్యలు తొలగి, వృత్తి, వ్యాపారాలలో నిలకడ, మంచి పేరు లభిస్తుంది వ్యవహార రంగంలో సాధ్యమైనంతవరకు ఓర్పుతో పరిష్కారమార్గంలో పోవటం మంచిది ఇతరుల వద్దనుంచి రావలసిన ధనం ఆలస్యంగా వస్తుంది ఉపకారం చేదామనే అభిప్రాయం ఈ సమయంలో మీకు ఎదురు తిరుగుతుంది జాగ్రత్త, చాలా ప్రీతితో తెచ్చుకున్న వస్తువులు మీకు వినియోగపడకపోవచ్చు 21, 22 తేదులలో శక్తికి మించి కార్యభారం, అధికారుల స్నేహం, సంచారం, స్వల్ప లాభం

* * *

## మకరం

**(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)**

ప్రస్తుతం ఏవిధంగానూ చిక్కులేకపోయినా గతకాలంలో జరిగిన సంఘటనయొక్క ఆందోళన మాత్రం మిమ్ములను విడువదు దైవబలం బాగున్నది ఈ సమయంలో ముందు మీరు చేయవలసిన పనులు నిర్ణయించుకోగలుగుతారు స్త్రీరాస్తులకు సంబంధించిన మార్పులు బాగా లభిస్తవి ఇతరుల సహాయంతో వృత్తిలో నిలబడగలుగుతారు ప్రయాణాలు చేయటంవల్ల ఉపయోగం ఉంటుంది దేహశ్రమ అధికం అవుతుంది ఇతరుల సలహాలను నమ్ముకుని లాటరీ, చట్టావ్యాపారంవంటి పనులలో దిగవద్దు బంధువులతో అభిప్రాయ భేదాలు రాగలవు ఏ సందర్భంలోనూ పట్టుదల చూపవద్దు 17, 18 తేదులలో ఆదాయవృద్ధి, బంధు దర్శనం

* * *

## కుంభం

**(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పా)**

ముందు మీరు అనుకున్న పద్ధతి ప్రకారం జరుపుకొనలేకపోతారు కాని ఇతర మార్గాలలో మీ ఆదాయం వృద్ధి అవుతుంది పరోపకారభారం క్రమంగా పెరుగుతుంది వక్ర మార్గాలలో సంచరించే మనుష్యులతో ప్రసంగించవలసి వస్తుంది మితంగా మాట్లాడుతూ, మోసం జరగకుండా చూచుకొనండి కుటుంబంలోని వారితో తరచు అభిప్రాయ భేదాలు వస్తున్నా ఓర్పుతో పరిష్కారము చేసుకొనగలుగుతారు అధికారము, హోదా పెరగగల సమయం ఈ సమయంలో మీ డబ్బుకాని, విలువగల వస్తువులుకాని మరొకరి చేతలో చిక్కుకొనకుండా చూచుకొనండి వృత్తి వ్యాపారాలలో ఏ సమయంలో ఏ విధంగా చిక్కు వస్తుందోనని ఆందోళన కలుగుతుంది వారాంతంలో చాలాకాలం ముందు జరిగిన పనులయొక్క ఫలితం అనుకూలంగా తెలుస్తుంది 19, 20 తేదులలో పనులలో ప్రతిబంధకాలు, ఇతరుల మాటమీద ఆధారపడవలసిన అవసరం

### ఈవారము ధరలు


బంగారు ధర క్రమంగా పెరిగి 14, 15 తేదులలో కొద్దిగా తగ్గవచ్చు వెండి ధరలో స్వల్పంగా మందీ సూచనలున్నవి ప్రత్తి ధర తగ్గుతుంది నూలు ధర తేజీలో నిలకడగా ఉంటుంది కందుల ధర మందీ వస్తుంది మినుములకు గిరాకి కనుపిస్తుంది వేరుశనగపప్పు ధర వారం రెండవ భాగంలో పెరుగుతుంది నూనె ధర మామూలుగానే ఉంటుంది నూవుల ధర బాగా పెరిగి వారాంతంలో తగ్గుతుంది చింతపండు ధర పెరుగుతుంది వెన్న, నెయ్యి ధరలలో కొద్ది తగ్గుదల తోస్తుంది

* * *

## మీనం

**(పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి)**

ఒకేసారి అనేక బాధ్యతలను చూచుకోవలసిన సమయం మొదట్లో డబ్బుకు కష్టపడవలసి వస్తుంది కాని, అతికష్టంతో ఆయా సమయాలలో మీ పనులు నిరాటంకంగా జరుగుతవి దూరపు ప్రయాణాలు చేయవలసి వస్తుంది అధికారులతో జరుగుతున్న సంప్రదింపులు అనుకూలంగా పరిష్కారం అవుతుంది ఈ సమయంలో మీరు ఏ పని చేసినా నిదానంగా లాభిస్తుంది కాని, ఇప్పుడే ఫలితం చేతికిరాదు మీ క్రిందపనిచేసేవారు పెడత్రోవలలో పోవటంవల్ల నష్ట సూచనలున్నవి ఆందోళనను తగ్గించుకుని మీ శక్తికొలది శ్రమపడి పదిమందిలో గౌరవం పొందతగిన సమయం సుబ్రహ్మణ్య స్తోత్ర పారాయణం మీకు అన్ని విధాలా రక్షణ, మనశ్శాంతి, ధైర్యము లభిస్తవి 18, 19 తేదులలో వస్త్రాలంకార వస్తు ప్రాప్తి పుణ్యకార్యాలు, బంధువులవద్దనుంచి శుభవార్తలు ★



పెద్దిభొట్ల సుబ్బరామయ్య

## జరిగిన కథ

కాళిదాసు ఇంటి వరండాలో ఆ తెల్లవారుజామున ఎవరో నెలన్నా నిండని పసిపిల్లవాణ్ణి విడిచి వెళ్ళారు భార్య మరణంతో, వృద్ధురాలైన తల్లి తప్ప వేరే ఆడదిక్కు లేని కాళిదాసు ఆ అనాథ బాలుణ్ణి పెంచడానికి ముందు సంకోచించినా, తరువాత సిద్ధపడి పని మనిషి అప్పలమ్మకు ఆ బాధ్యత అప్పగిస్తాడు స్నేహితుడు పట్టాభి, మామగారు ఎంత చెప్పినా కాళిదాసు రెండో పెళ్ళి చేసుకునేందుకు ఇష్టపడడు శంకరశాస్త్రి తనకూతురు రుక్మిణికి సంబంధం చూసి పెట్టమని కాళిదాసుని అడుగుతాడు

---

ఆనాడు ఆదివారం కాళిదాసు సూర్యోదయం కాకముందేలేచి, కప్పుకునివున్న దుప్పటిని తొలగించి చూసేసరికి చాపమీద పిల్లవాడొక్కడే పడుకుని కాళ్ళూ చేతులూ వూపుతూ ఆడుకుంటున్నాడు పనిమనిషి పెరటిలోనో, వీధి వాకిట్లోనో పని చేసుకుంటూవుంది కాబోలు

కాళిదాసు నిశ్చలంగా కూర్చుని పసివాడివంక చూస్తున్నాడు వాడు బోసినోరువిప్పి హఠాత్తుగా మతాబా వెలిగించినట్టు వెలుతురు కుమ్మరిస్తూ నవ్వాడు కాళిదాసు ఆశ్చర్యపోయాడు ఆ పసివాడు దేన్నిచూసి నవ్వుతున్నాడు? వాడు చూస్తున్నవైపు తెల్లని గోడతప్ప మరేమీలేదు

కాళిదాసు నెమ్మదిగా లేచి వెళ్ళి వాడి పక్కనే కూర్చున్నాడు వాడు చక్రాలవంటి కళ్ళను అతనివైపు తిప్పి కుడి చేతి వేళ్ళను బోసి నోటిలోవుంచుకుని మళ్ళీ నవ్వాడు ఇంతలో మురళీ రూబెనూ గుమ్మందాటి లోపలికి వచ్చారు వాళ్ళిద్దరూ కూడా అక్కడే చాపమీద కూర్చున్నారు కాళిదాసు వారిని చదువు వదిలిపెట్టివచ్చినందుకు ఏమీ అనలేదు మరో నిముషంలో వారు ముగ్గురూ ఆ పసివాడితో ఆడుకోవటం ప్రారంభించారు

కాళిదాసు వాణ్ణి భుజంమీదికి ఎత్తుకోవాలని ప్రయత్నం చేశాడు మురళి మోకాళ్ళమీద కూర్చుని "మేష్టారూ జాగ్రత్త మెడకింద చెయ్యి వెయ్యండి లేకపోతే లేత మెడ విరిగిపోతుంది" అన్నాడు మేష్టరు పిల్లవాణ్ణి ఎత్తుకుంటూవుంటే రూబెన్ వింతగా చూస్తున్నాడు

కాళిదాసు కిదొక కొత్త అనుభూతి అతని యిరవై ఎనిమిదేళ్ళ జీవితంలోనూ ఎన్నడూ రోజుల వయస్సులోవున్న పిల్లల నతడు తాకనైనాలేదు అతని అక్కగారు కాన్పుకు యిక్కడికి వచ్చినప్పుడు కూడా ఆ ముచ్చట తీరలేదు ఆమెకు మొగ పిల్లవాడు పుట్టాడుకాని పుట్టిన నాలుగైదు రోజులలోనే కన్ను మూశాడు

ఇప్పుడీ అనుభూతి హాయిగానేవుంది జాగ్రత్తగా వాడికేమీ నొప్పి కలగకుండా ఎత్తుకుని భుజంమీద పడుకోబెట్టుకోగానే వాడు బుల్లి చేతులతో అతని జుట్టును పట్టుకుని పీకుతూ కేరింతాలు కొట్టటం ప్రారంభించాడు

మురళి "మేష్టారూ! నేను కూడా ఒకసారి ఎత్తుకుంటానండి" అని అడిగాడు కాళిదాసు వాడికి పిల్లవాణ్ణి అందించబోతున్నాడు ఇంతలో పనిమనిషి వెనకనుంచి "అయ్యో! బాబులూ! ఆయన్నట్టా కుదేస్తున్నారు గుడ్డలు పాడు చేస్తాడు" అన్నది కాళిదాసు 'అమ్మబాబోయ్' అంటూ వెంటనే పిల్లవాణ్ని క్రింద పొత్తి గుడ్డలలో పడుకోబెట్టాడు మురళి కోరిక తీరనేలేదు రూబెన్ మురళిని వుడికిస్తూ "ఊ! ఇప్పుడెత్తుకో చూద్దాం" అంటున్నాడు

పనిమనిషి గది వూడుస్తూ "బాబుగారూ! నేనేదో చెప్పాననుకోక ఒక ఉయ్యాల కొనుక్కొరండి పెద్ద పెద్ద షాపుల్లో అడిగితే యాభైలూ వందలూ చెబుతారు మా అల్లుడు మొన్న తిరిగి తిరిగి అంత పెట్టికొనలేక పది హేను రూపాయ లిచ్చి నాటుకొయ్య పనివాళ్ళచేత ఒక ఉయ్యాల చేయించుకొచ్చాడు అదీ బాగానేవుంది" అన్నది

కాళిదాసు 'అలాగే' అంటూ పెరట్లోకి వెళ్ళిపోయాడు అతడు కాలకృత్యాలు తీర్చుకుని వచ్చేసరికి కుంపటి సిద్ధంగావుంది దానిమీద నీళ్ళు పడేసి అతడు ముందుగదిలోకి వచ్చేసరికి పేపరు కుర్రవాడు, దిన పత్రిక యిచ్చి వెళ్ళిపోయాడు అప్పటికి ఆరు గంటలు దాటింది మురళీ రూబెనూ సమిష్టిగా ఏదో బండలెక్కను సాధించేందుకు ప్రయాసపడుతున్నారు గడియారానికి కీ యిచ్చి కాళిదాసు వంట యింట్లోకివెళ్ళి కాఫీ కలుపుకుని త్రాగి ఒక అరగంట తర్వాత ముందు గదిలోకి వచ్చాడు

కుర్చీలో పేపరు మొహానికి అడ్డంగా వుంచుకుని చదువుకుంటున్నాడొక వ్యక్తి కాళిదాసు అతని కాలి చెప్పులను చూ ...ర్తుపట్టి "అరె! నేనే మీ యింటికి వద్దామను కుంటున్నాను ఏమి తోచ దివ్వాళ " అన్నాడు మొహానికి అడ్డంవున్న దిన పత్రికను పక్కకు తప్పించి "అలా భక్తులు కోరినప్పుడు దర్శన మివ్వడం మా ధర్మం" అన్నాడ పట్టాభి

కాళిదాసు "సరిగా కాఫీవేళకు బయలుదేరి వచ్చావుగాని పాపం, ఏమీ లాభంలేదు మరీ పొదుపుగా కాఫీ పెట్టడం ఎవరైనా నా దగ్గరే నేర్చుకోవాలి ఒక్క మనిషికి కావాలి అనుకుంటే తూచినట్టు ఒక్క మనిషికే సరిపడ కాఫీ తయారు చేస్తాను నువ్వు వస్తావని ముందుగా కల అయినా వచ్చివుంటే మరో రెండవున్సుల నీళ్ళు ఎక్కువగా పడేసేవాణ్ణి" అన్నాడు

పట్టాభి నవ్వి "అయినా మనకు మంచి కాఫీ త్రాగే అలవాటు తప్పిపోయి చాలా రోజులైంది మళ్ళీ గృహలక్ష్మి ఇంట్లో అడుగుపెట్టిన తర్వాతనే ఫిల్టరు కాఫీ" అన్నాడు కాళిదాసు కుర్చీలోనుంచి లేచి "మంచి కాఫీ అంటే ఫిల్టరుచేస్తేనే వస్తుం దనుకోవడం భ్రమ ఆ తీపి కలిపే చేతుల్లో వుంటుంది నువ్వు ఫిల్టరుచేస్తే తప్ప కాఫీకి రుచి రాదనుకుంటున్నావులావుంది అదేమిటో నేను చేసి చూపిస్తాను" అంటూ వంట యింట్లోకి పోబోయాడు పట్టాభి అటూ యిటూ చూసి "అన్నట్టు నీకు దొరికిన చిరంజీవిఎక్కడ? ఉయ్యాల ఏదీ?" అని అడిగాడు కాళిదాసు నవ్వి "అబ్బే! యింకా అలాటిదేమీలేదు పగలల్లా పనిమనిషి యింట్లో వుంచుకుంటుందని చెప్పానుగా ఆమె యిందాకనే వెళ్ళిపోయింది రాత్రికిగాని వాడి దర్శనం లభించదు" అంటూ లోపలికి వెళ్ళాడు

అవతలివైపు ప్రపంచలో మురళి ఎలా పసిగట్టాడో తెలియదు రూబెన్‌తో "విన్నావా? అది లెక్కల పట్టాభిగారి గొంతుకదూ!పోయి యీ లెక్క ఎలా చెయ్యాలో అడుగుదాం రా" అన్నాడు మరుక్షణంలో యిద్దరూ కలిసి లోపలికివచ్చి, పట్టాభికి నమస్కరించి, "ఈ లెక్క రావడం లేదండి" అన్నారు అత డాశ్చర్యపోయి "మీ రెక్కడినుంచి వూడిపడ్డారోయ్? ఇక్కడ చదువుకుంటున్నారా యేం? ఏమిటా లెక్క? ఇలా యివ్వండి" అంటూ లెక్కల పుస్తకం చేతిలోకి తీసుకుని రెండు మూడు నిముషాల్లోనే దాన్ని సాధించి వారికి వివరించిచెప్పి పంపించాడు

తరువాత మరో అయిదు నిముషాల్లోనే కాళిదాసు వేడిగా పొగలు కక్కుతున్న కాఫీ తెచ్చి పట్టాభికి అందించాడు పట్టాభి 'థ్యాంక్స్' అంటూ కప్పు అందుకుని రుచి చూసి "హారినీ! కాళీ! నువ్వింతటి సమర్థుడవని నేననుకోలేదుసుమా ఫిల్టరు కాఫీకి మాత్రం యీ రుచి ఎలా వస్తుంది" అన్నాడు

కాళిదాసు కాస్సేపాగి "నీకో మంచి కథ చెప్పనా పట్టాభీ" అంటూ అలమారులోనుంచి రూబెన్ తండ్రి యిచ్చిన హుండీతీసి పట్టాభి చేతికిచ్చి "ఈ మట్టి పాత్రకు నోరూ వాయీ లేదుగాని, అదే మాట్లాడగలిగిన పక్షంలో మనస్సును కరిగించే ఒక మంచి కథ చెబుతుంది ఒక తండ్రి కొడుకుమీద తన ఆశలన్నిటినీవుంచి, అతనికోసం తన సర్వస్వమూ ఎలా ధారపోస్తున్నాడో నీకు చెప్పనా" అని అడిగాడు పట్టాభి ఉత్కంఠతో "అంత మంచి విషయమైతే చెప్పు వింటాను" అన్నాడు

కాళిదాసు, రూబెన్ తండ్రి తనతో మాట్లాడేందుకు రావడంతో మొదలుపెట్టి, తాను గడియారంకొని యివ్వడందాకా అంతా పట్టాభికి చెప్పాడు పట్టాభి తలవూపి "నిజమే ఈ కథ చాలా అద్భుతంగా వుంది" అన్నాడు

గుమ్మంలో నిలబడివున్న రూబెన్ అంతా విన్నట్టున్నాడు వాడు సంతోషంతో పరిగెత్తుకుపోయి పుస్తకాలు సర్దుకుని "మురళీ! నువ్వూ వస్తావా మా యింటికి? గడియారం చూద్దువుగాని " అని అడిగాడు

ఇద్దరూ పుస్తకాలు సర్దుకుని బయలుదేరారు రూబెన్ గుమ్మంముందు నిలబడి "గడియారం కొన్నట్టు నాతో చెప్పనేలేదేం మేష్టరూ? అయినా అంతా యిప్పుడ ...న్నానులెండి మురళీ,రారాపోదాం" అన్నాడు

వా రిద్దరూ వెళ్ళిపోగానే పట్టాభి హుండీ కాళిదాసు చేతికిచ్చి "ఇంతవరకూ బాగానేవుంది ఇవాళ మనకు కాలక్షేపం ఏమిటంటావు?" అని అడిగాడు

కాళిదాసు నవ్వి "కాలక్షేపానికేం? చాలావున్నాయి ఒకటి కబుర్లు చెప్పుకోవడం రెండు క్యారమ్సు ఆడుకోవటం మూడు ఇవాళ నాకు పాక కళలోవున్న ప్రావీణ్యం అంతా వొలికించి వండే వంట రుచి చూడటం నాలుగు సాయంకాలం ఎక్కడైనావెళ్ళి హాయిగా తిరిగి రావటం" అన్నాడు

పట్టాభి "తీర్మానాన్ని ఆమోదిస్తున్నాను ఈ పూట అయినా హోటలు కూడుతినే దురవస్థ తప్పుతుంది అయితే చివరలో ఒక చిన్న సవరణ సాయంకాలం అనవసరంగా తిరిగే బదులు అక్కడ "అమ్యూజుమెంట్ సెంటర్లో" ఏవో నాట్యాలుంటాయిట చూసి రావడం ఉత్తమం మా యిల్లుగల ఆసామీ చూసివచ్చి తెగ పొగుడుతున్నాడు" అన్నాడు కాళిదాసుకు వాటిని గురించి ఏమీ తెలియదు "పోనీ అలాగేచూసి వద్దాంలే" అన్నాడు

ఇద్దరూ కొద్దిసేపు కులాసాగా మాట్లాడుకున్నారు తర్వాత కాళిదాసులేచి "క్యారంబోర్డు ఆమూలవుంది యీ లోపల యివతలికి తీసి దుమ్ము దులిపి చాపమీదవుంచు" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు

పట్టాభిలేచి గడియారంవంక చూశాడు తొమ్మిదిన్నర అయింది అతడు కాళ్ళకువున్న చెప్పులువిప్పి మూలగావున్న క్యారంబోర్డును బయటికి తీశాడు దానిమీద దుమ్మూ ధూళీ పడకుండా గుడ్డ చుట్టివుంది అందులోనే 'కాయిన్స్' కూడా వున్నాయి పట్టాభి గుడ్డతీసి అవతల పడేసి బోర్డును చాపమీదవుంచి 'కాయిన్స్' బోర్డు మీద పేర్చాడు గుమ్మంలో అడుగుల చప్పుడు వినిపించి వెనుదిరిగిచూస్తే పొద్దుటి శిష్యులు యిద్దరూ నిలబడి వున్నారు పట్టాభి పెద్దగా "ఏమోయ్ కాళీ! మీ శిష్యులిద్దరూ కూడా వచ్చారు మనం డబుల్స్ ఆడుకోవచ్చు త్వరగా రా" అన్నాడు లోపలినుంచి "వెరీగుడ్ స్నానం అయిపోయింది వచ్చేస్తున్నాను వాళ్ళను కూర్చోమని చెప్పు" అని జవాబు వినిపించింది

కాళిదాసు మరో అయిదు నిముషాల్లో ముందు గదిలోకి వచ్చాడు అతడు చలువ దోవతితీసి కట్టుకుని సిద్ధంఅయి "మనం సవ్యసాచివంటివారం ఇటు యీ వినోదమూ, అటు వంటా రెండూ ఒక్కసారే అయిపోగలవిధంగా ఏర్పాటు చేసి వచ్చాను" అన్నాడు పట్టాభి నవ్వి "చంపావుపో ఆట సందట్లోపడి అన్నం మాడి బొగ్గులైపోయిన తర్వాత వెళ్ళి చూస్తావేమో అలాంటిదేమయినా జరిగితే మటుకు మనిద్దరం మా హోటలుకువెళ్ళి ఆ గడ్డి తినటంతప్ప మార్గాంతరం వుండదు జాగ్రత్త" అన్నాడు కాళిదాసు "ఆ ప్రమాదం లేదులే" అంటూ బోర్డు దగ్గర కూర్చున్నాడు

మురళి "నేనూ మేష్టారూ ఒక పార్టీ" అంటూ కాళిదాసు కెదురుగా కూర్చున్నాడు రూబెన్ పట్టాభి కెదురుగా కూర్చున్నాడు పట్టాభి రూబెన్‌తో "హుషారుగా ఆడవోయ్ అదెలాగూ వోడిపోయే జట్టే" అన్నాడు

కాళిదాసు 'కాయిన్స్' పేర్చుతూ "ఈ బోర్డును నేను బాగా బ్రతికిన రోజుల్లో—అంటే రెండేళ్ళ

(39 వ పేజీ చూడండి)

---

ఒకనటుడు, ఒకానొక నిర్మాతతో ఇలా విన్నవించుకొన్నాడు

అయ్యా తమరు తీయబోయే చిత్రంలో నాకు హీరోవేషం ఇప్పించండి

నిర్మాత అలాగే ఓ డిస్ట్రిబ్యూటర్ను కూడా పట్టుకురా నాయనా!

కె. గోపాల్ రావు (మద్రాసు)

---

# డీట్రిక్ కథ


★ ★ ★

ట్యూటానిక్ ఇతిహాసాలలో చక్కని కథలు ఎన్నో ఉన్నాయి. వాటిలో డీట్రిక్ కథ ఒకటి. ఇతర కథలు కూడా వీలువెంట ప్రచురించ దలచాము.

★

★

★



పూర్వం బెర్న్ సామ్రాజ్యాన్ని డీట్‌మర్ మహారాజు పరిపాలిస్తూ ఉండేవాడు ఆయన గొప్ప పరాక్రమవంతుడు ఉత్తముడు ఆ మహారాజుకో అందాల కుమారుడు అతనిపేరు డీట్రిక్ కుమారునకు విరోచితమైన విద్యలన్నింటిలోను ప్రావీణ్యం గరిపి, గొప్ప యోధుడుగా తయారు చెయ్యాలని మహారాజు సంకల్పించాడు

ఒకరోజున డీట్‌మర్ మహారాజు కొలువుతీరి ఉన్నాడు మంత్రులు, సేనానులు, ఇతర ప్రముఖులు వారివారి స్థానాలలో కూర్చుని వున్నారు ఇంతలో ఒక యోధుడు అక్కడికి వచ్చాడు అతడే వాల్డెబ్రాండ్ బెర్న్ సామ్రాజ్యంలో ఆపేరు వినని వాళ్ళుంటూలేరు అతడు అనేక యుద్ధాలలో తన పరాక్రమం ప్రదర్శించి శత్రువులను హతమార్చినవాడు ఖడ్గ విద్యలోను ఇతర అస్త్ర విద్యలలోను అతనికి అతడేసాటి అనిపించుకున్నాడు డీట్‌మర్ మహారాజు ఆ యోధుణ్ణి యథోచితంగా గౌరవించి, తన ఆనందాన్ని ప్రకటించాడు తన కుమారునకు అస్త్రవిద్యలు నేర్పి మహాయోధుడుగా చేయగల గురువు ఇతడేనని మహారాజుకు అనిపించింది వెంటనే డీట్రిక్ రాకుమారుణ్ణి అక్కడికి రప్పించాడు రాకుమారునకు అప్పటికింకా ఏడు సంవత్సరాలన్నా నిండలేదు మహారాజు ఆ పసివాని చెయ్యి హిల్డెబ్రాండ్ చేతిలోఉంచి, 'ఓ యోధుడా! నీ పరాక్రమం, నీధైర్య సాహసాలు ఎరుగనివాళ్ళులేరు ఈ రాకుమారుణ్ణి నీ అంతటివాణ్ణి చెయ్యి ఇదే నా కోరిక అని గంభీరంగా అన్నాడు

డీట్రిక్ రాకుమారుణ్ణి వాల్డెబ్రాండ్ వాత్సల్యంతో దగ్గరకు తీసుకున్నాడు ఆ నాటినుండి వానికి శిక్షణ ప్రారంభించాడు క్రమ క్రమంగా డీట్రిక్ రాకుమారుడు వాల్డెబ్రాండ్‌కు తెలిసిన విద్యలన్నీ నేర్చుకున్నాడు కత్తిసాములోనైతేనేమి, ముష్టియుద్ధంలోనైతేనేమి, ఇతర ఆయుధాల ప్రయోగంలోనైతేనేమి హిల్డెబ్రాండ్ అంతటివాడయ్యాడు గుర్రపుస్వారీలో ఆరితేరాడు అతని బుద్ధి కుశలత, సామర్థ్యంచూచి వాల్డెబ్రాండ్ హృదయం ఆనందంతో నిండిపోయింది వ రి గురుశిష్య సంబంధం రాను రాను స్నేహంగా పరిణమించింది ఒకరి నొకరు విడిచి ఉండలేనంతగా ఆ స్నేహం వృద్ధిచెందింది

డీట్రిక్ రాకుమారుడు పెరిగి పెద్దవాడయ్యాడు మానూగు మీసాల నూత్నయౌవనం అతని రూపురేఖలను తీర్చిదిద్దింది నిరంతర వ్యాయామంవల్ల అతని శరీరం వజ్రతుల్యమైంది కండలు తిరిగిన అతని బాహువులు విశాల వక్షస్థలం అతడు మహాయోధుడని చెప్పక చెబుతున్నాయి ఉత్సాహం అతని కన్నులలో తొణికిసలాడుతోంది తన విద్య, పరాక్రమం ప్రదర్శించేందుకు తగిన అవకాశం కోసం ఆ రాకుమారుడు ఎదురు చూస్తున్నాడు

ఇలా ఉండగా గ్రిమ్, వాల్డే అనే రాక్షసదంపతులు బెర్న్ సామ్రాజ్యంలో ప్రవేశించి, నానా భీభత్సం చేస్తున్నారు గ్రామాలకు గ్రామాలు తగులబెట్టి ప్రజలను హింసిస్తున్నారు ఎందరో గ్రామీణులు వారి దుండగాలకు బలి అయ్యారు డీట్‌మర్ మహారాజు ఈ వార్తలువిని ఉగ్రుడయ్యాడు వెంటనే పెద్ద సైన్యాన్ని సమకూర్చుకొని ఆ

(35-వ పేజీ చూడండి)



# చదూ సంజెలు కథ

## బుడుగు

చదూసంజె లంటే — ఇప్పుడు మీ బాబాయి ఉన్నాడా వాడి దగ్గర ఉండవూ, అవన్నమాట దీన్నే బామ్మలు చదూసంజా అంటారు నాన్నలేమో— అలాంటే గోపాళం అన్నమాట ఏం వాళ్లేమో చదూ సంజె లంటారన్నమాట ఇవి మరి బాబాయి దగ్గర లేవుగదా ? వాడి దగ్గర బుద్ధి, డబ్బులు కూడా లేవుట కాని ఒకటో వ్ఫదో అయిడియా లుంటాయి అయిడియాలంటే నాకు తెలీదు ఇంకానేమో కావెట్రులు, సిగరెట్టులు ఉంటాయి కావెట్రు లంటే అవి చూట్టానికి కాయితాలలా ఉంటాయన్న మాట సిగరెట్టులు తెల్లగా ఉంటాయి అగరెత్తులు నల్లగా ఉంటాయి అగరెత్తులు గోడ మీద గుచ్చి కాలుస్తారు ఇవేమో నోట్లో గుచ్చి కాలుస్తారు ఇవి మొగాళ్లే కాలుస్తారుట బామ్మ అగరెత్తులు కాలుస్తుంది

రెండుజెళ్ల సీత కూడా పిగరెట్టులు కాల్చదుట అయినా బామ్మ రేపో ఇప్పుడో కూడా దాన్ని అరుగు మీంచి చూసి యిలా నవ్వేసింది గదా భూడూ, భూడూ మొగరాయుళ్లా ఎలా నడుస్తోందో అంది అప్పుడేమో నేను పరిగేరుకెళ్లి సీతని అడిగాను గద సీతా నువ్వు సిగరెత్తులు కాలుస్తావుగదా అని హా అని అది హచెరపడిపోయేసింది ఎవర్చెప్పార్రా అంది మా బామ చెప్పిందీ అన్నాను అప్పుడేమో రెండుజెళ్ల సీత బాబాయికి రోడ్డుమీద ప్రెవేటు చెప్పేసింది ఖోపంగా ప్రెవేటు చెప్పడం అంటే కొట్టడం అన్నమాట ఇలా మొట్టికాయ కొట్టి, చెవులు మెలిపెట్టి హన్న అంటారూ అది పాపం నాకు చిన్నప్పుడు కుంభెం ఫదిమందో ఒక మందో ప్రెవేటు మేష్టర్లొచ్చారుగదా కాని బ్భయపడి పారిపోయారులే కొట్టకుండా తిట్టినా కూడా ప్రెవేటు చెప్పడమే ఏం రెండు జెళ్ల సీత బాబాయికి ప్రెవేటు చెప్పేసిందా మరేమో బాబాయి నాకు గుండుమీద కుంభెం ప్రెవేటు చెప్పి పరిగేరుకుని బామ్మ దగ్గరి కెళ్లాడు (బామ్మకి మడి గదా అందికని దూరంగా ఉండి) గారిగా అరిచి ప్రెవేటు చెప్పేశాడు అప్పుడేమో బామయ్యింకా గాఠిగా అరిచి వాడికి ప్రెవేటు చెప్పేసి తాతగారి కుశో దగ్గరికెళ్లి ఇలా ఏడిచేసింది అప్పుడేమో మా గోపాళం కూడా వచ్చి బాబాయికి ప్రెవేటు చెప్పేశాడు చదూ సంజెళ్లేవా అలానేసి ఖోప్పడేశాడు

ఈ చదూసంజెలు లాకపోతే అస్సలు డేంజరుట డేంజరంటే మనికి తెలీదు కాని యివి మందగ్గిర లాకపోతే మనికి—అంటే బాబాయికిలే—రెండుజెళ్ల సీత నిచ్చి పెళ్లి చెయ్యరన్నమాట కాని ఫెళ్లి కూడా డేంజెరేనుట ఇలాని లావుపాటి పక్కింటి పిన్నిగారి ముగుడు చెప్పాడు హాయిగా చదూసంజె లేకపోతే లావుపాటి పక్కింటి పిన్నిగారి నిచ్చి పెళ్లి చెయ్యరుట అప్పుడేమో ఇంచక్కా జెటకాబండీయో, రైలింజనో తోలుకొని పోలీసువాడిలా కూచుని పేపరు చదువుకోవచ్చుట ఇలాని వాడు చెప్పాడు వాడు ఛాలా మంచివాడు నా కిష్టం కుంభెం గుండుం టుందనుకో మా నాన్న ఆఫీసులో విగ్గులేని ఎముడు లేడూ వాడికీ గుండుంటుంది విగ్గులేని ఎముడంటే మేనేజరుట ఇలాని మా నాన్న చెప్పాడు మేనేజరంటే నాకు తెలీదు

కాని వుర్రేయ్ నువ్వు సీగాన పెసూనాంబని ఫెళ్లి చేసుకోవా లనుకో అప్పుడు మందగ్గిర చదూసంజెలు ఉండాలిట లాపోతే పెళ్లి చెయ్యరుట

అనగనగా హో రాజు లేడూ ? వాడి కొడుకు పాపం రాజకుమార్తిని ఫెళ్లి చేసుకోవాలా ? అప్పుడు వాడు ఫదిమందో, నూరుమందో రాచ్ఛసులిని చంపాలిగదా ముందర మనంకూడా అంతేనుట కాని యిప్పుడు రాచ్చసులు అయిపోయారు చంపడానికి లేరుట అందుకని యిప్పుడేమో మనం పదమూడో ఎక్కం, ఎబిపాటం ఇవన్నీ చదువుకోవాలిట అవి వచ్చేస్తే రాచ్ఛసులు చచ్చిపోతారుట మనం బాగా చదూకుని వ్ఫది కాణీలో, వంద కాణీలో తెచ్చినా రాచ్ఛసులు చచ్చిపోతారుట రాపోతే సీగానపెసూనాంబ నిచ్చి ఫెళ్లి చైరనమాట ఇలాని మా రాధ చెప్పింది రాదంటే అమ్మలే

అందికని వెదవది చదూ సంజెలు మందగ్గిర రాకపోతే ఖష్టంట అసలవి లాకపోతే ఫెళ్లి చెయర్ట ఫెళ్ళంటే సీగానపెసూనాంబ బండరావుడు, ఇంకానేమో బాళ్ల సీత మనందరం ఆడుకోడం, ఫెళ్లేకాదు జీవితం కూడా ఖష్టంట ఇవి లేపోతే జీవితం అంటే నాకు తెలీదు ఇలాని బాబాయి అంటాడు రెండు జెళ్ల సీత నవ్వకపోతే ఏం పదమూడో ఎక్కం ఖద చెప్పనా

అనగనగనగనగనగన ఒ క రో జు న

ఉరేయ్ కుంచెం వుండు ఇది రాసిపెట్టిన వాడూ, బొమ్మ వేసిపెట్టినవాడూ నా పేరు చెప్పు నా పేరు చెప్పు అని గోకేస్తున్నారు చదూ సంజెలు లాకపోతే ఇలా ఖష్టపడాలిగదా ఇది రాసి పెట్టినవాడి పేరు ముళ్లపూడి వెంకటరమణట బొమ్మ వేసినవాడి పేరు వురేయ్ నన్ను చూసి నవ్వుతున్నావుకదూ నీ పేరు చెప్పను ఫో

ఏం ఖద చెప్పేస్తా నంతే అనగనగనగనగనగా ఒక రోజున ★



రాక్షసుడూ పదమూడో ఒక్కటి ఖద!
బురుగూ బురుగూ! చూశావా- మరేమొం నేనూ వాళ్ల సేతా ఆలుకుంటానేమో మరేమో వాళ్ల బెద్దన్నయ్యొవచ్చి దాన్ని లాక్కెళ్లిపోయి, నన్ను ఛో అని
ఏడవ్వకురా గోపీ - నేను నేపో ఘవిరోలకోయిలా బెద్దవాణ్ణాయి పోతాంగా. అప్పుడు వాణ్ణి నడ్డిమీద ఛంపేదాం - ఏఁ?
ఒద్దమ్మా- నేను బెద్దవాణ్ణయ్యే లోగా నీకో ఖద చెప్పనా- అనగనగనగన గనగనగనగనగనగనగనగన
గనగన వద్దు- ఖద చెప్పు
చెప్పేస్తా చెప్పేస్తా- అనగనగా ఒక రాజు- ఆ రాజుకేమో బొమ్మని కొడుకు- నీ లాగే అరుస్తూ యెంథో ముద్దొస్తాడు
చక్కాగి గిరజుల జుట్టుతో, పేద్దకత్తి పట్టుకుని- అంటే కత్తి జుట్టుతో కాదు- చేత్తో పట్టుకుని సింహాన్ని పులుల్ని యేనుగుల్ని ఛంపేసేవాడు


ఆ రాజుగారి ఇంటికి ఎదూరు కుండా
ఇంకో కృష్ణం రాజుగారుండే వారు –
ఆయనకి ఓ కూతురు - ఇంచక్కా
గానపెసూనాంబంత బొంటుంది
వాళ్ళిదరూ రోజూ ఇంచక్కా ఆడు
కునేవారు - వాళ్ళమ్మ బెల్లప్పు జీళ్ళు
చెగోడీలు, మరమరాలూ బోల్డు
పెట్టేది - రాజుగారింటో పెద్ద గది
నిండా జీళ్ళూ, ఇంకో గది నిండా
జాంగ్రీలూ వుంటాయి గదా
ముంజెల బండీల్లు?
మూడు చక్రాల
సైకిళ్ళ్గా
ఓ! అవి కూడా ఘదా
యాభయో వుంటాయి
ఇంకా తాటాకు
బొమ్మలు, రిబ్బన్లూ –
ఐస్క్రీములూ, కాగితాలూ –
బుటాకోలూ, గోపిగాళ్ళూ
ఇధ
చె..
సర్లే సర్లే సర్లే - ఆ రోజున
యువరాణీ యువరాజూ
ఆడు కుంటూ వుండగా
ఏమైందంటే - ఆc - ఆc -
దాబడుమూతాలాటలో యువరాజు
కళ్ళుమూసుకుని వుండగా - ఓ
బేద్ధ రాఖ్షసుడు యిలా వచ్చేశాడు
వచ్చేసి యువరాణీని ఎత్తుకు
పారిపోయాడు - వాడి కోటలో
దాచేశాడు యువరాజు కళ్ళు
తెరిచేసరికి రాణీ ఏదీ! లేదు!!
?!
'యమ్మో' అని ఏడుద్దామని అనుకునే
లోపలే ఓ పేదరాసి పెద్దమ్మ వచ్చి
'ఏందుకేడుద్దామని అనుకుంటున్నావ్
అబ్బాయీ' అని అడిగిందని చెప్పాడు
'మా సీత నాకు తెలుసు - రాక్షసుడి
కోటలో ఏడుస్తోంది!' అంది పెద్దమ్మ
మరి ఎలాగా అని ఏడిచేశాడు రాజు


బయుపడకు - నేను నీకు కీలుగుర్రం ఇస్తాను - అందుమీద వెళ్ళి రాచ్ఛసుళ్ళో ఛంపేసి సీతని తెచ్చుకో అంది పెద్దమ్మ
హ్రాం హ్రీం హ్రూం
అప్పుడే మా యువరాజు ఆ కీలుగుర్రం ఎక్కి 'జై కీలుగుర్రం! రాచ్ఛసుడి వాళ్ళింటికి పదా!' అనేసరికి అదేమో యిలా జూూంమని ఎగిరి పోయింది
చల్ చల్
రాచ్ఛసుడింటి దగ్గిర వీదిలో ఇంకో పెద్ద రాచ్ఛసుడున్నాడు వాడు...
ఒరేయ్ యువరాజూ - నీకుమరి 'సీరాముని పై చేతను' పజ్జెం వచ్చురా?
రాదు
అయితే పో వెదవా - పోయి చదూకో
యువరాజు ఇంటికొచ్చి వాళ్ళమ్మనడిగి ఆ పజ్జెం ఘబ ఘబ నేర్చేసుకుని - పరిగేత్తుకెళ్ళి రాచ్ఛసుడికి అప్పచెప్పాడు సరేలని లోపలికి వదిలాడు వాడు
లోపల ఇంకొ రాచ్ఛసుడున్నాడు
వురేయ్ - నీకు సిబి చక్రవర్తి పాటం వచ్చిందిరా? ఆర్యులనగా నెవరు?
అది మాబాబాయి బళ్ళో పాటం - నన నాకు తెలీదు
మీకూవుంది - చదుకో - లేపోతే వెళ్ళో -
యువరాజు పరిగేత్తుకొచ్చి సిబి పాటం, ఆర్యులపాటం చదివేసి మళ్ళీ పరిగేత్తుకెళ్ళి అప్పచెప్పేశాడు సర్లే లోపలకెళ్ళు అన్నాడు రాచ్ఛసుడు


లోపల ఇంకో పెద్ద రాచ్ఛసుడున్నాడు సీతకి ప్రెవేటు చెప్పేస్తున్నాడు
ఓరే రాచ్ఛసా! మా సీతని వదిలెయ్యి! లాపోతే ఈ కత్తితో నీ నడ్డిమీద ఛంపేస్తా యుద్ధం చేసి
ఒరేయ్-నాదగ్గిర కత్తిలేదు నా ఎలా యుద్ధం చేస్తావు? పోనీ నీకత్తి ఒకసారు ఇవ్వవా పోరి?
అమ్మ! ఆశ! దోశ!!
మరి యుద్ధం చెయ్యపోతే ఎలా చంపుతావు నన్ను- ఎలాగంటు?
అవునెలాగా? మరెలాగా? ఇంకెలాగా?
హహ్హహ్హా
ఒరేయ్- నువ్వలా గాట్టిగా నవ్వకు
ఒరేయ్! పోనీ-నీకు పదమూడో ఎక్కం వచ్చునా?
నాకు రాదే- మా బాబాయి కూడా రాదని నా అవమానం
నాకూ రాదు
అయితే నేనే గెల్చాను ఫో- సీతని ఇవ్వను-పారాఫో- వెళ్ళు-
అప్పుడు యువరాజు పరిగెత్తుకుంటూ కెళ్లి వీధులోని వాళ్ల బాబాయి నడిగాడు
ఇప్పుడు ఎక్కం లేదూ పిక్కం లేదు గొడవ చెయ్యకు - బిజీగా వున్నా-ఫో
4



వాళ్ల లావుపాటి పక్కింటి పిన్నిగారి మొగుడు, పకోడీల నారాయణా వాళ్ళ బామ్మా, ఆ ఖరికి పేదరాసి పెద్దమ్మ కూడా తెలీదంది -
తెలీదు
తెలీదు
తెలీదు
తెలీదు
చివరకి వాళ్ళ నాన్నకి వచ్చుని చెప్పారు అప్పుడు పరిగెత్తుకుని వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్ళాడు. వాడు ఎక్కాల బుక్కు తీసి ఎక్కం చెప్పాడు
అప్పుడా పదమూడో ఎక్కం ఘుభఘుభా మంత్రంతో పట్టేసి మళ్ళీ రాచ్చసుడి దగ్గరకెళ్ళా ఘుటా నించుని - పదమూడొకట్లు పదమూడు పదమూడు పదులు నూటముప్ఫై అని గడ గడా అప్పచెప్పేశాడు
అప్పుడు రాచ్చసుడు హా! అని అరిచి కింద హాచ్చెర్యపడి పోయాడు అప్పుడు రాజు సీతని ఎత్తుకుని యిలా రక్షించేసి తీసుకొచ్చేశాడు
హాచ్చెర్యం!
జై!
అప్పుడు రాజుకీ సీతకీ పెళ్ళి మని పెళ్ళయింది - కాజాలూ, బూందీలూ జాంగ్రీలూ చేగోడీలు జీళ్ళు అవి వాళ్ళకి యిచ్చారు - వాళ్ళు అవి ఇంకా తింటూనే వున్నారు
అయితే బుర్రుగూ నాకు అర్జెంటుగా పదమూడో ఎక్కం నేర్పెయ్ నేను వెళ్ళి సీతని రక్షిస్తాను
అలా చెప్పకూడదు రా గోపీ - మీ యింటికెళ్ళి ఎక్కాల బుక్కు తీసుకురా అది చూసి మంత్రంవేసి చెప్పాలి - ఎక్కాల బుక్కు చూసి చెప్పకపోతే దేవుడికి కోపం వస్తుంది
తెత్తా వుండు
వృదేయ్! ఈ బుద్ద చదివేవాడూ - ఈ బుద్ద చదివేవాడూ ఆ గోపిగాడు వస్తే నేను మొన్నే జపాను వెళ్ళిపోయానని చెప్పరా ఏం?
అయిపోయింది



# సంధ్యాతారక

['సంధ్యాతారక' హెన్రీవాడ్స్‌వర్త్ లాంగ్‌ఫెలో రచియించిన 'సాంగ్ ఆఫ్ హాయెవాతా'లో ఒక కథ, ఇది రెడ్ ఇండియన్లకు సంబంధించినది

'సాంగ్ ఆఫ్ హాయెవాతా' పూర్తిగా త్వరలో బాలసాహితి పాఠకులకు అందచేయాలనుకుంటున్నాము ]

ఇది జరిగి ఎంతకాలమయిందో చెప్పలేం అప్పటికి ఆకాశం మనకింకా దగ్గరగా ఉండేది, దేవుళ్లతో మన పరిచయం యింకా తగ్గలేదు సరే! ఉత్తరదేశంలో ఒక గొప్ప వేటకాడు ఉండేవాడు అతనికి పదిమంది కూతుళ్లు అందరూ అందగత్తెలే, కాని చివరిఅమ్మాయిఒవీనీ, అందరికన్నా అందంగా ఉండేది అసలు ఒవీనీ ఎవరినీ లెక్క చేసేదికాదు, ఎక్కువ మాట్లాడేదికాదు ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేది

ఒవీనీ అక్కయ్యలందరికీ మహాయోధులతో వివాహాలయ్యాయి ఒవీనీ మాత్రం తనకోసం వచ్చిన యువకులందరినీ నిరాకరించింది చివరకి ముసిలివాడూ వికృతమైన ఆకారం కలవాడూ అయిన ఓసియోని పెళ్లిచేసుకుంది ఓసియో చాలా బీదవాడు ఎప్పుడూ ఉడత దగ్గినట్లు దగ్గుతూ ఉండేవాడు

కాని ఓసియోలో 'సంధ్యాతారక' అంశం ఉంది దాని వెలుగు అతనిహృదయంలో నిశ్చలంగా ప్రజ్వలించింది దాని అందం అతని ఆత్మలో ప్రతిబింబించింది ఆ నక్షత్రం అతని మాటల్లో ప్రతిధ్వనించింది

ఒవీనీ నిరాకరించిన వీరులంతా ఆమెని ఎక్కిరించేవారు విరగబడి నవ్వేవారు కాని ఒవీనీ, 'మీ అందం నా కక్కర్లేదు మీ నగలూ, మీ

అలం కారాలూ నా కనవసరం మీరెంత ఎక్కిరించినా ఫర్వాలేదు ఓసియోతో హాయిగా ఉంటున్నాను' అనేది

ఒకరోజు సాయంత్రం అందరూ మరొక ఊరిలో జరగబోతున్న పెద్ద విందుకి బయలుదేరారు అక్క చెల్లెళ్ళు పదిమందీ, వారి భర్తలూ పయనమయ్యారు ఓసియో అందరితోబాటు నడవలేక వెనకబడ్డాడు ఓవీనీ అతని పక్కనే నడుస్తూ ఉంది మిగిలినవారందరూ సంతోషంగా మాట్లాడుకుంటూ ఉంటే వీరిద్దరూ మౌనంగా నడుస్తూ ఉండిపోయారు

ఓసియో పశ్చిమాకాశంవైపు చూస్తూ ఉండేవాడు అప్పుడప్పుడూ, 'సంధ్యా తారక' నీ విధంగా ప్రాధేయపూర్వకంగా ప్రార్థించేవాడు 'ఆ! షోవైన్ నెమెషిన్, నోసా!' (తండ్రీనాపై దయచూపు,) అని

ఇది తక్కినవారికికూడా వినపడింది 'తండ్రిని ప్రార్థిస్తున్నాడు వినండి! ఈ ముసలివాడు కాలుజారి మెడ విరగ్గొట్టుకున్నా బావుంటుంది!' అన్నది అక్కచెల్లెళ్ళందరిలోనూ పెద్దమ్మాయి ఆమెమాటకు వారందరూ అడవి మారుమూలలు ప్రతిధ్వనించేట్లు విరగబడి నవ్వారు

ఇలా వెడుతూఉండగా వారి దారి కడ్డంగా ఒక పెద్ద చెట్టు పడిపోయి ఉంది పెద్దతుఫాను గాలి వేళ్ళతోబాటు పెకలించి పారేసినట్లుంది అప్పటికే దాని మొదలు పుచ్చిపోయి మధ్య పెద్ద సొరంగం ఒకటి ఏర్పడిఉంది ఓసియో ఈ చెట్టును చూడగానే పెద్దపెట్టున కేక వేశాడు వెంటనే ఆ 'సొరంగం'లోకి దూకాడు అంతే! మొదట ఇవతలివైపు వికృతంగా కనిపించే వృద్ధుడు ప్రవేశించాడు అవతలివైపు బయటకివచ్చినవాడు ఆజానుబాహువైన ఒక బలమైన యువకుడు చాలా అందంగా ఉన్నాడు

ఓవీనీ అతని వెంట నడిచింది కాని పాపం! తను కూడా మారిపోయింది వృక్షస్కంధంలో నుంచి అవతలికి వచ్చేసరికి వృద్ధురా లయిపోయింది ముఖమంతా ముడతలుపడి, కృశించిపోయి నేరుగానుంచోలేక కర్రసహాయంతో మెల్లిమెల్లిగా నడుస్తూ వచ్చింది. ఇది చూసి ఆమె అక్కయ్యలూ, వారి భర్తలూ అడవి దద్దరిల్లేట్లు నవ్వారు ఓసియోమాత్రం



# సంధ్యాతారక

ఆమెను వదిలి వెళ్లిపోలేదు చలికాలంలో ఆకులాగ ఎండిపోయిన ఆమెచేతిని తనచేతిలోకి తీసుకుని నెమ్మదిగా నడిపించుకొనిపోయాడు అల్లాగే విందు జరిగేచోటికి తీసుకువెళ్లాడు

విందు ఒక పెద్ద విగ్‌వామ్ (గుడారం) లో ఏర్పాటు చేశారు ఓసియో ఎవరితోనూ మాట్లాడకుండా, తనముందున్న భక్ష్యాలను ముట్టుకోనైనా ముట్టుకోకుండా ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు అప్పుడప్పుడు ఒవీనీ వైపు చూసేవాడు తర్వాత మెరుస్తున్న ఆకాశాన్ని చూసేవాడు అకస్మాత్తుగా ఒక ఆకాశవాణి వినిపించింది పైన నక్షత్రాల నుంచి వచ్చినట్లనిపించింది నెమ్మదిగా, రహస్యంగా ఓసియో చెవులో ఎవరో ఊదినట్లు వినిపించింది, 'ప్రియమైన ఓసియో! నిన్ను పీడించిన దుష్టకష్టాలు విరిగిపోయాయి! మాంత్రికుల మంత్రాలు నిన్నింకేమీ చెయ్యలేవు నాదగ్గిర కొచ్చేశెయ్! పైకి వచ్చేశెయ్!

'నీ ముందున్న ఆహారం స్వీకరించు అది నిన్ను మార్చేస్తుంది నీ ఎదుట ఉండే మట్టికుండలు వెండికుండలుగా మారిపోతాయి! కొయ్య కంచాలు రత్నాలు పొదిగినవైపోతాయి! నిప్పులలాగ వెలుగుతాయి!

'ఈ స్త్రీలు పక్షులుగా మారిపోతారు ఇకపైన వారికికూడా వీపువిరిగే చాకిరిచేసే అవసరం ఉండదు నక్షత్రాలకాంతిలో మెరిసిపోతారు సంధ్యాసమయంలోని ఆకాశం రంగులతో పూసినట్లు కనిపిస్తారు'

ఈ మాటలు ఓసియోకు మాత్రం వినిపించాయి మిగిలినవారిదేదో సంగీతమనుకున్నారు దూరంగా అడవిచీకట్లలో పాడుకుంటున్న ఏదో పక్షి అనుకున్నారు అప్పుడు విందు జరుగుతున్న ఆవిగ్‌వామ్ అదరటం ప్రారంభించింది అదురుతూ చెట్లను దాటి ఆకాశంలోకి ఎగిరిపోయింది మట్టికుండలు వెండివైనాయి కొయ్యకంచాలు ఎర్రటి లక్కవైపోయాయి గుడారం నిర్మించటానికి వాడిన కర్రలు వెండికర్రలుగా మారి ధగధగ మెరిసాయి గుడారం కప్పుగా వాడిన ఎండు బెరడు తుమ్మెదరెక్కలలాగ స్నిగ్ధంగా మెరిసింది

ఓసియో చుట్టూ కలయజూశాడు ఒవీనీ తొమ్మిదిమంది అక్కయ్యలూ, వారి భర్తలూ రకరకాల పక్షులుగా మారిపోయారు ఈ పక్షులలో కొన్ని కిచకిచ లాడుతున్నాయి కొన్ని పాట పాడుతున్నాయి, మరికొన్ని పింఛంవిప్పి నృత్యం చేస్తున్నాయి

ఒవీనీమాత్రం వృద్ధురాలుగానే ఉండిపోయింది మాట్లాడకుండా తక్కినవారివంక చూస్తూ కూర్చుంది ఓసియో పైకొకసారి చూసి మళ్లీ బాధగా అరిచాడు అంతే! ఒవీనీ యవ్వనం తిరిగి వచ్చేసింది చింపిరిగుడ్డలు మాయమయ్యాయి చేతిలోని కర్ర ఒక వెండి ఈకగా మారింది 'విగ్‌వామ్' మళ్లీ బాగా కంపించింది మేఘాలలోనుంచి దూసుకుపోయింది అలా దూసుకుపోయి చివరకు సంధ్యాతార మీద వాలింది!

ఓసియోతండ్రి వారిని ఆ సంధ్యాతారమీదికి ఆహ్వానించాడు ఆయనజుట్టు వెండిని పోలి ఉంది కరుణామయములైన చూపులు వారిపై ప్రసరించి ఇలా అన్నాడు 'ఓసియో! నువ్వు నాపుత్రుడవు! నీతో పట్టుకొచ్చిన పక్షుల పంజరాన్ని నావిగ్‌వాంద్వారందగ్గిర తగిలించు ఓసియో నీ హృదయాన్ని అర్థంచేసుకోలేక నిన్ను అవహేళనచేసినవారందరినీ పక్షులుగా మార్చేశాను ఒక్క ఒవీనీమాత్రం నీలోని అందాన్ని తెలుసుకోగలిగింది


'దూరంగా మెరిసే ఆ చిన్న నక్షత్రంమీద 'వాబెనో' అనే 'దుష్టశక్తి' ఒకడున్నాడు అసలు వాడే నిన్ను ముసలివాడ్నిగా మార్చేసింది! వాడి కాంతి మాత్రం నీమీద పడకుండా చూసుకో వాడి ఆయుధం, ఈ కాంతి ఒక్కటే దానితోనే అందరినీ బాధించగలడు'

ఓసియో 'సంధ్యాతార'మీదనే కొన్ని సంవత్సరాలు గడిపాడు వెండిపంజరం 'విగ్‌వామ్' ద్వారంవద్దనే ఉండిపోయింది ఒకరోజు ఒవీనీకి కొడుకు పుట్టాడు

ఓసియోకొడుకు కొంచెం పెద్దవాడయిన తరువాత అతను ఆడుకొనడానికి చిన్న విల్లంబులు చేసి ఇచ్చాడు వెండిపంజరంలోని పక్షుల్ని విడిపించి వాటిని బాణాలతో కొట్టమన్నాడు పక్షులు అరుస్తూ పాటలు పాడుతూ ఎగరటం ప్రారంభించాయి ఓసియోకొడుకు ఒక పక్షిని గురిచూసి తనబాణంతో కొట్టాడు ఆ బాణం నేరుగా వెళ్లి దానిగుండెల్లో గుచ్చుకొని అది కింద పడిపోయింది అమ్ము గుచ్చుకున్నచోట రక్తం కారి నేలమీదపడింది

దానితో ఆ పిల్లవాడు 'సంధ్యాతార'మీద నుంచి పడిపోయాడు ఆకాశంలోకి అంతులేకుండా రాలిపోయాడు అలా రాలిపోయి చివరకొక ద్వీపంమీద వాలాడు అతని వెంట వెండి కర్రలతో తుమ్మెదరెక్కలలాగ మెరిసే విగ్‌వామ్, అందులో ఒవీనీ ఓసియోలు, తక్కిన పక్షులూ అన్నీ నేలమీద వచ్చి పడ్డాయి ఒవీనీ, ఓసియోలు వారి అందం పోగొట్టుకోలేదు పక్షులు మానవరూపం ధరించాయి కాని వారందరూ మరుగుజ్జులయిపోయారు

ఎప్పుడైనా వేసవికాలంలో వెన్నెలకాస్తున్నప్పుడు, 'సంధ్యాతారక' ఆకాశంలో తనవెలుగు నింపుతున్నసమయంలో వారంతా చేతులుకలిపి ఆ ద్వీపం కొండలమీద, సముద్రం ఒడ్డున ఇసుకమీదా నాట్యంచేసేవారు వారి విగ్‌వామ్ సాయంసమయాలలో ఇంకా స్నిగ్ధంగా కనిపిస్తూనే ఉంటుంది సంతోషంతోనిండిన వారి కంఠధ్వనులు చేపలుపట్టేవాళ్లకి ఇంకా వినిపిస్తాయి నక్షత్రాలకాంతిలో వారి నృత్యం చూస్తారు ★



అబ్రహాం లింకన్ (టైప్ రైటరు మీద వేసినది) —ఎం. నారాయణరావు (కాకినాడ)

# డీట్రిక్ కథ

(25 వ పేజీ తరువాయి)

రాక్షసులను హతమార్చడానికి బయలుదేరాడు ఆ దుండగులు ఉంటారనుకున్న గ్రామ, గ్రామం లోను తిరిగాడు పర్వత ప్రాంతాలు, మహారణ్యాలు అన్నీ గాలించాడు కాని మాయావులైన రాక్షసు లేనా అంత సులువుగా పట్టుబడేది! అంతకు మునుపే వారు రహస్యప్రదేశాలలో తలదాచు కున్నారు మహారాజు ఆ రాక్షసులకోసం వెతకి వేసారి, తిరిగి రాజధానికి చేరుకున్నాడు

డీట్రిక్ రాకుమారుడు ఈ సంగతి అంతా విన్నాడు అతడు పరాక్రమవంతుడేకాక, మంచి ధైర్య సాహసాలు కలవ డు యుద్ధంలో ఆ రాక్షస దంపతులను వధించి, తన పరాక్రమానికి తగిన కీర్తి సంపాదించాలని అతడు నిశ్చయించుకున్నాడు

ఒకనాటి ఉదయం డీట్రిక్ రాకుమారుడ హిల్డేబ్రాండ్‌ను వెంట బెట్టుకుని వేటకు వెళ్ళాడు నట్టడివిలో వారికి విశాలమైన పచ్చిక బయలు కనిపించింది వా రక్కడకు వెళ్ళీ వెళ్ళగానే, అంత వరకు అక్కడేఉన్న మరుగుజ్జు ఒకడు వారినిచూచి పిక్కబలం చూపాడు డీట్రిక్ రాకుమారుడు వానిని వెంబడించి పట్టుకున్నాడు ఆ మరుగుజ్జు పేరు ఆల్బెరిక్ వాడొక గజదొంగ ఖడ్గాలు తయారు చేయటంలో అంతటి నిపుణుడు మరొకడులేడు వాణ్ని చంపేందుకు డీట్రిక్ తన కత్తి ఎత్తాడు మీద పడటానికి సిద్ధంగాఉన్న ఆ కత్తినిచూచి ఆల్బెరిక్ భయంతో గజగజ వణికిపోయాడు 'రాకుమారా! నన్ను చంపకుండావుంటే నీకు మేలు చేస్తాను నావద్ద నాగ్లెరింగ్ అనే అద్భుతమైన ఖడ్గం ఉన్నది దాన్ని నీకు ఇస్తాను ప్రపంచంలో అటువంటి ఖడ్గం మరొకటిలేదు గ్రిమ్, హిల్డేల కోరికపై దాన్ని తయారుచేసిపెట్టాను ఆ రాక్షసులు దాచు కున్న నిధులు, ఆభరణాలు కూడా నీకు లభించే మార్గం చెబుతాను అవి ఒక పర్వత వివరంలో బహు జాగ్రత్తగా ఉన్నాయి అక్కడికి నీకు దారి చూపుతాను" అని వాడు అతిదీనంగా విన్నవించుకున్నాడు

ఆల్బెరిక్ దీనాలాపాలు డీట్రిక్ మనస్సు కరిగించాయి వాడు చెప్పిన మాటలలో యథార్థం ఉండ వచ్చునని అతనికి అనిపించింది 'సరే నీవు ఇప్పటికి పోవచ్చును అన్నమాట ప్రకారం ఆ ఖడ్గం, నిధుల నాకు లభించేట్లు చెయ్యి అట్లా చెయ్యకపోయావా జాగ్రత్త!' అని హెచ్చరించి వాణ్ని విడిచిపెట్టాడు అప్పుడు ఆల్బెరిక్ ఇలా అన్నాడ "రాకుమారా! ఆ నిధులు నీవశం కావాలంటే, ముందు నీవు గ్రిమ్, హిల్డేలను హతమార్చాలి కాని అది అంత తేలికైన పనికాదు గ్రిమ్ ఒక్కడికీ పన్నెండు మంది యోధులతో సమమైన శక్తి ఉన్నది పైగా వాడు అతి క్రూరుడు ఇక హిల్డే సంగతి చెప్పనవసరమేలేదు అది మహా మాయావి దాని భర్తకంటే కూడా అది కరిహాత్మురాలు అందుచేత గ్రిమ్‌ని ఎదుర్కొటంకంటే కూడా దాన్ని ఎదుర్కొటం కష్టం' అని చెప్పాడు

డీట్రిక్ ఆ మాటల శ్రద్ధగా విన్నాడు ఇంత కాల నికి గ్రిమ్, హిల్డేలతో యుద్ధం చేసే అవకాశం కలుగుతోంది కదా అని అతడు లోలోపల సంతోష పడ్డాడు 'ఇక నీవు వెళ్ళి నాగ్లెరింగ్ తీసుకొనిరా' అని చెప్పి ఆల్బెరిక్‌ని పంపివేశాడు ఆల్బెరిక్ వెడుతూ వెడుతూ, ఒక పర్వతం గుర్తుచెప్పి, నాటి సాయంత్రం దాని సమీపానికి రమ్మని డీట్రిక్, హిల్డేబ్రాండ్ లకు చెప్పాడు కొంత సేపటికి ప్రొద్దు వాటారింది యోధులిద్దరూ ఆ పర్వతం వద్దకు చేరుకున్నారు అక్కడ వారు ఆల్బెరిక్‌కోసం ఎదురు చూస్తున్నారు ఇంతలో ఆల్బెరిక్ రానే వచ్చాడు అతని చేతిలోఉన్న ఖడ్గం ధగధగా మెరిసిపోతున్నది ఆ మరుగుజ్జు నిజాయతీకి డీట్రిక్ సంతోషించాడు ఆల్బెరిక్ తన చేతిలోఉన్న నాగ్లెరింగ్‌ను డీట్రిక్ చేతి కిచ్చాడు దాన్ని డీట్రిక్ ఆనందంతో స్వీకరించాడు ఆ ఖడ్గంతోనే డీట్రిక్ అనంతరకాలంలో అనేక ఘన కార్యాలు సాధించి తన కీర్తిని నలు దిశల వ్యాపింపజేసుకున్నాడు

గ్రిమ్, హిల్డేలు ఆ పర్వత శిఖరంమీదనే రహస్య బిలంలో ఉన్నారనీ, దానిలోనే వారి నిధులు వున్నాయనీ ఆల్బెరిచ్ చెప్పాడు అటుతరువాత డీట్రిక్‌వద్ద సెలవుతీసుకొని ఆల్బెరిక్ అంతర్ధానమయ్యాడ

డీట్రిక్, హిల్డేబ్రాండ్‌లు పర్వత శిఖరంమీదకు వెళ్ళారు. అక్కడ వారికి ఒక రహస్య ద్వారం కనిపించింది అదే గ్రిమ్, హిల్డేలు నివసిస్తున్న శిబిరానికి మార్గమని వారు నిశ్చయించుకున్నారు ద్వారాన్ని ముందుకుత్రోసి బిలంలో ప్రవేశించారు ఒక మూల చలిమంట భగభగా మండుతోంది ఆ మంట ప్రక్కనే రాక్షస దంపతులు కూర్చుని ఉన్నారు డీట్రిక్,హిల్డేబ్రాండ్‌లులోనికి రాగానే,రాక్షసులకు నర వాసన తగిలింది వెంటనే వారు వెనక్కు తిరిగి చూచారు ఎదురుగా ఇద్దరు యోధులు కనిపించారు రాక్షసుల ఒక్కవూపున వారి మీదకు ఉరికారు గ్రిమ్ తన ఖడ్గం నాగ్లెరింగ్‌కోసం తడుముకున్నాడు కాని లది కనిపించలేదు ఆల్బెరిక్ అంతకు మునుపే దాన్ని దొంగిలించి డీట్రిక్‌కి ఇచ్చాడనీ, ఇప్పుడా ఖడ్గం డీట్రిక్ వద్దనే ఉన్నదనీ ఆ రాక్షసునకేమితెలుసు! గ్రిమ్ మండిపడ్డాడు ఎదురుగా మండుతున్న పెద్ద దుంగ ఒకటి కనిపించింది గ్రిమ్ దానిని అందుకొని డీట్రిక్‌తో కలియబడ్డాడు ఒళ్ళు తెలియని ఆవేశంతో రాకుమారుణి ఆ దుంగతో మోదటం మొదలుపెట్టాడు ఆ దెబ్బలకు మరొకడైతే భీకరమైన మృత్యువు వాత బడేవాడేగాని, డీట్రిక్ వాటిని అడ్డుకొని, తన అద్భుత ఖడ్గంతో ఆ దుంగను నరికివేశాడు గ్రిమ్ ఇక డీట్రిక్‌తో ముష్టి యుద్ధానికి దిగాడు మదించిన రెండు ఏనుగులు పోరాడుతున్నట్లుగా, రెండు కొండలు ఢీకొన్నట్లుగా వారి యుద్ధం కనిపించింది

వీరి పోరాటం ఈ విధంగా సాగుతూ ఉండగా వేరొకవంక హిల్డే, హిల్డే బ్రాండ్‌తో తలపడింది వారిద్దరూ ఒకరి నొకరుగ హతమార్చాలనే పట్టుదలతో పెనుగులాడుతున్నార కాని రాక్షస బలం ముందు మానవుని శక్తి ఏ పాటిది! హిల్డేబ్రాండ్ మెడను ఆ రాక్షసి గట్టిగా నొక్కిపట్టి వూపిరాడకుండా చేసింది అతడ గిజగిజ తన్నుకుంటూ క్రిందపడ్డాడు ఆ రాక్షసి చేతిలో చావు తప్పదేమోనని హిల్డేబ్రాండ్‌కి అనిపించింది ఉన్న కాస్త సత్తువ కూడగట్టుకుని డీట్రిక్‌కోసం ఆర్తనాదం చేశాడు

ఇక్కడ డీట్రిక్ హిల్డేబ్రాండ్ సంగతి పట్టించుకునే స్థితిలో లేడు ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా అతడు గ్రిమ్‌తో పోరాడుతున్నాడు. చివరకు ఎంతో కష్టంమీద ఒక ప్రక్కకు దుమికి, గ్రిమ్ కంఠానికి గురిచూచి నాగ్లెరింగ్‌తో బలంగా కొట్టాడు అంతే ఆ రాక్షసుని తల తెగి నేలమీదపడింది బెర్న్ సామ్రాజ్యంలో వాడుచేసిన కిరాతకాలకు అప్పటికి తగిన శిక్ష అనుభవించాడు

ఇంతసేపూ హిల్డేబ్రాండ్ హిల్డేతో పెనుగులాడుతూనే ఉన్నాడు రాను రాను అతని శక్తి క్షీణించింది అతనిని చిత్రవధ చెయ్యాలని రాక్షసి తల పెట్టింది అందుకే అతని కాళ్ళూ చేతులూ కట్టివేసే ప్రయత్నం చేస్తోంది గ్రిమ్‌ను వధించిన వెంటనే డీట్రిక్ ప్రక్కకు తిరిగి చూచాడు అప్పుడా రాకుమారునికి ఈ దారుణ దృశ్యం కనిపించింది ఒక్క ఉరుకునవెళ్ళి తన ఖడ్గంతో హిల్డేను రెండుగా ఖండించాడు అయినా ఆ రాక్షసి హిల్డేబ్రాండ్‌ను విడిచిపెట్టలేదు చూస్తూ ఉండగానే కత్తివ్రేటుకు తెగిన దాని శరీర భాగాలు రెండూ దగ్గరగా వచ్చాయి ఆ రాక్షసి యథా ప్రకారంగా తయారైంది డీట్రిక్ మళ్ళీ నాగ్లెరింగ్‌తో దాని శరీరాన్ని మధ్యకు నరికాడు మళ్ళీ ఆ రెండు తునకలు అతుక్కున్నాయి అప్పుడు క్షీణిస్తున్న స్వరంలో హిల్డబ్రాండ్ ఇలా అన్నాడు "డీట్రిక్ ఈమారు నీవు ఆ రాక్షసిని నరికిన వెంటనే విడిపోయిన దాని శరీరఖండాలు మధ్యగా అటువైపుకు దుముకు దుముకుతున్నప్పుడు కళ్ళుమూసుకో" అని చెప్పాడు

డీట్రిక్ హిల్డేబ్రాండ్ చెప్పినట్లుగా చేశాడు మూడవసారి తన ఖడ్గంతో హిల్డేను మధ్యకు నరికాడు నరికినదే తడవుగా ఎటూ చూడకుండా కళ్ళు మూసుకొని దాని శరీర ఖండాలు మధ్య అవతలవైపుకు గెంతాడు అంతటితో ఆ రాక్షసి పని అయిపోయింది దాని దుండగాలు సమాప్తమయ్యాయి "హిల్డేబ్రాండ్‌తో నేను పోరాడినంత పట్టుదలతో డీట్రిక్‌తో నా భర్త గ్రిమ్ పోరాడి ఉంటే మాకీ గతి పట్టేదికాదు" అని విలపిస్తూ ఆ రాక్షసి కన్నుమూసింది హిల్డేబ్రాండ్ దాని పట్టు

---

ఒకనటుడు, నిర్మాత యిద్దరు మాటా మాటా అనుకొంటున్న సమయంలో డైరెక్టరు కొన్ని కాగితాలు చేతపట్టుకొని లోపలికి వెళ్ళి:

సార్! ఇది ఏ కాండం? (అని కాగితాలు చూపిస్తూ.)

నిర్మాత (కోపంతో) యుద్ధ కాండం

కె గోపాల్‌రావు (మద్రాసు)

---

# డీట్రిక్ కథ

నుంచి విముక్తుడయ్యాడు ఆవృద్ధవీరుడు డీట్రిక్‌ను కౌగలించుకున్నాడు అతని ధైర్య సాహసాలను, పరాక్రమాన్ని కొనియాడాడు డీట్రిక్ కళ్ళు ఆనందాతిశయంతో ప్రకాశించాయి

అటు తరువాత ఆ వీరు లిద్దరూ బిలం అంతటా కలయచూచారు అక్కడ ఒకచోట వారికి అమూల్య మైన నిధులు, ఆభరణాలు కనిపించాయి ఆ ఆభరణాలు వింత కాంతు లీనుతున్నాయి వాటిలో ధగధగా మెరసిపోతున్న శిరస్త్రాణం ఒకటి ఉన్నది డీట్రిక్ దాన్ని తీసుకున్నాడు తాను వధించిన రాక్షసుల జ్ఞాపకార్థం ఆ శిరస్త్రాణానికి 'హిల్డే‌గ్రిమ్' అని పేరు పెట్టాడు దాన్ని అతడు శిరస్సున ధరించాడు వెంటనే అతనికి అతిమానుషమైన శక్తి వచ్చింది

డీట్రిక్, హిల్డేబ్రాండ్ తల పెట్టిన కార్యం ఈవిధంగా విజయవంతం ఐయింది వారు బెర్న్ రాజ్యానికి తిరిగి వెళ్ళారు డీట్‌మర్ మహారాజు, బెర్న్ పురజనులు వారికి గొప్ప స్వాగతం ఇచ్చారు తన కుమారుని వీరోచితకృత్యాలు విన్న మహారాజు కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలాయి డీట్రిక్‌ను కౌగలించుకొని ఆయన తన, ఆనందం వ్యక్తం చేశాడు అతనికి 'యోధ గ్రేసరుడు' అన్న బిరుదం ఇచ్చాడు ప్రజలు కోలాహలంగా వేడుకలు జరుపుకున్నారు దుష్ట రాక్షసుల సంహారంతో వారి ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయాయి డీట్రిక్ రాకుమారుణ్ణి వారు గొప్పగా పొగిడారు అతని ధైర్య సాహసాలను, పరాక్రమాన్ని కీర్తించారు

కొంతకాలంవరకు అన్నీ సవ్యంగానే జరిగిపోయాయి దేశం సుభిక్షంగా ఉన్నది ప్రజలు ధన ధాన్యాలతో తులతూగుతున్నారు

ఇలా ఉండగా ఒక రోజున టిరోలిస్‌పర్వత రాజ్యం రాణి వర్జినల్, డీట్రిక్ సహాయం అర్థిస్తూ, డీట్‌మర్ మహారాజుకు వర్తమానం పంపింది దుష్ట రాక్షసుడు వోర్కేసే, వాని కుమారుడు జానిబాస్ ఆమె రాజ్యంలో ప్రవేశించి బగ్గంపాడు చేస్తున్నారు పచ్చనిచేలు బీళ్ళుగా మారిపోయాయి వోర్కేసే ప్రతి అమావాస్యనాడువచ్చి ఒక అందమైన కన్యకను ఎత్తుకుపోయి మింగుతున్నాడు జానిబాస్ పరేసరి వాని దురడగాలకు అంతేలేదు వాడు దుష్ట మాంత్రికుడు

వర్జినల్ రాణి మహా సౌందర్యవతి అవివాహిత ఎవ్వరికీ ఏ విధమైన అపకారం తలపెట్టి ఎరుగనంతటి సాధుశీల. అలాంటి ఉత్తమురాలి రాజ్యంలో ఇప్పుడీ రాక్షసుల బెడద దాపురించింది

డీట్‌మర్ మహారాజు వర్జినల్ రాణి పంపిన వర్తమానం డీట్రిక్‌కి తెల్పి, టిరోలిస్ పర్వత రాజ్యానికి బయలుదేరి వెళ్ళవలసిందని ఆజ్ఞాపించాడు రాక్షసులనుండి ఆ రాజ్యానికి విముక్తి కలిగించి, వర్జినల్ రాణిని సంతోషపెట్టాలని డీట్రిక్ నిశ్చయించుకున్నాడు

మరునాడు డీట్రిక్,హిల్డే బ్రాండ్‌లు వర్జినల్ రాణి రాజ్యానికి బయలుదేరారు ఆమె జరాస్ పంట్ భవనంలోఉన్నదని వారికి తెలుసుగాని, ఆ భవనం ఎక్కడో తెలియదు ఎట్లా తెలుసుకోటమా అని వారు ఆలోచిస్తూ ప్రయాణం చేస్తున్నారు ఇంతలో ఒక అరణ్యం వచ్చింది

అక్కడ వారికి ఒక మరుగుజ్జు ఎదురయ్యాడు. వాడిపేరు బీబంగ్ వర్జినల్‌రాణి నివసించే భవనానికి దారి చూపి, వాడు అంతర్ధానమయ్యాడు డీట్రిక్ హిల్డేబ్రాండ్ ఆ రాత్రంతా అరణ్యంలో ప్రయాణం చేస్తూనేవున్నారు మంచు దట్టంగా కురుస్తున్నది దారి, డొంక తెలియటంలేదు ఆ పరిస్థితిలో ఒకరు ఎక్కడ వున్నారో రెండవ వారికి తెలియక యోధులిద్దరూ విడిపోయారు డీట్రిక్ ఒక వైపుగాను, హిల్డే బ్రాండ్ వేరొక వైపుగానూ వెడుతున్నారు పోగాపోగా హిల్డేబ్రాండ్‌కు హఠాత్తుగా ఒక కన్యక ఆక్రందనం వినిపించింది వోర్కేసే ఆ కన్యకను తనకు ఆహారంగా తెచ్చుకున్నాడు ఆమె ఏడుపు విన్న హిల్డేబ్రాండ్ హృదయం ద్రవించింది అతడు అభయమిచ్చి ఆమెను ఓదార్చాడు

ఇంతలో రాక్షసుడు వస్తున్న సవ్వడి అయింది హిల్డేబ్రాండ్ తన కత్తిదూసి సిద్ధంగా ఉన్నాడు వోర్కేసే వచ్చిరాగానే సింహంలా వాడిమీదకు ఉరికాడు ఒక్క వేటున వాని కంఠం తెగవేశాడు ఆ దుర్మార్గునిపీడ అంతటితో అంతమైంది తండ్రికి పట్టిన గతిచూచి జానిబాస్ పలాయన మంత్రం పఠించాడు



రాక్షసుని వధించి తన ప్రాణం కాపాడినందుకు ఆ కన్యక హిల్డేబ్రాండ్‌కు కృతజ్ఞత తెల్పింది అతనివద్ద సెలవు తీసుకొని ఆమె టిరోలిస్ రాజ్యానికి వెళ్ళిపోయింది అక్కడ వర్జినల్ రాణిని కలుసుకొని జరిగిన సంగతులన్నీ పూస గ్రుచ్చినట్లు చెప్పింది వర్జినల్ రాణి, ప్రజలు ఎంతో సంతోషించారు వోర్కేసేను వధించి తమకు మహోపకారం చేసిన వీరుణ్ణి చూడాలని వారు వేయికళ్ళతో ఎదురు చూస్తున్నారు

ఈలోగా వేరొక దిక్కుగా ప్రయాణం సాగించిన డీట్రిక్ రాకుమారునకు వోర్కేసే అనుచరులు ఎదురయ్యారు. వారా రాకుమారునితో భీకరంగా పోరాడుతున్నారు పంటరిగాడైనా, పరాక్రమవంతుడైన డీట్రిక్ వారిని నరికి పోగులు చేస్తున్నాడు డీట్రిక్‌కోసం వెదుకుతూ వస్తున్న హిల్డేబ్రాండ్‌కు వారి హాహాకారాలు వినవచ్చాయి అతడు తన గుర్రాన్ని అదిలించి, ఆ హాహాకారాలు వినిపించిన దిక్కుగా త్వరత్వరగా వెళ్ళాడు పోరాటం జరుగుతున్న ప్రదేశానికి చేరేసరికి, రాక్షసులను హతమారుస్తూ, వీరవిహారం చేస్తున్న డీట్రిక్ అతనికి కనిపించాడు హిల్డేబ్రాండ్ డీట్రిక్ పరాక్రమాన్ని లోలోన మెచ్చుకున్నాడు ఆ రాకుమారునికి సహాయపడాలనుకుని ముందుకు వచ్చాడు డీట్రిక్ అతనిని వారించి, తంటరిగానే రాక్షసులనందరినీ పరిమార్చాడు కొందరు అతని ధాటీకి తట్టుకోలేక కాలికి బుద్ధిచెప్పారు హిల్డేబ్రాండ్ డీట్రిక్‌ని గుచ్చి కౌగలించుకొన్నాడు

ఆ తర్వాత ఆ వీరులిద్దరూ జరాస్ పంట్ భవనానికి ప్రయాణమయ్యారు అప్పటికే చీకటి పడింది. వోర్కేసేని, వాని అనుచరులను తాము వధించినందువన్న, వాని భవనం తమ స్వాధీనం అయినట్లేనని వారు భావించారు ఆ భవనంకోసం అరణ్యమంతటా వెతికారు ఒక మూల అది కనిపించింది యోధులిద్దరూ అక్కడికి వెళ్ళారు కాని అక్కడ వారికి స్వాగతం చెప్పినవారులేరు వారే సింహద్వారం తెరుచుకొని లోనికి ప్రవేశించారు ప్రవేశించి ప్రవేశించగానే అతిక్రూరులైన రాక్షసులు వారిమీదపడి గదలతో మోదనారంభించారు బెర్న్ వీరులు ఒక్క క్షణంసేపు దిగ్భ్రాంతిచెంది, మళ్ళీ అంతలోనే కోలుకుని పరాక్రమించారు నిసితమైన తమ ఖడ్గాలతో రాక్షసుల గదలు ముక్కలుచేశారు వారి బాహువులు ఖండించివేశారు కంఠాలు తురిమివేశారు కొద్దిసేపట్లోనే ఆ రాక్షసులందరూ నిహతులయ్యారు ఇంతలో ఒక అశ్వికుడు అక్కడకు వచ్చాడు వాడే జానిబాస్ విచిత్రమైన భాషలో వాడు ఏవో కొన్ని మంత్రాలు పఠించాడు వెంటనే భూమి ఈనినట్లుగా అక్కడికక్కడే వందలాది రాక్షసులు పుట్టుకువచ్చారు వారంతా డీట్రిక్ హిల్డేబ్రాండ్‌లను ఎదిరించి భయంకరంగా యుద్ధం చేశారు ఒక్కొక్కడూ నేలకూలుతుంటే వాడు పడిన చోటనుండి వేరొకడు పుట్టుకు వస్తున్నాడు ఇట్లా వస్తున్నవారి నందరినీ కూడా బెర్న్ యోధులు హతమార్చి వేస్తున్నారు ఈ ప్రకారంగా యుద్ధం చాలాసేపు జరిగింది చచ్చిన రాక్షసులకు మారుగా భూమిలోంచి వస్తున్న రక్షసుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది చివరకు జానిబాస్ తప్ప మిగతా రాక్షసులందరు చనిపోయారు అటు తరువాత పెద్ద పెద్ద సర్పాలువచ్చి డీట్రిక్, హిల్డే బ్రాండ్‌లను చుట్టివేశాయి ఆ వీరులు వాటి నన్నింటిని కాళ్ళతోరాచి చంపివేశారు ఈవిధంగా రాత్రంతా పోరాటంతోనే గడిచిపోయింది తెల్లవారుతూనే జానిబాస్ తన అశ్వంతో సహా మాయమయ్యాడు యోధులిద్దరూ సౌధంలోకి వెళ్ళారు లక్కడ ఒక గదిలో బంధింపబడిన ముగ్గురు కన్యకలు వారికి కనిపించారు ఆ ముగ్గురికి బంధ విముక్తి కలిగించి, వారిని టిరోలిస్ రాజ్యానికి పంపివేశారు

అటుమీద డీట్రిక్, హిల్డేబ్రాండ్ కొంతసేపు ఆ సౌధంలో విశ్రమించారు ఆ రాత్రి ఆ పరిసర ప్రాంతంమీదుగా భయంకరమైన జంతువు ఒకటి ఆకాశమార్గంలో వెడుతోంది బెర్న్ వీరులు దాన్ని చూచారు దాని నోట్లో ఒక యోధుడు కనిపించాడు. అతడు తనను రక్షించమని పిలపిస్తున్నాడు వెంటనే హిల్డేబ్రాండ్ తన బల్లాన్ని ఆ జంతువుమీదకు విసిరాడు అది విలవిల తన్నుకుంటూ నేలకూలింది దాని నోటిలోఉన్న యోధుడు బయటపడి, బెర్న్ వీరులవద్దకు వచ్చి తన కృతజ్ఞత తెల్పుకున్నాడు తన పేరు రెన్‌ట్విన్ అనీ, తాను వారి చెలిమి కోరుతున్నాననీ విన్నవించుకున్నాడు డీట్రిక్, హిల్డేబ్రాండ్‌లు ఆ యోధుని ప్రార్థన మన్నించి తమ వెంట తీసుకు వెళ్ళడానికి అంగీకరించారు

మరునాడు రాకుమారుడు, అతని ఇద్దరు మిత్రులు కలిసి జరాస్‌పంట్ భవనానికి బయలుదేరారు వర్జినల్ రాణిని చూడాలని డీట్రిక్ తహ తహలాడిపోతున్నాడు ఉత్సాహంతో అతడు తన గుర్రాన్ని అదలించాడు అది మనోవేగంతో పరుగుతీయటం ప్రారంభించింది క్షణంలో డీట్రిక్ అతని స్నేహితులకు కనుచూపు దూరంలో లేకుండా పోయాడు

# డీట్రిక్ కథ

పోగా పోగా డీట్రిక్‌కి ఒక భవనం కనిపించింది అది విః... అనే రాక్షస యోధుని భవనం అక్కడ గు...న్న ఎల్పి, డీట్రిక్ లోపలికి వెళ్ళాడు సౌధం కాపలాదారుడు అతనికి ఎదురయ్యాడు వాడు ఒక రాక్షసుడు వర్జినల్ రాణి నివసించే జరాస్‌పంట్ భవనం ఎక్కడ ఉన్నదని డీట్రిక్ వానిని అడిగాడు వాడు ఆ రాకుమారునికి మార్గం చూపాడు డీట్రిక్ ఆ దిక్కుగా వెళ్ళేందుకు వెనుతిరిగాడు అంతే అతని తలమీద పిడుగుల వర్షం కురిసినట్లు గదాఘాతాలు తగిలాయి రాకుమారునికి బలమైన గాయాలయ్యాయి అతడు సొమ్మసిల్లి నేలకొరిగాడు దొంగచాటుగా అతనిని గాయపరచిన రాక్షసుడు ముందుకువచ్చి, అతని కాళ్ళూ, చేతులు బంధించి ఒక చీకటి గదిలోకి లాగుకొని వెళ్ళాడు అక్కడ ఆ రాకుమారుడు బందీ అయ్యాడు నిట్జర్ చెల్లెలు అతని దురవస్థచూచి కనికరించింది అన్నకు తెలియకుండా ఆమె అతనికి సపర్యలు చేసింది ఆ సపర్యల వల్ల అతడుతేరుకున్నాడు ఆమె ఆదరణ లభించకపోతే డీట్రిక్ ఏమి అయ్యేవాడో!

డీట్రిక్ జాడ తెలియక హిల్డేబ్రాండ్, రెన్‌ట్వేన్‌లు ఆందోళన చెందారు కాని అంతలోనే ఊరట చెందారు ఆ మహా యోధుడు సురక్షితంగా జరాస్‌పంట్ భవనానికివెళ్ళి ఉంటాడని వారు అనుకున్నారు వారూ ఆ భవనం వెతుక్కుంటూ వెళ్ళారు

హిల్డేబ్రాండ్, రెన్‌ట్వేన్‌లు వర్జినల్ రాణి భవనం చేరుకున్న తరువాత, డీట్రిక్ నిట్జర్ భవనంలో బందీ అయ్యాడని తెలిసింది ఈ వార్తవిని హిల్డేబ్రాండ్ నిర్ఘాంతపోయాడు వర్జినల్ రాణి ఎంతో విచారించింది హిల్డేబ్రాండ్ వెంటనే బెర్న్ పట్టణానికి బయలుదేరి వెళ్ళాడు అనేక యుద్ధాలుచేసి రాటుతేలిన పలువురు యోధులను వెంటబెట్టుకొని, హుటాహుటిగా నిట్జర్ భవనానికి తరలి వెళ్ళాడు బెర్న్ యోధులు ఆ భవనాన్ని ముట్టడించారు పన్నెండుమంది రాక్షసులు వారిని ఎదుర్కొన్నారు యుద్ధం హోరాహోరీగా సాగుతున్నది అదను కనిపెట్టి డీట్రిక్ ఖైదునుంచి తప్పించుకొనివచ్చి తన యోధులకు అండగా నిలిచాడు వారి ఉత్సాహం ద్విగుణీకృతం అయింది అమితమైన ఆవేశంతో వారు విజృంభించారు రాక్షసుల వారి పరాక్రమానికి తట్టుకోలేకపోయారు ఒకరి తరువాత ఒకరు కారు చిచ్చులోపడిన శలభాలవలె నామరూపాలు లేకుండా అంతరించిపోయారు బెర్న్‌వీరులు నిట్జర్‌నుకూడా హతమార్చేవారేకాని, అతని చెల్లెలి ప్రార్థన మన్నించి డీట్రిక్ వారిని వారించాడు నిట్జర్ ప్రాణాలతో బయటపడ్డాడు

అటు తరువాత బెర్న్ వీరులందరూ కలిసి వర్జినల్ రాణివద్దకు బయలుదేరారు దారిలో వారికి మళ్ళీ ఒక మరుగుజ్జు ఎదురయ్యాడు వర్జినల్ రాణి భవనాన్ని జానీబాస్ పెద్ద సైన్యంతో ముట్టడించాడనీ, ఆమె ధరించే కిరీటం, ఒక పవిత్రహారం తనకు ఇమ్మంటూ వాడు ఆమెకు వర్తమానం పంపాడనీ, ఆ మరుగుజ్జు తెల్పాడు ఈ వార్త విన్న వెంటనే డీట్రిక్ తన యోధులతోసహా వాయువేగంతో అక్కడకు వెళ్ళాడు భవనానికి కొంత దూరంలో ఉండగానే డీట్రిక్ జానీబాస్‌ను గుర్తించాడు వాని చేతిలో ఇనుప యంత్రం ఒకటి ఉన్నది దానితో వాడు మాయలు చేస్తున్నాడు డీట్రిక్ మెరుపులావెళ్ళి ఆ యంత్రాన్ని తన ఖడ్గంతో తుత్తునియలు చేశాడు అప్పటి కప్పుడే టిరోలిస్ పర్వతాలు ఫెళఫెళా విచ్చుకున్నాయి పెద్ద పెద్ద మంచు కొండలు భయంకరమైన శబ్దంతో విరుచుకుపడ్డాయి ఆ బీభత్సంలో జానీబాస్ సైన్యం సంపూర్ణంగా నాశనమైపోయింది ఆ తరువాత మళ్ళీ ప్రశాంత వాతావరణం ఏర్పడింది

వర్జినల్ రాణి తన భవనంలో ఎత్తైన ఆసనం మీద కూర్చుని ఈ సంఘటనలన్నీ చూచింది ఆమె ముఖం ఆనందంతో వెల్లి విరిసింది కిరీటంలోని వజ్ర వైఢూర్యాలు వింత కాంతులీనుతున్నాయి సఖియలు ఆమె పాదాలవద్ద కూర్చుని ఉన్నారు అప్పుడు రాణి సౌందర్యం ఎంతటివారినైనా ముగ్ధులను చేసేట్లుగా ఉన్నది ఇంతలో డీట్రిక్ రాకుమారుడు అక్కడికి వచ్చాడు వర్జినల్ రాణి ఎదురువెళ్ళి ఆ మహా వీరునకు స్వాగతం చెప్పింది టిరోలిస్ రాజ్యానికి రాక్షసుల బెడద పోగొట్టినందుకు అతనిని కొనియాడింది

అనంతరం డీట్రిక్ రాకుమారుడు, వర్జినల్ రాణి తామిదివరకే ఒకరి నొకరు ప్రేమించుకున్నట్లు తెలుసుకున్నారు ఒక శుభ ముహూర్తాన వారిద్దరికీ వైభవోపేతంగా వివాహం జరిగింది డీట్రిక్ రాకుమారుడు తన యోధులతో సహా కొంతకాలం అక్కడే ఉన్నాడు అటు తరువాత అంతా కలిసి బెర్న్ రాజ్యానికి తిరిగి వెళ్ళారు ★

క్రిందట—కొన్నాను మొత్తం పదిసారులయినా దీని మీద ఆట ఆడామో లేదో అంతలోనే సరే అదంతా యిప్పుడెందుకులే ఎవరు ప్రారంభిస్తారు? 'టాస్' వేద్దామా?'' అన్నాడు పట్టాభి ''సరే'' అంటూ కాళిదాసు వంక జాలితో చూశాడు

'టాస్' పట్టాభిపక్షానికి అనుకూలంగా పడింది ఆట ప్రారంభించారు మురళి ఆడుతూ వుంటే కాళిదాసుకు చాలా ముచ్చటగా వుంది అక్కడున్న అందరిలోనూ వాడికే ఆట బాగా వచ్చు ననిపించింది కాళిదాసు ''ఎక్కడ నేర్చుకున్నావోయ్ ఇంత బాగా ఆడటం?'' అని అడిగాడు వాడు సిగ్గుపడి ''ఆ ఏం ఆటలెండి మా పాక ప్రక్కనే తాసీల్దారుగారి డాబా వుంది వాళ్ళ యింట్లో మంచి బోర్డువుంది వాళ్ళ పిల్లలు ఆడుతూవుంటే నేను ప్రక్కనే నుంచుని చూస్తూ వుండేవాణ్ణి అప్పుడప్పుడు ఆటకు చేతులు తక్కువైతే నన్ను కూర్చోమనేవారు అలా కొద్దిగా ఆట వచ్చిందంతే'' అని చెప్పాడు

కాళిదాసు వాడివంక రెప్ప వాల్చకుండా చూశాడు వాడు తెలివైనవాడు చురుకైనవాడు నలుగురు పెద్దవాళ్ళ మధ్య ఎలా ప్రవర్తించాలో తెలిసినవాడు నమ్రత వుంది ఈ లక్షణాలున్నవాడు ఆస్తి పాస్తులు లేకపోయినా, అండ దండలు లేక పోయినా, అధికారులలో కావలసిన వారెవరూ లేక పోయినా అభివృద్ధిలోకి రాగలడు కాళిదాసుకు ఒక ఆలోచన వచ్చింది అతడు 'స్ట్రయికర్' చేతి లోకి తీసుకుంటూ తలపంకించి ''అవును అలా చేస్తే చాలా బాగుంటుంది'' అనుకున్నాడు

కాళిదాసు తన వంతు కాగానే ఒకసారి లేచి లోపలికివెళ్ళి మళ్ళీ తన వంతు వచ్చేసరికి చేతులు తుడుచుకుంటూ తయారైనాడు అలా ఆట మొత్తం అయేసరికి అతడు మూడు నాలుగుసార్లు లేచి లోపలికి వెళ్ళివచ్చాడు ఒక ఆట పూర్తి అయింది కాళిదాసు పార్టీ కొద్ది భేదంతో నెగ్గింది కాళిదాసు 'కాయిన్స్' తీస్తూ ''మళ్ళీ ఒక ఆట మొదలు పెడదాం నేను లోపలికి వెళ్ళవలసిన అవసరం యింకలేదు వంట అంతా పూర్తిగా అయిపోయింది'' అన్నాడు

మరో ఆట సాగించారు ఈసారి పట్టాభి పార్టీ నెగ్గింది ఆట అయిపోగానే పట్టాభి ''వంట అయిందన్నావుగా? లేచి కాళ్ళు కడుక్కోనా? పొట్టలో ఆత్మారాముడు 'హలో' యని ఫోను చేస్తున్నాడు'' అన్నాడు కాళిదాసులేచి ''ఇంకా ఆలస్యమా చొక్కా విప్పి పెరటిలోకి రా చల్లని నీళ్ళతో కాళ్ళూ చేతులూ కడుక్కో మురళీ! యీ లోపల పెరట్లో అంటాకులు రెండు మంచివిగా చూసి యీ బ్లేడుతో కోసుకురా'' అన్నాడు మురళి బ్లేడు తీసుకుని పెరట్లోకి పరుగెత్తిపోయాడు

పట్టాభి భోజనంచేస్తూ ఆశ్చర్యపోయాడు ''నువ్వు నిజంగా సవ్యసాచివేనోయ్ ఇవాళ నానోటి శని వదిలిపోయింది అక్కడ ఆటా ఆడావు ఇక్కడ వంట కూడా యింత అద్భుతంగా చేశావు మీ యింట్లో మంత్రపుకుండ వుందా ఏమిటి? ఇలా కూర కాస్త వడ్డించు'' అన్నాడతడు

ఇద్దరూ భోజనంచేసి చేతులు తుడుచుకుంటూ ముందు గదిలోకి వచ్చేసరికి మురళి పంచలో నిలబడివున్న మరో పధ్నాలుగేళ్ళ కుర్రవాడితో ''మేష్టారు భోజనం చేస్తున్నారు ఇప్పుడేమీ మాట్లాడేందుకు వీలుపడదు సాయంకాలం రా పో'' అంటున్నాడు

# ధృవతార

(23-వ పేజీ తరువాయి)

కాళిదాసు వాకిట్లోకి చూసి ''ఎవరు నువ్వు? ఏంకావాలి?'' అని అడిగాడు ఆ కుర్రవాడు కాకీ లాగూ తెల్లచొక్కా తొడుక్కొని వున్నాడు వాడు కాళిదాసుతో ''నేను సుబ్రహ్మణ్యంగారి అబ్బాయినండి మా నాన్నగారు మీతో మాట్లాడమని పంపించారు'' అన్నాడు

కాళిదాసు గుర్తుకు తెచ్చుకుని ''ఓహో! నువ్వేనా? మాట్లాడేందుకేముంది? నీవు చదువు

---

ఒకరోగి సుప్రసిద్ధమైన వైద్యునివద్దకు వెళ్లి తన అస్వస్థతను గూర్చి వివరంగా చెప్పాడు వైద్యుడు పరీక్షచేసి, చూడవయ్యా, నీకు బాగా తిరగడం లేకపోవడంవల్లనే ఈ అస్వస్థత. రోజుకి ఒక మైలన్నా నడవాలి తెలిసిందా?

దానికి వెంటనే రోగి అందుకొని 'అయ్యా నేను చేసేపనే తపాలా బంట్రోతు ఉద్యోగమండి' అనగానే వైద్యుడు స్వచ్ఛమయిన తెల్లమొహం వేశాడు

పద్మ, (విశాఖపట్నం)

---

కుని నలుగురితో పేరు తెచ్చుకోవటం యిష్టమో అలా కాకుండా జులాయిగా తిరిగి చెడిపోయి అందరిచేతా 'ఛీ' అనిపించుకోవటం యిష్టమో ఒక్క ముక్కలో చెప్పు నీకు మొదటి పద్ధతి నచ్చితే రేపటి నుంచి రాత్రిపూట పుస్తకాలు తీసుకుని మా యింటికిరా నేను సాధ్యమైనంత సహాయం చేస్తాను అలాకాక రెండో పద్ధతే నీకు నచ్చితే యిక నీతో మాట్లాడేందుకేమీలేదు ఇలా కటువుగా మాట్లాడుతున్నానని ఏమీ అనుకోకు మీ నాన్న నీ విషయమై ఎంతగా బాధపడుతున్నాడో నేను గ్రహించాను నాకు చాలా కష్టం కలిగింది ఏమంటావు?'' అన్నాడు

ఆ కుర్రవాడు తలవంచుకుని ''రేపటినుంచి యిక్కడికి వస్తానండి తప్పకుండా'' అన్నాడు కాళిదాసు కూర్చుంటూ ''మంచిది అలాగేరా ఇక యింటికి వెళ్ళు'' అన్నాడు ఆ కుర్రవాడు వెళ్ళిపోయాడు

పట్టాభి బోర్డుముందు కూర్చుని సిగిరెట్టు ముట్టించాడు మళ్ళీ ఆట సాగింది దాదాపు మూడు గంటలవేళ పట్టాభిలేచి ''యిక విసుగు పుడుతున్నదోయ్! కొద్దిసేపు నడుం వాల్చి కన్నుమూస్తే వంటికి మంచిది'' అన్నాడు కాళిదాసు కూడా లేచి వంట యింట్లోకి వెళ్ళి కుంపటిలో బొగ్గులు వేసి నిప్పంటించి కాఫీ ప్రయత్నం చెయ్యనారంభించాడు

రూబెన్ మురళీ విసుగు లేకుండా యింకా ఆడుతూనే వున్నారు పట్టాభి మంచంమీద పడుకున్న నాలుగైదు నిముషాల్లోనే నిద్రపోయాడు కిటికీలో వున్న నూనె సీసాలోనుంచి ప్రసరించిన సూర్యకిరణాలు గదిలో నేలమీద ఇంద్ర ధనుస్సును కల్పిస్తున్నాయి ఒక పిచ్చిక బల్లమీదవున్న అద్దంముందు నిలబడి 'కిచకిచ'మని అరుస్తూ, తన ప్రతిబింబంతో పోట్లాడుతున్నది

కాళిదాసు ముందు గదిలోకివచ్చి రెండు మూడు నిముషాలసేపు మురళీ రూబెనూ ఆడుతున్న ఆట చూశాడు తర్వాత పట్టాభి అటూ యిటూ కదలటం గమనించి అతన్ని తట్టిలేపుతూ ''అయ్యా! పట్టాభి రామచంద్రమూర్తీ! ఇంక మేలుకోండి తమవంటి వీరులిలా ఆదమరచి నిద్రపోవటం దేశానికి క్షేమంకాదు కాఫీ కలుపుతున్నాను లేచి బావి దగ్గర ముఖ ప్రక్షాళనం చేసుకురండి ఇదుగో టవల్'' అన్నాడు

పట్టాభిలేచి ఆవులించి చిటికెవేసి టవల్ లందుకుని పెరటిలోకి వెళ్ళాడు అతడు తిరిగి వచ్చేసరికి కాఫీ సిద్ధంగావుంది ఇద్దరూ కాఫీ త్రాగి మళ్ళీ ముందు గదిలోకివచ్చి కూర్చున్నారు

పొద్దు వాలిపోతున్నది ఎండలో చురుకుపోలు తగింది మురళి రూబెనూ యిక ఎనుగ ఫుట్స్ లేచి క్యారంబోర్డును యథాస్థానంలోవుంచి ''వేము వెడుతన్నామండీ'' అన్నారు కాళిదాసు రూబెన్‌ను ''గడియారం ఎలా వుందోయ్?'' అని అడిగాడు అతడు నవ్వి ఉత్సాహంగా ''చాలా బావుందండీ'' అని సమాధానం చెప్పాడు కాళిదాసు మురళిని వెనక్కు పిలిచి ''మేము రాత్రికి వచ్చేసరికి పొద్దుపోతుంది గదా! మీ రనవసరంగా కనిపెట్టుకునివుండటం ఎందుకు? ఈ రెండో తాళంచెవి నువ్వు తీసుకుపో పెందరాళే భోజనంచేసి వచ్చెయ్ అప్పలమ్మతో పిల్లవాణ్ణి చలి గాలిలో తిప్పవద్దని చెప్పు'' అన్నాడు మురళి తాళం చెవి తీసుకుని 'అలాగేనండి' అంటూ వెళ్ళిపోయాడు

పట్టాభి నవ్వి ''చలి గాలిలో తిప్పకూడదుట ఎంత చిత్రం! వాణ్ణి నువ్వు కనలేదు అయిదారు రోజుల క్రిందట వాడెవడో కూడా నీకు తెలియదు కదా! ఇంత శ్రద్ధ తీసుకుంటున్నావేం?''అని అడిగాడు

కాళిదాసు ఒక్కక్షణం నిశ్శబ్దంగా కూర్చుని ''కాదు పట్టాభీ! మొదట్లో నా కిది ఒక చిక్కు సమస్యగానే కనిపించింది కాని యీ రెండు మూడు రోజులలోనూ నా మనస్సు చిత్రంగా మారిపోయింది అదొక పవిత్రమైన బాధ్యత, ఆ బాధ్యతను శ్రద్ధగా నిర్వహిస్తే చివరలో తృప్తి కలగదంటావా?'' అని అడిగాడు

పట్టాభి గంభీరంగా ''అదేం ప్రశ్న? ఒక కష్టంలోవున్నవాడికి సహాయం చేస్తేనే మనకు

## ధృవతార

ఎంతో తృప్తి కలుగుతుందికదా? ఎంతో గర్విస్తాం కదా? అలాంటిది ఆ తల్లి తన రక్త మాంసాదులను వెచ్చించి కని నిర్దయతో వదిలిపెట్టిపోయిన పసి వాణ్ణి నీ వాడిగా భావించి, వాడికోసం కృషిచేస్తే తృప్తి కలగకపోవటం ఏమిటీ?'' అన్నాడు

తర్వాత యిద్దరూ దుస్తులు ధరించి తయారై తలుపుతాళంవేసి వీధిలోకి వచ్చారు ఎండ బాగా తగ్గిపోయింది నీడలు పొడుగ్గా సాగిపోతున్నాయి వీధిలో మూడేళ్ళ పసివాడొకడు ఎదురురాయి తగిలి పడి యేడుస్తుంటే, ఒక అయిదేళ్ళ పిల్ల వాణ్ని లేవదీసి గుడ్డలు దులుపుతూ ''పూలుకో తమ్ములూ' అంటున్నది బిస్కట్లు అమ్ముకునే వాడొకడు పిల్లలకు కనిపించేట్టు తిరుగుతూ వారికి వినిపించేట్టు అరుస్తూ వాళ్ళను ఆకర్షిస్తున్నాడు

పట్టాభీ, కాళిదాసూ ఆమాటా యీ మాటా చెప్పుకుంటూ నిరంజనశర్మగారి యింటి ముందు నుంచి నడిచిపోతూ వుండగా ఆయన పంచలో నిలబడివుండి చప్పట్లుకొట్టి పిలిచాడు కాళిదాసు లోపలికి వస్తూ నువ్వు కూడా రా పట్టాభీ! ఏం ఆలస్యం వుండదులే'' అన్నాడు ఇద్దరూ లోపలికి రాగానే కుర్చీలు చూపించి ఆయన కాళిదాసుతో ''ఏమీ లేదోయ్! మొన్న నువ్వు హెచ్చరించావు చూడు ఆ విషయం నలుగురిలో కదిపి చూశాను ఎవరూ వ్యతిరేకంగా లేరు కాకపోతే వాళ్ళ జీతాలు 'ఎలా పెంచాలీ?' అనే విషయం యింకా తేలలేదు నెమ్మదిమీద ఆలోచించి వ్యవహారం పైసలు చేస్తాను'' అన్నాచు

కాళిదాసు ''చాలా సంతోషం మీ పేరు చెప్పుకుని ఏదో కొద్దిగా అయినా సుఖపడతారువాళ్ళు అయితే యింక వెళ్ళి వస్తామండీ'' అంటూ లేచాడు ఆయన నవ్వి ''ఆ, యిందులో నాదేముంది ? నేనేమైనా కష్టార్జితం యిస్తున్నానా?'' అని ఆగి వాళ్ళిద్దరూ మెట్లు దిగుతూ వుండగా ''కాళీ! అప్పుడప్పుడు కనిపిస్తూవుండు'' అన్నాడు కాళిదాసు తలవూపి ''అలాగే'' అంటూ వీధిలోకి వచ్చాడు రాధ నెమ్మదిగా నడుస్తూ వారికి ఎదురుగా వస్తున్నాడు వాడి తల పెరిగి దుబ్బులావుంది చొక్కా లాగూ కొద్దిగా మాసివున్నాయి

కాళిదాసు నిట్టూర్చి వాణ్ని చూపిస్తూ ''చూశావా పట్టాభీ! ఆ కుర్రవాడు కలిగినవారి మనుమడు మనం యిప్పుడు మాట్లాడి వస్తున్నామే ఆయన కూతురి కొడుకు వాడి ఖర్మ చూడు వాణ్ని గురించి శ్రద్ధ తీసుకునే వారెవరూలేరు'' అన్నాడు పట్టాభికేమీ అర్థంకాక ''అదేమిటి?'' అని అడిగాడు కాళిదాసు ''ఆయన కూతురి పేరు వర్ధని చిన్నతనంలో మే మిద్దరం కలిసి బడికిపోతూ వస్తూ వుండేవాళ్ళం ఆ అమ్మాయికి పదమూడో యేట ఫోర్తుఫారం చదువుతూ వుండగా పెళ్ళి అయింది అయిదారు నెల్లకే చదువు మాన్పించి అత్తవారి యింటికి తీసుకుపోయారు తర్వాత రెండు సంవత్సరాలకో మూడు సంవత్సరాలకో కాన్పుకని పుట్టింటికి వచ్చింది ఇక్కడయినా ఆమెకు తల్లిలేదు అయినా భర్త ఉద్యోగం

చేస్తున్న పూట్లో అప్పుడ్రతి సౌకర్యం వుండక యిక్కడికి వచ్చింది తర్వాత మగపిల్లవాడు పుట్టిన వెంటనే ఆమె భర్తను బారసాల నాటికి బయలుదేరి రావలసిందని ఉత్తరం వ్రాశారు అతడు ఉత్సాహంగా యింట్లో పెట్టె బెడ్డింగూ సర్దుకుని కావలసినవన్నీ కొనుక్కుని అపురూపంగా లభించే సెలవు సంపాయించుకుని బయలుదేరి రైలు స్టేషనుకు వస్తూవుండగా దారుణమైన ప్రమాదం జరిగిపోయింది తప్పతాగి లారీ నడుపుతున్న వాడొకడు అతని పాలిటి యముడైనాడు ఆ విషయం తర్వాత రెండు రోజులకుగాని యిక్కడికి తెలియలేదు అప్పుడింక ఏముందీ ఏడుపులూ పెడబొబ్బలూ! ఆమె బావిలో దూకపోతే నలుగురూ అడ్డుపడి ఆపారు భూమిమీదపడగానే తండ్రిని చంపాడనీ నలుగురూ ఛీ అనివాణ్ణి ఛీదరించుకున్నారు అప్పటినుంచీ వీడంటే తల్లికి సరిపడదు ఆ ముసలాయనతప్ప వాడు వేళకు రాకపోయినా తిండి తినకపోయినా బాధపడేవాళ్లా యింట్లో మరెవరూ లేరు! అని చెప్పాడు

పట్టాభి హృదయం కరిగిపోయింది అతడేమి మాట్లాడలేదు వీధిలో ఒక చోట జనమూగి వున్నారు అక్కడ ఒక మూర్ఛవాడు అంత్రకితం పడిపోయాడు కాబోలు వాళ్లూ వీళ్లూ నీళ్ళు పొయ్యగా వళ్ళు తెలిసి వణుకుతూలేచి నుంచుని జనంముందు చెయి జాపుతున్నాడు తోచిన వాళ్ళు తోచినంత వాడి వణుకుతున్న చేతిలో ఎడేం పాపం అనుకుంటూ తమ దారిన తాము వెళ్ళిపోతున్నారు ఒక పల్లెని తల్లి అన్నంతో నిండిన విస్తరితెచ్చి వాడిముందు వుంచింది వాడి మెళ్లో ఒక రాగి రేకు వుంది దానిమీద వీడిపేరు మల్లన్న దిక్కు లేనివాడు వీడికి మూర్ఛవ్యాధివున్నది వళ్ళు తెలియకుండా పడిపోయినప్పుడు దయగల మహారాజులు నీళ్ళుపోసి ప్రాణం కాపాడవలసినది అని వ్రాసివుంది

కాళిదాసూ పట్టాభి ఎడుగంటలవుతూ వుండగా సిటీ అమ్యూజుమెంట్ సెంటర్ దగరికి వచ్చారు రేకులతో చుట్టూ కాంపౌండ్ వుంది బయట లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి కొంతమంది వ్యక్తులు పైజమా చొక్కాలతో మప్లర్లతో కిళ్ళీలు నములుతూ సిగరెట్లు కాలుస్తూ తిరుగుతున్నారు లోపలినుంచి తబలా హార్మోనియం మ్రోత వినవస్తున్నది ప్రదర్శనం యింకా ప్రారంభం అయినట్టులేదు వాకిట ఒక బోర్డు మీద మనోహరమైన నాట్య ప్రదర్శనములు శ్రీమతులు సావిత్రి అనసూయ మొదలైనవారు నాట్య ప్రదర్శనము తర్వాత బి యాకోబు గారిచే హాస్య ప్రదర్శనము ఉండును అని ఆనాటి కార్యక్రమం వ్రాయబడి వుంది

పట్టాభిముందు వెళ్ళి టిక్కెట్లు కొన్నాడు అక్కడ రెండు రకాల టికెట్లు ఉన్నాయి మొదటి తరగతి అర్ధ రూపాయ రెండవ తరగతి నాలుగణాలు పట్టాభి రూపాయ నోటు యిచ్చి రెండు టిక్కెట్లు కొనుక్కువచ్చి లోపలికి పోదామా? అని అడిగాడు కాళిదాసు కెందుకో అనుమానంగా వుంది అయినా అతడు ఏమీ మాట్లాడకుండా పట్టాభివెంట లోపలికి వెళ్ళాడు

లోపల చాలా సందడిగావుంది నాట్య ప్రదర్శనమేకాక లోపల రకరకాల జూదాలు వున్నాయి స్కిల్‌గేమ్సు అని అక్కడ ఒక చిన్న బోర్డువుంది దాదాపు నాలుగైదు రకాల జూదాలు సాగుతున్నాయి జనం చాలామంది అక్కడ నిలబడి డబ్బు పణంగా పెట్టి జూద మాడుతున్నారు పావులాకి అయిదు పావులాలు ఇంకా నాలుగూ రెండూ ఖాళీ అని అరుస్తూ నుంచుని వున్నాడొకడు షూట్ అని అరుస్తున్నాడు మరొకడు గాజు పలకలమధ్యగా ఒక చిన్న టేబుల్ టెన్నిస్ బంతిని విసురుతున్నాడొక కుర్రవాడు


కాళిదాసూ పట్టాభీ ఎడంగా నిలబడి ఈ వ్యవహారం అంతా గమనించారు వారిద్దరూ అక్కడికి రావడం గమనించి అందాకా డబ్బుపెట్టి ఎందెం కాస్తున్న యిద్దరు ముగ్గురు కుర్రవాళ్ళు నెమ్మదిగా జారుకోవటం వారు గుర్తించకపోలేదు

పట్టాభి వెనక్కు తిరుగుతూ ఇలాంటిచోట వుండే నాట్యాలు ఎలా వుంటాయంటావు? అన్నాడు కాళిదాసు నెమ్మదిగా మాట్లాడవయ్యా మహానుభావా! ఎవరైనావింటే ప్రమాదం ఇదొక ప్రత్యేక ప్రపంచం ఇక్కడ డబ్బుకు విలువ కనిపించటం లేదుకదా ఇక స్త్రీకి మాత్రం విలువేముంటుంది? అయినా టిక్కెట్లు కొన్నాంకదా? వెళ్ళి చూద్దాం అన్నాడు

ఒకడు టిక్కెట్లు చింపి వాళ్ళిద్దర్నీ లోపలికి పంపించాడు లోపల జనం కుర్చీల్లో కూర్చునివుండి యీలలు వేస్తున్నారు సోడాలు సిగరెట్లు కాఫీలు అమ్మేవారు కేకలు వేస్తున్నారు ఒక వ్యక్తి దుబ్బుగా పెరిగిన జుట్టుతో ఎర్రని నిప్పు ముద్దలవంటి కళ్ళతో గళ్ళలుంగీతో గేటు దగ్గర కుర్చీలో కూర్చుని వున్నాడు రంగస్థలంముందు క్రిందగా తబలా వాయించేవాడూ హార్మోనియం వాయించేవాడు కూర్చునివుండి శ్రుతి సరిచేసుకుంటున్నారు. వాళ్ళు వెనక్కు దువ్విన క్రాపులతో నోట్లో కిళ్ళీలతో మప్లర్లు ధరించివుండి ఒకరితో ఒకరు నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు. చుట్టూ అంతా సిగిరెట్ల బీడీల పొగ దట్టంగా వ్యాపించివుంది

తలనొప్పి పుట్టించేటంతగా తబలావాడు తన వాద్యాన్ని ప్రయోగించేసరికి రంగస్థలంమీద తెరలేచి కాళ్ళ గజెలను ఘల్లు ఘల్లుమనిపిస్తూ ముగురు స్త్రీలు వచ్చి నిలబడి ప్రేక్షక జనానికి నమస్కరించారు వెంటనే ప్రేక్షకులలోనుంచి యీలలూ కేకలూ కాస్సేపు వినిపించి తర్వాత క్రమంగా ఆగిపోయినయ్ వారు ముగ్గురూ ఒక సినిమా పాట పాడుతూ నాట్యం చెయ్యటం ప్రారంభించారు

అది జనంలోని సినీఅభిరుచులను రెచ్చగొట్టే పాట ఆలయశ్రుతులు కూడా అలాగే వున్నాయి పాటా నాట్యమూ జరుగుతూ వుండగా జనంలో కొందరు తబలా కనుగుణంగా యీలలు వేస్తు



పారిస్ అంతర్జాతీయ చిత్రప్రదర్శనకు ఎన్నుకోబడిన శ్రీ ఎస్ వి. రామారావు తైలవర్ణ చిత్రం, 'కొండలూ—చెట్లూ'

న్నారు నాట్యంచేసే స్త్రీలు కూడా వీటికి ప్రతిగా జనంవైపు చూసి వారిని రెచ్చగొట్టే పద్ధతిలో నవ్వుతున్నారు క్రమంగా అక్కడఉన్న కుర్చీలన్నీ నిండినయ్

కాళిదాసు ఆ స్త్రీలను జాగ్రత్తగా గమనిస్తున్నాడు వారిలో ఎవరికీ వయస్సు తక్కువ వుండదు అందరూ ముప్పయియేళ్ళు దాటినవారే మొహాల నిండా దట్టంగా రంగు పూసుకున్నారు అయినా ఆ లైట్ల వెలుతురులో వారి ముఖాలమీద మచ్చలూ, వారి శిధిలమైన అవయవాలూ జాగ్రత్తగా చూడ గలిగిన వాడికి కనుపించకపోవు ఎన్ని పొరలువేసి చూసినా అవతలి వస్తువు స్పష్టంగా కనుపించ గల, సన్నని ఉల్లిపొరలవంటి నైలాన్ చీరెలు ధరించి వున్నారు వారి గొంతులలో మార్దవంలేదు కదలిక లలో జీవంలేదు మొహాలలో కళాకాంతులులేవు వారు నవ్వుతూనే వున్నారు అయినా అది నవ్వుకాదు

పట్టాభి 'ఉస్సుర'ని నిట్టూర్చి కాళిదాసుతో "సావిత్రీ, అనసూయా వీరే నంటావా?" అన్నాడు

కాళిదాసు నివ్వెరపోయాడు తర్వాత జాలిగా నవ్వి "వీరే అయివుంటారు" అన్నాడు అలా ఆ నృత్య ప్రదర్శనం రకరకాల సినిమా పాటలతో దాదాపు ఒక అరగంటసేపు సాగింది వారు ముగ్గురూ వెళ్ళిపోగానే మరో క్రొత్త నర్తకి రంగస్థలం మీదికి వచ్చింది ఆమెకు ఎంతో వయస్సుండదు ఇరవైఅయిదేళ్ళు దాటి వుంటాయేమో! ఆమెలో యింకా జవమూ, సత్వమూ ఉడిగిపోలేదు ఆమె ప్రతి కదలికలోనూ ప్రతి చూపులోనూ దైన్యం జాలువారుతున్నది ఆమె యంత్రవతుగా ఒక అయిదు నిముషాలసేపు ఎటూ కదలకుండా నుంచుని మంచి పాట ఒకటిపాడి లోపలికి వెళ్ళిపోయింది ఆమె రాక పోకలు మునుపటివలె జనంలో ఉత్సాహాన్ని రేకెత్తించ లేదు పైగా పాడుతున్నంతసేపూ అరిచీ, గోల చేసీ "ఆడు లేకపోతే వెళ్ళిపో" "ఏడుపుమొహం" అనీ కేకలు వేశారు ఆమె వెళ్ళిపోగానే మళ్ళీ మొదటి వారికోసం జనం గోల చెయ్యటం ప్రారంభించారు ఈసారి వారు ముగ్గురితోబాటు ఒక అయిదేళ్ళ బాలిక కూడా రంగస్థలంమీదికివచ్చి వారిమధ్య కాళ్ళూ చేతులూ ఆడిస్తూ గెంతటం ప్రారంభించింది

కాళిదాసు పట్టాభి వంక చూశాడు పట్టాభి ఎటో చూస్తున్నాడు ఆలోచిస్తూ ఏదో గుర్తు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు కాళిదాసు నెమ్మదిగా, "ఆమె వాలకం చూశావా గురూ! పాపం! నాలుగు మెతుకులకు జరిగే వీలులేక యీ శ్లేష్మంలో యీగలాగా వచ్చి పడింది ఇది ఆమెకు చోటుకాదు" అన్నాడు పట్టాభి ఏదో జ్ఞాపకంరాగా "అబ్బ! ఇందాకటినుంచి ఆలోచిస్తున్నాన ఎక్కడ చూశానా అని ఈ అమ్మాయి మాతో స్కూల్ఫైనలు దాకా చదివిందోయ్ భోగంవాళ్ళపిల్లఅని అందరూ చెప్పుకుంటూవుండేవారు ఉన్నట్టుండి చదువు మానేసింది" అన్నాడు

కాళిదాసు "ఏమైనాకానీ ఆమెలో ఒక 'ట్రాజెడీ' ధ్వనిస్తున్నది" అన్నాడు

పట్టాభి "యింక వెళ్ళిపోదామా?" అని ప్రశ్నించగా "అదేమిటో హాస్యప్రదర్శనం వుందిగా దాని సొంపు కూడా గమనించి పోదాం" అన్నాడు, కాళిదాసు తర్వాత కొద్ది సేపటికి హాస్య ప్రదర్శనం

# ధ్రువతార

ప్రారంభమైంది ఒకడు వళ్ళంతా నల్లని రంగు పూసుకుని రేకు టోపీ పెట్టుకుని వచ్చాడు శరీరావయవాలన్నీ కనుపించేవిధంగా తెల్లని నైలాన్‌చీర ధరించిన మరో నర్తకి కూడా రంగస్థలంమీదికి వచ్చింది వారిద్దరూ సంభాషణ ప్రారంభించారు ఆ మాటలన్నీ అసహ్యకరమైనవే నలుగురిలో ఉచ్చరించరానివే అయినా వాడితోపాటు ఆమె కూడా సిగ్గూ ఎగ్గూ విడిచి ప్రతిపదంలోనూ బూతు ధ్వనించే ఆ సంభాషణలో పాల్గొంటున్నది వారు ఉచ్చరిస్తున్న ప్రతిపదానికీ, వారి ప్రతికదలికకు జనం 'ఘొల్లు'మని నవ్వుతున్నారు

---

ఉపాధ్యాయుడు క్లాసు పిల్లలతో

"ఒరే అబ్బాయిలూ! యిక నుంచి, మీ రెవరైన, అల్లరి చేశారంటే, వెంటనే నాకు రిపోర్టు చేయండి"

(మరునటి దినమున రాము నిలబడి)

రాము - "మాష్టారండీ! నేను నిద్రపోతూంటే' యీ సోముగాడు, ఎలా అల్లరి చేస్తున్నాడో చూడండీ"?

వై. మద్దుకృష్ణ (పాలకొండ)

* * *

"ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి!" అన్నాడు అప్పారావు. "90 రోజులయింది" అన్నాడు వెంకట్రావు "అరే భలే జ్ఞాపకమేనే!" అన్నాడప్పారావు "అప్పిచ్చినవాణ్ణి కదా. నేనైనా జ్ఞాపకముంచుకోవద్దా?" అన్నాడు వెంకట్రావు.

జి. ఈశ్వరవర్మ (జాలాపుట్)

---

కాళిదాసూ పట్టాభీ లేచి వెలుపలికి వచ్చారు వెలుపల యింకా జూదాలు ముమ్మురంగా సాగుతూనే వున్నాయి వాళ్ళిద్దరూ వీధిలోకివచ్చి నిశ్శబ్దంగా నడవటం ప్రారంభించారు

పట్టాభి ఉన్నట్టుండి "మా యింటి యజమాని వట్టి 'మఫ్'లా వున్నాడే చూసివచ్చినవాడు వూరుకోక మనతో దాన్నిగురించి పొగుడుతూ మాట్లాడటం ఎందుకు? అనవసరంగా రూపాయి ఖర్చు పెట్టించాడు ఇంటికిపోయి వాణ్ణి ఏం చేస్తానో చూడు" అన్నాడు

కాళిదాసు నవ్వి "నువ్వేం చెయ్యగలవు? అయినా ఆయనచెప్పే సమాధానం నేను ముందుగానే నీకు చెప్పగలను ఆయన తనకు 'నచ్చింది పొమ్మం'టాడు తన 'టేస్ట్'కు అది బాగుందని చెబుతాడు ఇంక నువ్వేం మాట్లాడగలవు? ఇలాంటి ప్రదర్శనలకు ప్రభుత్వమే అనుమతి యిచ్చి ప్రోత్సహిస్తున్నది నీచమైన అభిరుచులను తృప్తిపరచీ, యింకా రెచ్చగొట్టీ యీ ప్రదర్శనలు డబ్బుచేసుకుంటున్నాయి ఈ డబ్బులో ప్రభుత్వానికి కొంత రుసుముక్రిందా, అధికారులకు మామూళ్ళక్రిందా ముట్టజెప్పి వీరు తమ కార్యక్రమం యథాప్రకారంగా నడుపుకుంటారు ఇక్కడ స్త్రీ దేహాన్నే అమ్ముకుంటున్నది లంచాలు తీసుకుని, దొంగలెక్కలు వ్రాసీ, మోసాలుచేసీ అంతరాత్మలను గూడా అమ్ముకుంటున్న వారి సంగతేమిటి? ఈ అవినీతి యిలా విచ్చలవిడిగా సాగుతూనేవున్నది అయితే యిటువంటి లసభ్యమైన కార్యకలాపాలవల్ల వచ్చే నష్టం ఎప్పటికప్పుడు గమనించదగినంతగా వుండదు కాని ఇది క్రమంగా సంఘంలో ఒక భయంకరమైన మార్పును తీసుకువచ్చి తీరుతుంది ఉదాహరణకు ఒక తండ్రి చాటు పిల్లవాడు యిక్కడికి రావడం తటస్థించిందనుకో! ఆ వయస్సులో పిల్లల మనస్సులు ఎటు మళ్ళిస్తే అటు మళ్ళుతాయి వాడిక్కడికి వచ్చి యీ జూదాలాడటమూ, నాట్యాలనే పేరుతో జరుగుతును ఈ అసభ్యమైన కార్యకలాపం చూడడమూ జరిగితే, దానివల్ల ఫలితం తప్పకుండా ఉంటుంది నువ్వు చూశావుగా, మనల్ని చూచి ఆ ఇద్దరు ముగ్గురు పిల్లలూ ఎలా జారుకున్నారో" అన్నాడు

పట్టాభి "వాళ్ళు నాకు గుర్తే స్కూలుఫైనల్ 'సి' లో వున్నారు ఎక్కడో తల్లిదండ్రులు నానా కష్టాలూపడి వీళ్ళకు అవసరమైనంత డబ్బు పంపిస్తూ, ఇక్కడ వీళ్ళు బుద్ధిగా చదువుకుంటున్నారు లెమ్మ'ని అనుకుంటూ వుంటారు వీళ్ళేమో యిక్కడ అచ్చోసిన ఆబోతుల్లా తిరుగుతూ, చదువూ సంధ్యా లేకుండా యిలా పాడైపోతూ వుంటారు" అన్నాడు

కాళిదాసు "అంతేకాదు పల్లెటూళ్ళనుంచి ఏవేవో పనులమీద యిక్కడికి వచ్చే ఎంతో మందిని యీ జూదాలు బికారులనుచేసి పంపిస్తున్నాయి వారు ముందు పందెం కాయగానే దానికి రెండు మూడు రెట్లు వస్తుంది ఆ ధీమాతో మళ్ళీ మళ్ళీ చేతిలో వున్నదంతా వదిలేదాకా పందెం పెట్టటం మళ్ళీ తమ వూరికిపొయ్యేందుకు ఛార్జీకి కూడా చిల్లికానీలేక బాధ పడటమూ సామాన్యంగా జరుగుతూనేవుంటాయి" అన్నాడు

పట్టాభి నిట్టూర్చి "వాళ్ళను చూస్తే జాలి వేస్తున్నది" అన్నాడు కాళిదాసు "అవును మరి స్త్రీని యింతగా అవమానం చెయ్యటం జాతి పతనానికి బలమైన ఉదాహరణ దాంపత్య జీవితంలో వుండే ఒక మనోహరమైన సుఖం వారికి మృగతృష్ణవలె అందరానిది వీరిని శరీరంలో కండరాలూ, పొంకమూ ఉన్నన్నాళ్ళూ ఆకలిగొన్న మృగాలవలె నలుగురూ వాడుకుంటారు తర్వాత వారి గతి ఆ పరమేశ్వరుడికే తెలియాలి అది చాలా బ్రతుకూకాని ఒక భయంకరమైన అవస్థ" అన్నాడు (సశేషం)

## చదువుకున్న నక్క

(19-వ పేజీ తరువాయి)

"కాలేదూ అయితే మిగతా కథగూడా చెప్పు" అన్నాడు మనుమడు ఎంతో ఆసక్తితో

"చెప్తావుండు ఒక్కసారి మళ్లీ యీచుట్ట ముట్టించనీ!'' అంటూ తాతయ్య అగ్గిపుల్ల వెలిగించాడు

ఆ ఆలస్యాన్ని భరించలేకుండా వున్నాడు మనుమడు

"చెప్పు తాతయ్యా!" అంటూ తొందరచెయ్యసాగాడు.

"సరే! విను." అంటూ మళ్ళీ కథ మొదలెట్టాడు తాతయ్య.

*　　*　　*

ఈకాలంలో ఒక అడవిలో ఒక నక్క వుంది. ఇది జన్మతహా జిత్తులమారిది. దానికితోడు బాగా చదువుకున్నది. ఒకనాడు, ఉబుసుపోకకు ఒక పిల్లల కథలపుస్తకం తిరగవేయసాగింది. అందులో యింతకుముందు మనంచెప్పకున్న 'నక్క-కొంగ' కథ కనిపించింది. చివరకు చదివింది ఎంతో ఆశ్చర్యపడిపోయింది.

ఎత్తులు వెయ్యడంలో ముందెత్తున నిలిచే జిత్తులమారి నక్క వేసిన ఎత్తుకు, ఒంటికాలిపై నిలబడి దొంగ జపంజేసే కొంగ, పైఎత్తువేసి, నక్కని భంగపరిచిందంటే ఆశ్చర్యంగదూ?

ఆ ఆశ్చర్యం రానురాను ఆగ్రహంగా మారిపోయింది. లేకపోతే. వెధవకొంగ తన జాతిని మోసగిస్తుందా? ఆనాడు చదువుసంధ్యలు లేకపోవడంవల్ల ఆనక్క మోసపోయింది. కాని, తనో? బాగా చదువుకుంది తెలివితేటలున్నాయ్ కాబట్టి యీసారి ఆ కొంగలజాతిని తేలికగా మోసపుచ్చగలదు ఈ విధంగా తనజాతివారికి ఆత్మకుశాంతి

## ఒకరాగం - ఒకభావం

శ్రీమతి ఉమాశశి

ప్రశాంతమయ మీ సంధ్యారాగం
విశాలమయ మీ నందనవనము
కొమ్మన కోయిల కుహూకుహూ మంటూ
పాటలుపాడే సమయంలో

నే నాలపింతునే ఒకరాగం
నా హృదిలో కదిలెన ఒకభావం

చల్లచల్లగా పిల్లవాయువులు
గులాబి కన్నెతో సరసమాడగా
చిరునగవులతో చిన్నిపూవులు
హాయియలుగ వూగే సమయంలో.......

నే నాలపింతునే ఒకరాగం
నా మదిలో కదిలెన ఒకభావం

మిలమిల మెరిసే తారలతో
కలకల నవ్వేను జాబిల్లి
చుక్కలరేడు మక్కువతో
జగతిని చూచే సమయంలో

నే నాలపింతునే ఒకరాగం
నా ఎదలోన మెదిలె ఒకభావం

మధురభావములు మందమందముగ
అందముగా నా మదిలో మెదిలి
ఆనందించే సమయంలో

నే ఆలపింతునే ఒకరాగం
నా కవితకు అందెను ఒకభావం.

# చదువుకున్న నక్క

చేకూర్చాలనుకుంది చదువుకున్న నక్క

వెంటనే అడవిలోని ఒక కొలను దగ్గర కెళ్ళి అక్కడున్న ఒక కొంగని ఆహ్వానించింది విందుకు వెనుకటి నక్కమాదిరిగానే సాసరులో పాలు పోసి కొంగముందుపుంచింది. కొంగ, ఆపాలను త్రాగలేక వచ్చినదారినే బయలుదేరింది, నక్క యిలా ఎందుకు జేసిందా అని ఆలోచిస్తూ బయలుదేరిన కొంగని ఆపి, "మిత్రమా! నేనీరోజున నీకు విందు జేశానుగదా! మరినాకు నీవూ విందు జేయవా?" అని అడిగింది చదువుకున్న నక్క

లేకుంటే మరి తనని విందుకు ఆహ్వానిస్తుందో లేదో? . ఆహ్వానించకపోతే తనకోర్కె నెరవేరేదెలా? అక్కడగూడా తనదే పైచెయ్యి అనిపించుకుంటేనేగదా తనజాతిక ఆత్మశాంతి

"అలాగే!" అంది కొంగ

"అలాగే అంటేగాదు రేపే ఏర్పాటు చెయ్యాలి" అన్నదిఆజ్ఞాపించినట్టుగా చదువుకున్న నక్క.




ఈమాటలు కొంగకి నిప్పుమీద ఉప్పువేసినట్టుగా తోచాయ్ సరే దెబ్బకిదెబ్బ తియ్యాలనుకుంది. "అలాగే రేపు తప్పకుండా రా! మళ్ళీమళ్ళీ పిలిచిచేదిలెదు" అని చెప్పి వెళ్ళిపోయింది కొంగ

మర్నాడు కొంగదగ్గర కెళ్ళింది చదువుకున్న నక్క వెనుకటి కొంగమాదిరిగానే యీకొంగగూడా సన్నపాటిమూతిగల బారుకూజాలో ఎండ్రకాయలుపోసి నక్క ముందుపుంచింది

ఈసారి నక్క ఎలాగూ పరాభవింపబడుతుందిలే అని లోలోన సంతోషిస్తూవుంది కొంగ

కాని, నక్క సామాన్యురాలా? ఆకూజాను బోర్లించి, ఒక్కొక్క ఎండ్రకాయనూ చక్కగా గుటకాయస్వాహా చేసింది.

"భలే! భలే!" అన్నాడు మనుమడు చప్పట్లుచరుస్తూ.

"ఇంకేముంది! పాపం! ఎదురుగా నిల్చొని తన ఆహారంకేసి చూస్తూ గుటకలు వేయసాగింది కొంగ విజయగర్వంతో రొమ్ము విరుచుకొని నిలిచింది చదువుకున్న నక్క.

చూశావా బాబూ! చదువుకున్న నక్కకీ చదువులేని నక్కకీ తెలివితేటల్లో ఎంత తేడావుందో?. కాబట్టి. . చదువు. "అని, తాతయ్య అంటూ వుండగానే ". అతిముఖ్యం!" అంటూ పరుగున వెళ్ళి, తన వాచకం పుస్తకం తీసుకొని, లాంతరుముందు కూర్చొని చదువుకోసాగాడు మనమడు

★

కోటి సృష్టి ఎలా జరిగిందీ, కథలుగా, పాటలుగా పాడుతుండేవారు ఈ ఆనందం ఇలా కొన్నాళ్ళ సాగిసాగి ఒక రాక్షసుడు అడ్డుపడటంతో ఆగి పోయింది

ఆ రాక్షసుడి పేరే గ్రిండాల్ ! దేవుడికి వీడి పూర్వులపై కోపం వచ్చి శపించటంతో వీరంతా రాక్షసులైపోయారు వీడు రాక్షసుడుగా ఎక్కడో ఉంటూ, రాత్రిపూట సంచారానికి బయలుదేరే వాడు

హియొరాట్ భవనంలో జనం చేసే కోలాహలం, దైవప్రార్థనలు గ్రిండాల్‌కు నచ్చలేదు పైగా తన స్వేచ్ఛావిహారానికి భంగం కలిగిస్తూ ఈ జన సమ్మర్ధం ఇలా గోలచేస్తూ ఉండటం వల్ల చికాకు కలిగిందిఅంతటితోఆగకుండా దైవసృష్టి గియ్‌వసృషి అంటూ ఆ బోడి భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉండటంతో గ్రిండాల్‌కు వళ్ళు మండింది వీళ్ల అంతేదో తేల్చాలని ఒకరోజున హియొరాట్ భవనంపైకి బయల్దేరాడు

అమావాస్య రాత్రి చెట్లపై ఉన్న పక్షుల రావాలు కూడా సద్దుమణిగాయి రేరాజులేని రేయిని చూచి విలపిస్తున్నట్లు తారకలు తళుక్కు తళుక్కు మంటున్నాయి ఎక్కడో నక్కల అరుపు ప్రశాంత వాతావరణానికి ప్రమాదం కల్గిస్తున్నాయి హియొ రాట్ భవనంలో కూడా ఎక్కడా అలికిడి లేదు గుడ్లగూబ ఒకటి భయంకరంగా అరుస్తూ, ఒక మూలనుంచి ఇంకొక మూలకు ఎగురుతూ వెళ్లి పోయింది వేటకు బయల్దేరిన పులి పొంచి పొంచి పొదలమాటున మాటువేసుకు కూర్చునుంది భయంకరరాక్షసుడు గ్రిండాల్ ఒక్కొక్క అడుగే వేసుకుంటూ హియొరాట్ భవనాన్ని సమీపిం చాడు భవనంలో ఏ సద్దు వినిపించలేదు సైనికు లంతా తప్ప తాగి ఆదమరచి నిద్రిస్తున్నారు వారి ఉచ్ఛ్వాస నిశ్వాస ధ్వనులతో భవనం ప్రతిధ్వ నిస్తోంది ఒకడి కాలు ఇంకొకడి తలమీద, ఒకడి

# బియోవుల్ఫ్

(17-వ పేజీ తరువాయి)

చేయి మరొకడి తొడమీద వేసి నిశ్చలంగా పడి ఉన్నారు గ్రిండాల్ నెమ్మదిగా హియొరాట్ భవనంలోకి ప్రవేశించాడు తానేం చేసినా అడిగేవా రున్నట్లు లేదు వెంటనే ఒక సైనికుణ్ని పట్టు కున్నాడు అంత దూరాన పులివాత బడ్డ ఆబోతురంకెలో ఆ అభాగ్య సైనికుని ఆర్తనాదం కలిసిపోయింది తన సంహారకాండను సంతృప్తిగా ముగించుకొని గ్రిండాల్ చీకటితెరల మాటున ఎటో అదృశ్యమయాడు

బాగా తెల్లవారిం తర్వాత గాని, రాత్రి ఆ భవ నంలో జరిగిన దారుణ సంఘటన ప్రజలకు తెలియ లేదు

ఇలా ఎన్నో దినాలు దివా రేమిటి, పన్నె లుగు సంవత్సరాలు గడిచిపోయాయి గ్రిండల్ అక్రమాలను అణిచేందుకు హ్రాత్గార్ చేసిన ప్రయ త్నాలు నీఅరబోసిన పన్నీరులాగా వ్యర్థమయ్యాయి ఈ పన్నెండుగేళ్ల కాలప్రవాహంలో ఎంతోమంది మహావీరులు గ్రిండల్ పాలయ్యారు

కాలక్రమాన హియొరాట్ భవనం విజనప్రదేశ మైంది ఒకనాటి సుందరోద్యానాలు ముళ్ల పొదలకు ఆటపట్లయ్యాయి మహాసభా భవనం భయంకరసర్పరాజాలకు ప్రేమాస్పదమైంది ద్వార రక్షకులు నిల్చేచోట అల్లిబిల్లిగా అల్లుకున్న లతలే రక్షణభారం వహించాయి సంగీత సాహిత్య సౌరభాలకు ఆటపట్టయిన హియొరాట్ భూత పిశాచగణ అట్టహాస విలయాలకు నిలయమై పోయింది

రాజు, ప్రజలు, ఎన్నో సమావేశాలు జరిపారు ఎంతగానో చర్చించారు దైవప్రార్థన లన్నారు బలులన్నారు, మొక్కులు మొక్కారు, ఏమేమో

చేశారు కాని గ్రిండల్ అక్రమాలను అరికట్ట కలిగిన సర్వ రక్షకుడు, సత్యమూర్తి, దుష్టశిక్షకుడు.

ఆ భగవంతుడు ఎవడో, ఎక్కడ ఉన్నాడో, అసలు ఉన్నాడో లేదో ఎవరికీ బోధపడలేదు


రాజున్నా రక్షణలేని స్థితి ఏర్పడింది అస హాయశూరుడని పేరుగల హ్రాత్గార్ నిస్సహా యుడై పోయాడు దినదినం ప్రజల్లో ప్రబలు తున్న భీతి అతణ్ణి కృంగదీసింది ఎదుట కనబడే వాడైతే ఎంతైనా పోట్లాడొచ్చు అర్ధరాత్రిపూట దొంగచాటుగా వచ్చి దెబ్బకొట్టి పోయేవానితో పోరాట మెలా ఈ చింతే అతణ్ణి పీడించటం మొదలుపెట్టింది


ఈ సంఘటనల గూర్చిన విషాదగీతికలు ప్రపంచం నలుమూలలా వ్యాపించాయి ఈ వార్త క్రమక్రమంగా పాకిపోయి హైగ్లిక్ అనే గీట్ రాజుకు, ఆయన అనుచరులకు తెలిసింది హ్రాత్గార్ మహారాజకు సహాయం చేసేందుకు ఒక దళం ఏర్పాటైంది హైగ్లిక్ మేనల్లుడు ఈ దళానికి నాయకత్వం వహించేందుకు ముందుకు వచ్చాడు ఈ యువకుడు ఆజానుబాహుడు, అపార బలపరా క్రమ సంపన్నుడు ఈ తని బలపరాక్రమములు తెలిసి ఉన్నందువల్ల పెద్దవాళ్ళందరు ఇతణ్ని దీవించి ప్రయాణానికి సంసిద్ధం చేశారు మెరికల్లాంటి వాళ్లను ఏరుకొని ఈ యువకుడు ప్రయాణానికి ఉపక్రమించాడు

ఒక పెద్ద పడవ సిద్ధం చేశారు ఆ పడవ నిండా కావలసిన ఆయుధాలు, డాళ్లు వగైరా సామగ్రి అంతా వేశారు పెదల ఆశీస్సులతో ఈ యువకులు డేనిష్ రాజ్యానికి బయలుదేరారు వాతావరణం కూడా అనుకూలంగా ఉందేమో తెరచాప లెత్తటంతోటే పడవ బాణంలాగా దూసుకు పోసాగింది రెండవరోజుకే వారు డేనిష్ రాజ్యపు సరిహద్దులు చేరారు సూర్యాస్తమయ సమయా నికి వారికి సముద్రతీరం కన్పించింది



జాగ్రత్త ! నడుంవరకే తీయాలి సుమా !
చిత్రకారుడు ఎస్ జగన్నాథం (హైదరాబాదు)




కాల్గేట్ వాడి నోటినించి దుర్వాసన
రాకుండా చేసుకోండి
రోజంతా దంతక్షయం
రాకుండాకూడా కాపాడుకోండి!
ఎందుకంటె : ఒక్క సారి తోముకొంటేనే
కాల్గేట్ డెంటల్ క్రీమ్ నోటిలో దుర్వాసన మరియు దంతక్షయమునకు కారణమైన సూక్ష్మక్రిములను 85% వరకు తొలగించును
కాల్గేట్ 10 మందిలో 7 గురికి నోటి దుర్గంధమును వెంటనే అపుతుందని మరియు భోజనము అవగానే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొనుట ద్వారా ఎక్కువ మందికి ఎక్కువ దంతక్షయము అరికట్టిందని దంత శాస్త్ర చరిత్రలో పూర్వమెన్నడూ తెలియచేయనంతటా శాస్త్ర పరిశోధనల ఫలితముగా నిరూపించబడినది !
ఊరికే నోటిలో నీళ్లు పోసుకొని పుక్కిలించుట కాందు భోజనము అయిన వెంటనే క్రమంతప్పకుండా కాల్గేట్ తో పళ్లు తోముకోండి దాని చేసతనమైన నురుగు పళ్ల మధ్య కనపడకుండా ఉండే సందులలోనికి వెళ్లి నోటి దుర్వాసనకు మరియు దంతక్షయమునకు కారణమైన కుళ్లి పోతున్న ఆహారపు తునకలను తీసివేస్తుంది !
పిల్లలు కాల్గేట్ తో పళ్లు తోముకొనుటకు యిష్టపడతారు ఎందుకంటె చాలా సేపు ఉండే దాని పిప్పర్ మెంట్ వంటి రుచి అంటే వారికి ప్రీతి !
మీకు పొడరు కావాలంటే,
ఈ లాభములన్నిటిని మీరు
కాల్గేట్ టూత్ పౌడరు ద్వారా
పొందగలరు ఒక డబ్బా
నెలలు వస్తుంది
COLGATE
TOOTH POWDER
కాల్గేట్ తో క్రమం తప్పకుండా పళ్లు తోముకొంటే
✔ నోటి దుర్వాసనను పోగొట్టును
✔ దంతక్షయమును నిరోధించును
✔ పళ్లను మెరుస్తూ ఉండేలా ఉంచును
COLGATE
COLGATE
DENTAL CREAM
నోరు ఎక్కువ శుభ్రముగా తాజాగా ఉండుటకు మరియు పళ్లు ఎక్కువ తెల్లగా ఉండుటకు
ప్రపంచములో ఏ యితర పళ్లు తోముకొనే క్రీమ్ కన్న కాల్గేట్ నే ఎక్కువ మంది వాడుతున్నారు

# బియోవుల్ఫ్

అంతా పర్వతప్రాంతం రాజ్యంలోకి దారి రెండు కొండల నడుమగా ఉంది తూర్పు నుదయిస్తున్న వెన్నెలరేడుతో దోబూచులాడుతున్నట్లు సూర్యుడు రెండు కొండలనడుమగా తొంగి చూస్తున్నాడు అందకుండా తొలగిపోయే అతణ్ణి పట్టుకోవాలని పరుగులెత్తే చందమామ చిందులాటకు ఫక్కున నవ్వుతున్న ప్రకృతి పడుచు బింబాధర కాంతుల్లాగా సాంధ్యరాగరేఖలు ఆకాశాన్నలముకొంటున్నాయి నీలాల నింగి తెరపై కూర్చిన మంచి ముత్యాల్లాగా తళుక్కు తళుక్కు మంటూ తారకలు ప్రకాశిస్తున్నాయి అన్నివిధాల శోభాయమానంగా ఉన్న ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులౌతూ పడవనుంచి తీరం మీదికి అడుగుపెట్టారు మన వీరులు

"ఆగండి!" సింహగర్జనలాంటి ఈ గంభీర ధ్వనికి పర్వతద్వయం ప్రతిధ్వనించింది ధ్వని విన వచ్చిన దిక్కుకు తల త్రిప్పారు వీరులు అర మైలు దూరాన అచంచలంగా, పోతపోసిన విగ్రహంలాగా గుఱ్ఱంపైన కూర్చున్న ఒక అధికారి కన్పించాడు వీరులు అలాగే నిలబడిపోయారు మళ్లీ ఒక్క అడుగు ముందుకు వేశారు

"ఆగండి ! ఎవరు మీరు ! ఏ యుద్ధానికో సిద్ధమైపోతున్న సంగ్రామమూర్తుల్లాగా, ఆయుధాలు, కవచాలు ధరించి, పడవనిండా ఆయుధాలు వేసుకొని మా సీమలో అడుగు పెడుతున్నారు నా హయాంలో ఈవిధంగా సాహసించి అడుగు పెట్టి ఎవరూ ప్రాణాలతో బయటికి పోలేదు డేనిష్‌రాజ్య పరిధుల్లోకి అడుగుపెట్టిన మీ సాహసాన్ని ఏమనాలి ? మీరు మిత్రులో, శత్రువులో వివరించి గాని అడుగుపెట్టేందుకు వీల్లేదు మీ మధ్యగా ఇనపస్తంభంలాగా నిల్చున్న ఆ వీరుడెవ్వరు? మీ వైనం చెప్పందే మా సీమలో అడుగుపెట్ట సాహసించారో ! మీరు వచ్చిన పనేమిటో చెప్పండి" అని ఆ అధికారి అన్నాడు

ఈ యువకదళనాయకుడు ఒక్క అడుగు ముందుకు వేశాడు నెమ్మదిగా, స్పష్టంగా జవాబివ్వసాగాడు

"మాది గీట్ జాతి హైగ్లిక్‌రాజు అనుచరులం మా తండ్రిగారి పేరు ఎగ్తియోవ్ సుప్రసిద్ధ దళనాయకుడు ఆయన్ను అందరు ఎరుగుదురు నన్ను బియోవుల్ఫ్ అంటారు హాఫ్‌డెన్ మహారాజుకుమారులు హ్రోత్గార్ మహారాజును సందర్శించేందుకు సుహృద్భావంతో వస్తున్నాం ఈ విషయంలో మీ సహాయం కూడా కావాలి మేం వచ్చినపని రహస్యమైనదేం కాదు మేం విన్నదే నిజమైతే, మీ రాజ్య ప్రజలకు అదేదో దయ్యమో, భూతమో, రాక్షసుడో ఏదో తగని భీతాహం కల్గిస్తోందట అర్ధరాత్రప్పుడు వచ్చి అమానుషంగా జనాన్ని వధిస్తోందట ఈ పీడ తొలగించుకొనేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్న మీ మహారాజుకు, మాకు తోచిన రీతిగా సహాయపడదామని వచ్చాం ఈ సంగతి మీ మహారాజుకు మనవి చేయాల్సింది"


గుఱ్ఱంమీద కూర్చున్న అధికారి ఇలా అన్నాడు "మీ లక్షణం చూస్తే మీరు మా మహారాజుకు మిత్రుల్లానే ఉన్నారు సరే మీరు నావెంట రండి దారి చూపిస్తాను మా బలగం కొంత మీ పడవకు ఆయుధాలకు రక్షణగా ఉంటుంది మీరు వెర్రిమొర్రి వేషాలు వేస్తే తప్ప, మీ గీట్ మహావీరుడికి తగిన మర్యాదలన్నీ మేం జరపగలం ఆ పడవ క్షేమానికి కూడా హామీ యిస్తున్నాం"

డేనిష్ సైనికులు కొందరు పడవలోకి వెళ్లి సురక్షితమైన చోట లంగరు దింపించారు డేనిష్ మహారాజు హ్రోత్గార్ ఎలా ఉంటాడో చూడాలన్న ఉత్సాహం గీట్ యువకుల నవనాడుల్లోను పరవళ్లు తొక్కుతోంది కొంతదూరం వచ్చి డేనిష్ అధికారి హియొరాట్ భవనాన్ని చూపించాడు


"ఈ దోవన వెళ్లండి పూరు చేర్తారు నేను నా ఉద్యోగధర్మం నిర్వర్తించేందుకు వెళ్లాలి" అంటూ వెనక్కి వెళ్లిపోయాడు అధికారి


రెండు కొండల మధ్యగా ఉన్న రాచబాటను ప్రయాణంచేసి వారు రాజధానిని చేరుకున్నారు. రాజభవనం మొగసాల దగ్గర ఒక బల్ల కన్పించింది తమ ఆయుధాలు విప్పుకొని గీట్ యువకులు ఆ బల్లమీద కూర్చున్నారు

(ఇంకా ఉంది)



ఆహా! ఏమీ ఈ కుతుబ్‌మీనార్ సౌందర్యం!!! — వి రాజు (బందరు)





ပုံ ၇၊

## మనమహా-మన రాష్ట్రం

(11-వ పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఎక్కడా పెద్ద పరిశ్రమ లేమీ లేవు సింగరేణి బొగ్గుగనులు, సిర్పూరు మిల్లు, ప్రాగా టూల్స్, ఆల్విన్ మెటల్‌వర్క్స్ ఇలాంటివన్నీ తెలంగాణాలోనే ఉన్నవి ఇవికాక, కొత్తగూడెంలో ఎరువుల ఫ్యాక్టరీ, దుక్క ఇనుము ఫ్యాక్టరీ, కేంద్రరంగంలో 30 కోట్ల పెట్టుబడితో థర్మల్ విద్యుత్ కర్మాగారం, ఔషధాల కర్మాగారం ఇలాంటి పెద్ద పరిశ్రమ లెన్నో అక్కడ నెలకొల్ప బోతున్నారు వీటన్నింటినిబట్టి చూస్తే, రాష్ట్రంలో వెనుకబడిఉన్న ఉత్తరాంధ్ర, రాయలసీమలకన్నా, తెలంగాణా వేయిరెట్లు మెరుగని ఒప్పకోక తప్పదు

అయినా, తమకు అన్యాయం జరుగుతోందని ఇంకా తెలంగాణానాయకులంటున్నారంటే, అందుకు కారణాలు వేరు అవి: (1) రాజకీయంగా తమ ప్రత్యేకత, పలుకుబడి, నాయకత్వం నిలుపుకోవాలనీ, అందుకు ఈ ప్రచారాన్ని సాధనంగా వినియోగించుకోవాలని అదుర్దా పడడం (2) సోదరాంధ్రులతో మమ్మేకమవలేక ఒకరకమైన ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ పెంచుకొని బాధ పడటం అయితే ఇది నాయకులకే పరిమితమై ఉండటం కొంతలో కొంత మేలు మంత్రివర్గంలో గాని, శాసనసభలో గాని సంఖ్యాబలం చూస్తే తెలంగాణా, రాయలసీమ మొదలైన వెనుకబడిన ప్రాంతాలవారిదే ఆధిక్యత సర్కార్ ఆంధ్రులు పెత్తనం చెలాయించగల అవకాశం ఏమీ లేదు అయినా అనుమానం పెనుభూతం

తెలంగాణావారిని చూచి, రాయలసీమవారు కూడా, మరచిపోయిన అపోహలను మళ్లీ రేకెత్తించుకొంటూ ప్రాంతీయ ధోరణిలో ఆలోచిస్తున్నారు త్వరలోనే రాయలసీమ శాసన సభ్యుల సమావేశం ఒకటి ఏర్పాటు చేసుకుంటు న్నారు ఒకవైపు ప్రాంతీయాభిమానాన్ని నిరసిస్తూ, అదే ధోరణిలో ఆలోచించడం ప్రజా ప్రతినిధులకు, నాయకులకు తగునా? ఈ రకంగా ఏ ప్రాంతం ప్రజలు, ఆ ప్రాంతం దృష్టితో సమస్యలు పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ సమగ్రదృష్టి లోపించి అభివృద్ధి కృషి కుంటుపడదా అని ఆలోచించాలి ఇటువంటి సంకుచిత మనస్తత్వం ప్రజా శ్రేయస్సుకు, రాష్ట్రాభ్యుదయానికి చెరుపు కలిగిస్తుంది

తమకున్న బలాన్ని గ్రహించి, ప్రభుత్వం నిజాయితీని విశ్వసించి తెలంగాణా నాయకులు ఇప్పటికైనా తమ ధోరణి మార్చుకొనడం ఉచితం

* * *

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో శాఖలు మార్చి అట్టే కాలం గడవకముందే, మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి కొన్ని మార్పులు చేశారు మార్చరాదని కాదు పదేపదే ఇలా చేస్తున్నందువల్ల, ఏ శాఖకు ఎవరు అర్హుడు అన్న విచక్షణాభావం పోయి, ఎవరైనా ఏ శాఖకైనా అర్హుడేనన్న అభిప్రాయం ఏర్పడుతుంది దక్షత గ్రహించకుండా మార్పులు చేస్తే, ప్రధాన మంత్రి నెహ్రూ కేంద్ర ఆర్థిక శాఖను నిర్వహించినట్లే ఉంటుంది ఇప్పుడు జరిగిన ఈ మార్పు తెలంగాణావారిని తృప్తిపరచడంకోసం జరిగింది

ఆంధ్ర, తెలంగాణ పెద్దమనుష్యుల ఒప్పందం ప్రకారం రెవెన్యూ, ఫైనాన్సు, ప్లానింగ్, హోం, పరిశ్రమలు ఈ ఐదు శాఖలలో కనీసం రెండు తెలంగాణాకు ఇవ్వాలని ఉన్నది హోంశాఖను ఇటీవల ముఖ్యమంత్రి స్వాధీనం చేసుకొనేవరకూ ఈ ఏర్పాటు ఒప్పందం ప్రకారమే ఉంది హోం శాఖను తను తీసుకొన్న తరువాత పై ఐదు శాఖలో రెవెన్యూతోబాటు మరో శాఖను తెలంగాణాకు ముఖ్యమంత్రి ఇవ్వలేదు తీరా రెవెన్యూ మంత్రి ఢిల్లీ వెళ్లి అగ్రనాయకులతో మాట్లాడి వచ్చిన తరువాత, ముఖ్య శాఖల కేటాయింపులో ఒప్పందాన్ని ఉల్లంఘించారని విమర్శించేసరికి ముఖ్య మంత్రి మేల్కొన్నారు హోంశాఖను శ్రీమందులనుంచి తా మెందుకు తీసుకోవలసి వచ్చిందో, మరో ముఖ్యశాఖను రంగారెడ్డి విమర్శించేదాకా మరో తెలంగాణా మంత్రికి ఇవ్వాలని ముఖ్యమంత్రికి ఎందుకు తట్టలేదో తెలియదు

అసలే తెలంగాణావారు పెద్దమనుష్యుల ఒప్పందాన్ని సరిగా పాటించడం లేదని, ముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతంవాడై ఉండగా ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షపదవి తమకు ఇటీవల యిచ్చి ఇప్పుడు పూడ పెరుక్కున్నారని బాధపడుతున్నారు అలాంటి సందర్భంలో, వారేదో ముఖ్య మనుకున్న శాఖలలో రెండింటిని వారికి వదలినా పోయేదేమీ లేదు ఒక మంత్రి ఒక శాఖకు పెత్తనం వహించినా, మంత్రి మండలిది సమష్టి బాధ్యత గనుక ఆ ఒక్కడూ చేయగలిగిందేమీ లేదు కాని శాఖలకు సంబంధించినది స్వల్పవిషయమే అయినా, దీనివల్ల పెద్ద మనస్తాపాలు పెరిగే అవకాశం ఉంటుంది

ఇందులో ఉపముఖ్యమంత్రి శ్రీ రంగారెడ్డి అనుసరించిన పద్ధతి కూడా ఏమీ బాగాలేదు ముఖ్యమైన శాఖలలో ఒకటి తమ కివ్వకపోతే, దాని కోసం ఢిల్లీ పరుగెత్తుకుని వెళ్లడం గాని, పత్రికా విలేఖరుల సమావేశంలో ముఖ్యమంత్రిపై బహిరంగ విమర్శకు దిగడం గాని సబబా ముఖ్యమంత్రితో స్వయంగా ఈ విషయం మాట్లాడి తేల్చుకుని ఉంటే అనవసరమైన గాలిదుమారం రేగిఉండేది కాదుగదా ప్రతి చిన్న విషయానికి రచ్చకెక్కడం నాయకులకో అలవాటు వయోవృద్ధులు, అనుభవజ్ఞులు అయిన రంగారెడ్డికి కూడా అది తప్పలే! ★

---

## హరివంశం

(15-వ పేజీ తరువాయి)

నకు ఇది ప్రణవాక్షరము అట్టి కాశికి పరమశివుడు, ఈశానుడై, పసిడి తాలావుకోల, వల్లజడలు, అసితగళ మూలము, త్రిశూలాయుధములతో తదిసి పేష ముతో విజయం చేసినాడు కాని కాశిలో ఏమి వున్నది! ఒక్క పురుగులేదు ఆకాశమున మేఘములు లేవు అసలు ఆకాశమేలేదు కాశిక తప్ప వేరు భూమి లేదు విశ్వేశ్వర శ్రీమన్మహాదేవుడు మాత్రము జ్యోతిర్లింగాకారుడై వెలుగుతున్నాడు ఈశానుడనుకున్నాడు: "ఈ మహాలింగమును నేను సహస్ర కలశాభిషేకంతో తన్పు తాను తత్పాదతీర్థ ప్రసాదోదకములు ఆస్వాదిస్తాను" అనుకొని ఈశానుడు శాతాగ్రమైన శూలమును పూదినాడు కాశి నగరీక్షేత్రోపకంఠము నందు ఆ శూలాగ్రముచేత ధరణీ చక్రమును భేదించినాడు శూలాగ్రము ఏడు లోకములలోతునకు దిగబడినది మరల ఆయన ఆ శూలమును పైకి లాగగా దానితో జలము పెల్లుబికి పైకి వచ్చినది ఆ శాత శూలాగ్ర మహా వివరసరణిని అనుసరించి ఏడు పాతాళములనుదాటి, ఇలయుదూరి, అంబరమును ఆ అంబుధార తాకినది దానికి పరమశివుడు వరణదార అని నామధేయమును వుంచినాడు ఆ జలశుద్ధస్ఫటిక నిర్మలము శరజ్జ్యోత్స్నాస్వచ్ఛము శశిఖండ సంకాశము సుధాధారా మధురము పాటలీ కుసుమ సౌరభము అది పైకి ఎగసినప్పుడు, వెండి తీగలను బోలి మిలమిలలాడిపోయినది ఆ జలముతో ఈశానుడు సహస్రధారాకలశముగా విశ్వేశ్వర శ్రీమన్మహాదేవుని అభిషేకించినాడు అభిషేకము చేయగా, ఆయనకు, అయతాండవ కేళీ సమయ సముద్భవమగు నీర్పట్లు తొలగిపోయినది అప్పుడు విశ్వేశ్వరదేవుడు ఈశానునకు దర్శనము నిచ్చినాడు ఈశానుడు కోరిన ప్రకారము ఎచ్చట వరణాంబుధార పాతాళ గర్భ కుహరమును చీల్చుకొని శివుని శాతాగ్రశూలముపెంబడి పైకివచ్చినది, అచ్చట జ్ఞాన తీర్థము ఏర్పడునట్లు అనుగ్రహించినాడు ఆ జ్ఞాన తీర్థమునే జ్ఞానవాపిక అని, జ్ఞానోదమని, శివజ్ఞానమని, శివతీర్థమని అంటున్నారు ఆ జ్ఞానవాపికముందు వున్నది దానిని గూడ వనము చూడవలయును శ్రీకృష్ణ! ఆ జ్ఞానవపిక మరియు మహాత్మ్యము కలది" ★

# ఆదర్శాలు-అంతర్యాలు

(12-వ పేజీ తరువాయి)

"అయితే కలలు నిజం కావంటావా అక్కా"

"ఉహూఁ"

"అయితే ఆయన" వాక్యం పూర్తిచేయలేక పోయింది లలిత

"పడుకోబోయేప్పుడు మనం ఆలోచించుకునేవే కలలోకి వస్తాయి బహుశః నీవు పడుకోబోయేముందు మాస్టార్నిగురించి మథనపడి ఉంటావు అందుకే అలా కలవచ్చింది నాకు మీ బావ ఎన్నోసార్లు కలలో కనిపించేవారు" అని ఆగిపోయింది ఇందిర నాలిక్కొరుక్కుంటూ కలలో వచ్చింది జరుగదని చెబుతూ, బావతో కలలో కేరింతలుకొట్టానని చెప్పినందుకు ఇందిర కాస్త జంకింది

"మరి నాన్న కనిపించడం, ఎవరో ఆయనను తలమీద కొట్టడం, నన్ను చరచర లాక్కుపోవడం ఇదంతా ఏమిటంటావ్ ?" ఆందోళనగా అంది లలిత

"అవీ మన మనస్సులోని సంగతులే! అంతకంటే మరేంలేదు"

"రేపు ఒకసారి వెళ్ళి ఆయన్ను చూడాలని ఉంది"

"నాన్నకు తెలిస్తే నీవు అక్కడకు వెళ్లడం బాగుండదు ఇంటికే ఆయన్ను పిలిపిద్దాం"

"అప్పుడుమటుకు నాన్నకు తెలియదూ ?"

"బహుశా నాన్న రెండురోజులలో హైద్రాబాదు వెళ్లవచ్చు అప్పుడు చూద్దాం ఇంక పడుకో" అంటూ ఇందిర పడుకుంది నిద్దర్లో ఇందిర ఎందుకు నవ్విందో లలితకు తెలియనే లేదు" బహుశా బావ కలలో కనిపించాడేమో! బావ కౌగిట్లోకి తీసుకుంటే ఆ తియ్యదనంలో అక్క నవ్విందేమో!" అనుకుంది లలిత

ఇద్దరూ ఎవరి పక్కలమీద వాళ్ళు పడుకున్నారేకాని ఇద్దరికీ నిద్దర్లు రావడంలేదు ఏదో మూగగా ఆలోచిస్తున్నారు

"ఈ కష్టలు, పట్టుదలలు ఎందుకు ? ధనవంతుడు, బీదవాడు అనే భేదభావం ఎప్పుడు పోతుంది ? ప్రశాంతంగా జీవితం గడుపుతున్న నాన్న రాజకీయాలలో ఎందుకు తలదూర్చాలి ? ఎన్నికలలో నిలబడాలన్న తాపత్రయం దేనికి ? నిజానికి ఆయన చేసిన త్యాగం ఏమిటి ? దేశానికి చేసిన సేవ ఏమిటి ? ఒకవిధంగా ద్రోహం చేశాడేమో కూడా పట్నంలో ఉంటేమటుకు ఇవన్నీ అన్నయ్యలకు తెలియవా ? తెలిస్తే ఎందుకు జోక్యం కలిగించుకోరు ?" అని ఆలోచిస్తున్నది ఇందిర

"తనకూ నాకూ మధ్య అంతస్తుల తేడా ఉందనుకున్నప్పుడు ఆయన తననెందుకు ప్రేమించాలి ? ప్రేమించిన వస్తువును త్యాగంచెయ్యడంలో ఘనతఉంటుందనీ, ఆ త్యాగాన్ని తన అసమర్థత అని ఒప్పుకోవడ మేమిటి ? పైగా తనను భగవంతుణ్ని ఆరాధిస్తున్నట్టు ఆరాధిస్తున్నాననీ, ప్రేమిస్తున్నాననీ అనడమేమిటి ? ఇన్ని చెప్పి తనను మరచిపొమ్మనడమేమిటి ?" అనుకుంటున్నది లలిత

"నాన్న రాజారావుగారికి లలిత నివ్వడానికి ససేమిరా ఇష్టపడరు ఈసంగతి దానికి తెలిసికూడా అతనిమీద మనస్సు నిలుపుకుంది, వచ్చే పరిణామాలు ఆలోచించకుండా పోనీ అమ్మ నాన్నను సమ్మతింప చేస్తుం దనుకోడానికి ఆమె మాటకు ఆయన ఒకప్పుడు విలువిచ్చాడుకనుకనా ? ఒకసారి అన్నయ్య వస్తే బాగుండు" ననుకుంది ఇందిర క్రమంగా ఆమె ఆలోచనల్లోకి భాస్కరం వచ్చాడు

"ఆయనదగ్గర నుంచి ఉత్తరాలు లేక చాలా రోజులయింది తను రెండు ఉత్తరాలు వ్రాసినా సమాధానమే వ్రాయలేదు ఏం మనిషి తన ఉత్తరంకోసం ఎదురు చూస్తుంటానని తెలియదూ! ఏమైనాసరే ఈసారి అక్కడినుంచి ఉత్తరం వస్తేకాని తను వ్రాయకూడదు ఏమిటో తను ఆయనదగ్గరనుంచి ఉత్తరాలు రాలేదనుకోడం తప్పితే, వచ్చిన ఉత్తరాలలో మటుకు ఆయన ఘనంగా వ్రాసిందేముంది ? ఎంతసేపూ తన చదువుగొడవ తప్పితే

మొదట తనకు చదువుమీద ఆసక్తి కలగలేదు ఆ ఆసక్తి రాజారావు కలిగించారు ఫరవాలేదు చదువు ధోరణిలో పడ్డాను కదా అనుకుంటే నాన్న ఆయన్ను చాలించి సీతారామయ్యగారిని ప్రైవేటుకు కుదర్చడంతో ఆ ఆసక్తి తగ్గిపోయింది ఆయన ఏదో లొడలొడ చెప్పివేస్తాడు ఒక్కటీ తన మనసుకు పట్టడంలేదు అర్థంకాలేదు, మళ్లీ చెప్పండి అంటే ఆయనకు పుట్టెడు కోపం పైగా "మనస్సు ఎక్కడో పెట్టుకొని కూర్చుంటే ఏమర్థమవుతుంది ?" అంటారు అడిగినదానికి సరిగ్గా సమాధానం చెప్పడంలేదని చికాకు పడతారు ఈ సంగతే అమెరికాకు వ్రాస్తే 'మళ్లీ వెనుకటి మాస్టారనే పెట్టుకో—ఆయన ఎందుకు మానేశాడు" అని సమాధానం వ్రాశారాయన నాన్నతో అంటే "నీ ముఖం—సీతారామయ్యగారికంటే బాగా చెప్పేవాళ్ళ ఈ ఊళ్లోనే లే" రన్నాడు ఇంకేంచేస్తుంది తను ? పరీక్షలు కూడా దగ్గరకు వస్తున్నాయి చదువిలా సాగుతుంటే తనేం ప్యాసవుతుంది ?" అనుకుంది ఇందిర

"అమ్మ సంబంధాలు చూడమని ఇప్పటినుంచే నాన్నను పోరుతున్నది రేపు పరీక్షలు కాగానే ఎవరినో ఒకరిని తీసుకొచ్చి అంటగడతారేమో! హృదయాన్ని మేస్టారికి ఏనాడో అంకితంచేసింది తను మరొకరిని ఎలా పెళ్లిచేసుకుంటుంది ? ఇంకా కొన్నాళ్లపాటు చదివితే ? తను చదువుకుంటానంటే నాన్న తప్పకుండా చెప్పిస్తానంటాడు తను హాయిగా హైదరాబాదులో అన్నయ్యలతోపాటు చదువుకోవచ్చు అప్పటికి పరిస్థితులు అనుకూలిస్తే మేస్టారే తనకు లభించవచ్చు ఇంతకంటే తనకు గత్యంతరం లేదు" అని ఆలోచిస్తున్నది లలిత

"నిద్దర రావడంలేదా లలితా ?" అని ప్రశ్నించింది ఇందిర

"ఉహూఁ నీకూ రావడంలేదల్లే ఉందే!

పించం, బావ జ్ఞాపకంవచ్చాడేమో" అంటూ లలిత లేచికూర్చుంది

ఇందాకటి నుంచీ నీవు మనస్సులో మేస్టారితో మంతనాలు ఆడుతున్నావుకదూ ?" తనూ లేచి కూర్చుంటూ అంది ఇందిర

'పో—అక్కా నీ కెప్పుడూ వేళాకోళమే ! మూతి ముడుచుకుంటూ అంది లలిత

"ఇద్దరం ఒకేస్థితిలో ఉన్నాంలే చెల్లీ ! వేల మైళ్ల దూరాన ఉన్న మీ బావకోసం నేను, దగ్గరలోనే ఉన్నా రాజారావుగారిని చూడలేక నీవూ ఇలా పరితపించాల్సిందే కొన్నాళ్ళ"

'ఆ కొన్నాళ్లకైనా నీకు ఆనందం కలిగిస్తాడు బావ వచ్చి నేనే ఇలా జీవితమంతా పరితపించాలేమో ?"

"ఛీ ఏమిటా మాటలు ఎందు కంత అధైర్యపడతావు ఏమో నీ కోరికే తీర వచ్చునేమో, ఎలా చెప్పగలం ?" అంది ఇందిర

"నా కెందుకో నమ్మకం లేదక్కా ఆయన అన్నట్టు ముందుముందు పరిస్థితులు ఇంకా ప్రతికూలంకావచ్చు ఆయన నాన్నగారిపక్షం ఉంటే బాగుండేదేమో" సాలోచనగా అంది లలిత

"ఇద్దరూ ఒకేపార్టీకి చెందినవాళ్లయినా ఎన్నో అభిప్రాయభేదాలయ్యే ఇప్పటికైనా మించి పోయిందేమీ లేదు—మేస్టారు నాన్నపక్షం ఉండటానికి" అంది ఇందిర

"పోలాయిమీద ఉన్న గురి నాన్నగారిమీదలేదు"

"ఎలా ఉంటుంది చెల్లాయ్ నిజంగా పోలాయి ఎంత మంచివాడు ఎందుకోగాని పోలాయిని చూస్తే ఎంతో అభిమానంగా ఉంటుంది"

"నిజమేనే అక్కా—నాకూ అలాగే ఉంటుంది ఒకరోజు ఏమైందనుకున్నావ్, నీకు చెప్పలే దనుకుంటా ఆరోజు మాకు డిబేట్సు అయి స్కూలునుంచి బయటకు వచ్చా ఆరోజు కమల రాలేదు నేను ఒక్కతెనే అయ్యాను వెనుకనుంచి ఇద్దరు విద్యార్థులు గోలచేస్తూ వస్తున్నారు అందులో కాస్త ఊరిబైటేమో, రోడ్డుమీద ఎక్కువగా ఎవరూ లేరు నాకు భయం వేసింది ఆ ఇద్దరిలో ఒకడునా మీదకు చిన్న రాయి విసిరాడు నేను వెనక్కి తిరిగి చూసేప్పటికి ఇద్దరూ పగలబడి నవ్వారు "ఓహో నా ప్రేయసీ" అని ఒకడు పాట లంకించుకున్నాడు నాకు భలే కోపం వచ్చింది కాని ఏం చేయను వంటరిదాన్ని ఇదంతా దూరాన్నుంచి పోలాయి కనిపెట్టాడేమో పరుగెత్తుకుంటూ ఆ విద్యార్థుల ముందుకు వచ్చి దూకాడు

"ఏయ్—అబ్బాయిలూ, చదువుకుంటున్నారన్న మాటేగాని బొత్తిగా మర్యాద తెలియదేం ?" అన్నాడు వాళ్లను

ఏమీ ఎరగనట్టు వాళ్ళు "మేమేం చేశాం" అని తెల్లముఖాలు వేశారు


"పైగా అబద్ధాలాడుతా రెందుకూ ? ఈసారి ఇటువంటి పిచ్చివేషాలు నే నెప్పుడైనా చూశానా కాళ్ళు విరగ కొట్టేస్తాను జాగ్రత్తగా ఒళ్ళు కాపాడుకొని చదువుకోండి" అని పోలాయి అనేప్పటికి వాళ్ళు మళ్లీ నోరెత్తకుండా ఇంకోమార్గం గుండా వెళ్లిపోయారు

"ఉత్త పిరికి సన్నాసులు రండి లలితమ్మ గారూ, ఇంటిదాకా వచ్చి దిగబెడతా"నని పోలాయి ఆరోజు మనింటిదాకా వచ్చాడు నిజంగా ఆరోజు పోలాయి సమయానికి రాకపోతే వాళ్లు ఇంకెంత అల్లరిపెట్టేవాళ్లో నన్ను" అంది లలిత

## ఆదర్శాలు-ఆంతర్యాలు

"పోలాయిలో మంచిగుణాలు ఉండబట్టే అందరూ అతనంటే అభిమానపడతారు అందుకే రాజారావుగారు పోలాయికి చదువు చెబుతున్నారు" అంది ఇందిర

"ఆయన ఎంత చెప్తే అంతట పోలాయి నాన్నగారికీ, ఆయనకూ మనస్పర్థలొచ్చాయని తెలిసి చలమయ్య బాబాయి ఆయనను తన పక్షం



తేసుకోవాలని చూస్తున్నాడట" అంది లలిత

"ఇవన్నీ నీ కెలా తెలిశాయే ?"

"మనకు తెలియకపోతే సరా ఊళ్లో అందరికీ తెలుసు మొన్న స్కూల్లో మాస్టర్లు అనుకుంటున్నారు మాస్టర్లందరికీకూడా నాన్నగారన్నా, చలమయ్య బాబాయన్నా మంచి అభిప్రాయం లేదట్క హైస్కూలును చేయడానికి రాజారావుగారు ప్రయత్నిస్తున్నరోజుల్లో చలమయ్య బాబాయి చాలా అడ్డుపడ్డాడుట నాన్నగారిని సహాయమడిగితే, ఇదుగో — అదుగోనని తిప్పించి తిప్పించి ఇప్పుడు మనకు హైస్కూలు లేకపోతేనేం అన్నారట" అంది లలిత

"అయితే మొన్న 'స్కూల్ డే' ఉత్సవానికి నాన్నగారిని అధ్యక్షులుగా ఎందుకు పిలిచారో ?" సాలోచనగా అంది ఇందిర

"జిల్లా పార్టీ అధ్యక్షుడు కాబట్టి తప్పనిసరిగా పిలిచిఉంటారు మొన్న మంత్రిగారు వచ్చి వెళ్లినప్పటినుంచి చలమయ్యబాబాయి చిందులు తొక్కుతున్నాడట మేస్టారికీ, మంత్రిగారికీ స్నేహం కావడంవల్ల ఆరోజా విందుకు ఇష్టం లేకపోయినా ఆయన్ను పిలిచారనీ, మేస్టారి ఉపన్యాసం పెట్టించినందుకు "నాకు తెలియకుండా ఆయన ఉపన్యాసం ఎందుకు పెట్టించా" రని హెడ్మాస్టరుతో నాన్నగా రన్నారనీ స్కూల్లో చెప్పుకున్నారు

"మొత్తానికి చాలా విషయాలు తెలుసుకున్నావే ఇన్ని సంగతులు తెలిసినదానివి మేస్టారితో సంబంధం ఎలా కుదురుతుందనుకున్నావ్" నవ్వుతూ అంది ఇందిర

లలిత మౌనం వహించింది

"తెల్లారొచ్చింది ఒకనిద్ర తీద్దాం పడుకో" ఇందిరే మళ్లీ అంది

"నాకు నిద్దర రావడంలా నీవు పడుకో"

"నే మేస్టారిని పిలిపించి మాట్లాడుతాలే— నాన్న హైదరాబాదు వెళ్లాక"


"ఏం మాట్లాడుతావేం ?"

"ఏమండీ మరిదిగారూ, మా చెల్లాయి మనస్సుకు ఇష్టంలేనిపని చేయకండి మా నాన్నగారితో పొత్తుకలిస్తే ఆ మూడుముళ్లూ వేయించే మార్గం నేను చూస్తాను అంటాను" మాటలు సాగదీస్తూ అంది ఇందిర

"అప్పు డాయ నేమంటారో తెలుసా మీ చెల్లాయికి నామీద అంత ఇష్టమే ఉంటే మీ నాన్ననే నేను చెప్పినట్టు వినేట్టు చేయమను అంటారు" అంది లలిత

"గడుగ్గాయిలా నీవే మాట్లాడుతావు గానీ ఆయనే మనరట్లా చాల్లే ఇక పడుకో" అంటూ ఇందిర పడుకొని ముసుగుపెట్టింది

(సశేషం)


STUDIO SARAGAM
ఆగష్టు విడుదల!
కనులకింపైన నృత్యములతో వీనుల విందొనర్చు గానముతో భారతదేశ స్వాతంత్ర్య సమరానికి నాంది ఎలాజరిగిందో తెలియజేసే వీర రస వత్తర గాధ
బాలాజీ ఫిలింమ్స్ సమర్పించు
యోధానుయోధులు
రచన మహారథి... సంగీతం అశ్వద్ధామ... డైరెక్షన్ కె.శంకర్
ది భారత్ పిక్చర్స్

# చతురంగ తురంగం

(8-వ పేజీ తరువాయి)

అక్కస్సుతో అత్యద్భుత నైపుణితో తన గుర్రాల జంట నడిపించాడు

అంతలోనే నలుగు రైదుగురు నూతన ప్రేక్షకు లక్కడికి చేరుకొన్నారు వారందరు నిశ్చల శిలాప్రతిమలవలె నిలబడి ఏకాగ్ర దృష్టులతో ఆ అపూర్వ చతురంగ ఖేలనం పరిశీలించారు క్రమ క్రమంగా వెంకటపతి బలం బాగా క్షీణించింది మంత్రి, రెండుఏనుగులు తప్ప మిగిలినవన్నీ తిమ్మన్న జంట గుర్రాల ధాటికాగలేక పక్కనేఉన్న లక్క భరిణలో తలదాచుకొన్నాయి వెంకటపతికి మరి ఊపిరాడలేదు ముచ్చెమటలు పోశాయి తిమ్మన్న బలంలో నాలుగైదు బంట్లు తప్ప మిగిలిన వన్నీ చెక్కు చెదరకుండా అలాగే నిలబడి ఉన్నాయి చాలావరకు జంతువులన్నీపోయిన తరవాత అలాగే పట్టుకుని వేళ్ళాడితే చిట్ట చివరికి తిమ్మన్న ఉయ్యాలతోసిరాజుతో ఆట కట్టించేటట్టు కనబడ్డాడు మరి గత్యంతరంలేక వెంకటపతి ఉసూరు మని నిట్టూర్చాడు

'తిమ్మన్నా ! ఎందుచేతనోగాని ఈవేళ ఎత్తు ఒక్కటి హొందాగా పడలేదు ఇక లాభంలేదు! ఆట ఇచ్చేస్తున్నాను తీసుకో!'

అంతలోనే 'అదేమిటండీ! నాయనింగారు! అలాగ నిరుత్సాహపడిపోతారు! ఇంకా రెండేనుగులు, మంత్రి మిగిలి ఉన్నాయిగా! ఇంకో రెండెత్తులు వేసిచూడండి!' అన్నాడు ఆయన పక్కన నిలుచున్న ఒక నూతన ప్రేక్షకుడు

అందరు ఆ కొత్త సలహాదారు వైపు కళ్ళెత్తి చూశారు ఆ కర్ణాంత విశాల నేత్రాలు! నిత్య వ్యాయామంతో బలిష్ఠమయిన నిండయిన విగ్రహం! రాజసం ఉట్టిపడుతున్న వెడద నెన్నుదురు! ఖంగుమని మారుమ్రోగిన గంభీరకంఠస్వరం!

'మరి లాభంలేదు బాబూ! మంత్రి ఏనుగులు సరి సమానంగా కొట్టిపారేస్తే ఇక మిగిలేవి పట్టి బంట్లే!'

'పోనీ ఈ ఒక్క చిన్న ఎత్తు వేసి చూడండి!'

అయితే అక్కడ నిలబడిన మేటి ఆడగాళ్ళ కెవరికి వెంకటపతి బలం నిలబడుతుందన్న నమ్మక కలగ లేదు అయినా ఆ నూతన వ్యక్తి సలహా ప్రకారం ఎత్తువేసి చూడమని అతనిని ప్రోత్సహించారు ఆ... న ఆ కొత్త ప్రేక్షకుడు మంత్రిని ఐమూలగా నాలుగు గళ్ళు నడిపించవలసిందని సూచించా వెంకటపతి మరి కాదనలేక ఆ ఎత్తు వేశాడు

ఆలోగా బాగా ఆలోచించుకొన్న తిమ్మన్న శకటం బళ్లెంలా దూసుకుపోయి ఆ మంత్రి కెదురుగా నిలిచింది వెను వెంటనే వెంకటపతి ఇంకొక గుర్రపు ఎత్తు వేశాడు అదేక్షణంలో ఆ నూతన వ్యక్తి కలగజేసుకొని మంత్రి నింకొకచోట వేశాడు ఆ గందరగోళం భరించలేక తిమ్మన్న రుస రుసలా ... మండిపడ్డాడు

'ఇదేమిటి ఆట! ఇద్దరు చెరొక ఎత్తువేస్తే ఎలాగ? ఇదేమన్నా చదరంగం ఆటా? లేక పట్టి బొమ్మ పోట్లాటా?'

వెను వెంటనే వెంకటపతి నాలిక కరుచుకుని తన గుర్రాన్ని వెనక్కి మళ్ళించాడు మరు క్షణంలోనే తిమ్మన్న గుర్రం మెరుపులా చెంగలించింది అంతలోనే వెంకటపతి, ఆ నూతన వ్యక్తి తిరిగి అదేవిధంగా ఒకే క్షణంలో రెండెత్తులు వేశారు దానితో తిమ్మన్న తోక తొక్కిన కోడెత్రాచులా ఆ కొత్త వ్యక్తికేసిచూసి కస్సుమన్నాడు:

'ఇదిగో! ఏమిటయ్యా! మధ్య నీ గొడవ! బొత్తిగా ఆట మర్యాద తెలియని పట్టి మోటు మనిషిలా ఉన్నావే! అంత ఉమ్మస్సు ఎక్కువగాఉంటే నువ్వే ఆడరాదూ? క్షణంలో నీ సంగతి తేల్చివేస్తాను! ఏం ఉయ్యాలతోసి రాజా చేయించుకుని నలుగురిలో తలవంచుకోవాలని ఉందా?'

ఆ నూతన పురుషుడా పరుషప్రసంగం విన్నా విననట్టే తదేక ధ్యానంతో తన కట్టెదట చతురంగ బలం పరిశీలించాడు కాని అంతకుమునుపే కొత్తగా వచ్చినవారి ముఖాలొక్కసారిగా జేవురించాయి వారిలో ఒకడు రూక్షవీక్షణాలతో గొంతెత్తి గర్జించాడు

'మాటలు తిన్నగా రానీ! కాస్త పెద్ద చిన్న తారతమ్యం గమనించనక్కరలేదూ! నోటికి వచ్చినట్టు మాట్లాడడమేనా? ఉయ్యాలతోసి చేస్తావేం? ఉయ్యాలతోసి? మహా మొనగాడవు బయలుదేరావులే! మరి నోరు మెదిపిచూడు నిన్నేం చేస్తానో!'

దానితో తిమ్మన్న మరింతగా రెచ్చిపోయాడు

'ఏమిటయ్యా నువ్వు చేసేది? ఏది ఏమయినా సరే! ఈవేళ అన్నమాట అక్షరాల నెగ్గించుకు తీరతాను లేకపోతే ఇద్దరాడడ మేమిటి? రండి! మీ ఇద్దరిని కూర్చోబెట్టి ఇప్పుడే ఉయ్యాలతోసి చేసి నోళ్ళు కట్టించేస్తాను!'

అంతలోనే వెంకటపతిలేచి నిలబడి వారిద్దరిని శాంతింపజేసి నూతనవ్యక్తికేసి చూసి బతిమాలుకొన్నాడు 'బాబూ! నాకీవేళ వల్లమాలిన వ్యవహారం ఒకటి వచ్చిపడింది ఇందుచేత మనస్సుసరిగాలేక ఎత్తులు తిన్నగా పడడంలేదు కాస్త ఈ ఆట పూర్తిచేసి కట్టిస్తేనేగాని ఈ బొడ్డుచర్ల వారబ్బాయి తలబిరుసుతనం తగ్గేటట్టు కనబడటం లేదు! కొంచెం నా బదులు మీ రిక్కడ కూర్చుని ఆడండి! నేను వెడతాను! సెలవు!' అని చల్ల చల్లగా అక్కడినించి తప్పుకొని తన భవంతి వైపు తరలిపోయాడు

ఆ తరవాత ఆ కొత్త వ్యక్తికి, తిమ్మన్నకి మధ్య నడిచిన ఆట మరింత పట్టుగా సాగింది వెంకటపతి వేసిన ఆట పునాదు అంతగా బలమైనవికావు అందుచేత తిమ్మన్న తీవ్రాశ్వ ధాటికి తట్టుకోలేక అది అనతికాలంలోనే పురాతన శిధిల భవంతిలా కూలిపోయింది! నూతన ప్రేక్షకులలో కొంతమంది నవీన వ్యక్తితో చేతులు కలిసి శతవిధాల ఆట పోరాటం కొనసాగించారు కాని బలం మరి తిరగబడలేదు అంతలోనే ఉప్పొంగుతున్న విజయోన్మాదంతో తిమ్మన్న హేలగా నవ్వి అధిక్షేపించాడు:

'అయ్యా! మా రాజధాని ఆట మీ కలవాటు లేదులా ఉంది! ఇదిగో! సహా! ఈ పైన సరిగా రెండేరెండు ఎత్తులతో ఉయ్యాలతోసి ప్రారంభిస్తాను మారు

# చతురంగ తురంగం

మాటాడక ఆట ఇచ్చేస్తారా ? లేకపోతే ఆ మహారాజ మర్యాద కాస్త జరిగించమంటారా?'

అయినా ఆ నూతన పురుషుని పెదవిపై చిన్న చిరునవ్వు మాత్రమే తరలించింది మరుక్షణం లోనే అతని పక్కనే నిలుచున్న ఇంకొక ప్రేక్షకుడు చర్రున ఒరలోనుంచి బాకుదూసి తిమ్మన మీదికిదూకి—

'జాగ్రత్త ! ఇంకొక మాట మిగలావంటే రక్తం కళ్ళ చూస్తాను ఆడేది ఎవ్వరనుకొంటున్నావు ! కళ్లేమన్నా మూసుకుపోయాయా?' అని గొంతెత్తి ఉద్ఘోషించాడు

తిమ్మన్న మరి లోలోపల చెలరేగుతున్న దురాగ్రహం నిగ్రహించుకోలేక 'పాడవరా! పాడు! ఇది రాయలవారి రాజ్యమా! లేక భామినీ రాజ్యమా? పాడి చావంటే మరి ప్రాణాలతో బ్రతికిబయటపడగలవురా?' అని ఒక్క దూకులో అతనితో తలపడబోయాడు అంతలోనే వేరొక ప్రేక్షకుడు వారిద్దరిని వేరు చేసి తిమ్మన్నకేసి నిలువునా చీల్చివేసేటట్టు చూసి 'చాలు! చాలులే నేర్చావు ! ప్రగల్భాలు ! బాపనయ్యవు కాబట్టి బతికిపోయావు! లేకపోతే సీరల ఈ పాటి తెగిరిపోవలసిందే !' అని హెచ్చరించాడు ఆ పైన క్షణకాలం వారి మధ్య రభస రవంత చల్లారింది అంతలోనే ఆ నూతన వ్యక్తి అక్కడినించి కదిలి తన కనతి దూరంలో రామ దేవాలయంలో అతి రహస్యంగా ఆయత్తంచేసి ఉంచిన భద్రగజంమీద అధిష్ఠించి 'జయ! దక్షిణాపథాధీశ్వరా! జయ! జయ! కృష్ణరాయమహీంద్రా! జయ!,' అన్న బరాబరుల కోలాహలంతో క్రమ క్రమంగా అదృశ్యుడయినాడు!

తిమ్మన్న కాసేపైన రెండు మూడు నిమిషాలదాకా శరీర స్పృహ కలగలేదు తరవాత అదంతా ఏదో విచిత్ర స్వప్నంలా భాసించింది నిలువునా నిర్ఘాంతపడిన అతనికి తాను చేసిన తప్పిదం గ్రహించడానికెంతోసేపు పట్టలేదు చదరంగంలో సాధారణులయిన రాచ వారిని కూడా 'షహ' అని హెచ్చరించడం ఆట మర్యాదకాదు రాజా అని సూచించడానికెంతో మర్యాదగా అంగుళితో నిర్దేశించి వారి దృష్టి అటువైపు మరలించాలి ఆ పైన తోసిరాజనడం వారి యెడల ఎన్నటికి మన్నించరాని మహాపరాధం! సామాన్య క్షత్రియులకే అది మహావమానకరమయి నప్పుడిక దక్షిణాపథానికంతటికీ ఏకైక సార్వభౌములయిన శ్రీ కృష్ణదేవరాయల ఎడల అది ఎంతటి తలవంపయిన మాట! తానంతటితో ఊరుకోలేదు 'మోటు మనిషి'యని అధిక్షేపించాడు! ఆపైన ఉయ్యాలతోసి రాజు చేసి క్షణంలో ఆటకట్టేస్తానని గర్జించాడు ఆ పరిస్థితిలో చక్రవర్తి అంగరక్షకుడు బాకు చూసి మీది మీది కురకడంలో ఆశ్చర్యం ఏమి ఉంది! ఆ మహా ప్రభువు స్వయంగా కలగజేసుకుని సన్నని కనుసన్నతో నివారించి ఉండకపోతే తానీపాటికి ఎరలోకం చేరుకొని ఉండవలసినదే!

అయితే తన కాయన సార్వభౌములని తెలియదు ఏమాత్రం తెలిసినా అంత దురుసుగా మాట్లాడి ఉండకపోను రాజధానిలో అంతట అధికారుల విధి నిర్వహణ పరిశీలన కోసం రాయలవారి వేళ ప్రచ్ఛన్న వేషంతో పర్యటిస్తున్నారు కాబోలును! అప్పుడప్పుడా విధంగా విజయనగర విహారం ఆయన కొక పరిపాటి అని తానంతకుమును చెప్పుడో కర్ణాకర్ణిగా విన్నాడు అంతే కాని ఎన్నడు స్వయంగా ఆ వింత సందర్శించి ఉండలేదు చూచిఉంటే కొంచెం ముందు జాగ్రత్తతో వ్యవహరించి ఉండును ఇక గత జల సేతుబంధనంవల్ల ప్రయోజనమేమి ఉన్నది! ఏది ఏమయినా తనవల్ల వల్లమాలిన మహాపరాధమే జరిగిపోయింది! అయితే తన అజ్ఞానం వల్లనే అంతటి పొరబాటు జరిగినదని చక్రవర్తి గ్రహించి రవంత మన్నించకపోరని తిమ్మన్న మళ్ళీ లోలోపల కొంత సమాధానపడ్డాడు

కాని అతనికా ఆలోచన అంతగా సంతృప్తి కలిగించలేదు సార్వభౌములు తన అపచారంచూచీ చూడనట్టు ఉపేక్షించినా ఆయన ఇచ్ఛకంకోసం అహోరాత్రా లదేపనిగా నిరీక్షించే రాజాధికారులి ఎంతమాత్రము క్షమించరని తిరిగి మనసులో బాగా మథనపడ్డాడు వారివల్ల తనమీదేకాక తన కుటుంబం మీద కూడా ఏదైనా ఒక ఘోరాపద విరుచుకుపడ వచ్చునని మళ్ళీ ఎంతో భయపడ్డాడు సరే, కానున్న దేదో కాక మానదని గుండె రాయి చేసుకొని ఇంటి ముఖం పట్టి చరచరా నడక సాగించాడు

తిమ్మన్న ఇంట్లో అడుగు పెట్టక పూర్వమే ఆనాటి విద్వారం ఆ వీధిలో అంతట కార్చిచ్చులా వ్యాపించింది బెదరుతూ, బెదరుతూ గుమ్మంలో అడుగు పెట్టేసరికి అతని తండ్రి శివావధాని ఎదురుగావచ్చి ఒక్కసారిగా విరుచుకు పడ్డాడు

'తిమ్మన్నా! ఎంతపని చేశావురా ఈవేళ! కాస్త అష్టాధ్యాయి కంఠతః వల్లించరా! నాయనా! అంటే నా మాట లక్ష్యపెట్టక తచ్చసావిడికెక్కి తగుదునమ్మా అని చదరంగం ఆడుతూ కూర్చున్నావా? పైగా కన్నూ మిన్నూ కానక తాతలనాటినుంచి మనకి మడిమాన్యాలిచ్చి పోషించిన ధర్మప్రభువు రాయలవారినే అనరాని మాటలతో అవమానించావా! నీకిదేం పిదప కాలం వచ్చిందిరా! కాకపోయినా ఆ తుంటరి మేనమామలపోలిక ఎక్కడికి పోతుంది? వాళ్ళ ఇంట పొద్దస్తమానము ఆ పాడు చదరంగం ఘోషేగాని పట్టుమని ఒక్కడికయినా అక్షరం ముక్క అంటిందీ !'

ఆ ఆక్షేపణ విని వినగానే అతని తల్లి రుసరుసలాడుతూ అక్కడికి వచ్చి 'మావాళ్లకేం లోటు వచ్చింది ? వీరనరసింహరాయలవారి వద్ద చదరంగం మాన్యం సంపాదించి కాలుమీద కాలువేసుకొని కూచుని

మహారాజుల్లా కాలక్షేపం చేస్తున్నారు !' అని తన పుట్టింటివారిని వెనకేసుకువచ్చి తండ్రితో పెద్ద వాదులాట ప్రారంభించింది క్రమక్రమంగా అది చినికి చినికి ఒక పెద్ద గాలివానలా తయారయింది తా రిద్దరు ఆ గొడవలో పడి అసలు తనమాటే పట్టించుకోవడం మాని వేశారని గ్రహించి తిమ్మన్న పిల్లిలా అక్కడినుంచి తప్పుకుని పెరటిలో పనసచెట్టు చుట్టూరా కట్టిన తిన్నెమీద గావంచా పరుచుకుని మేను వాల్చాడు ఆ వృద్ధ దంపతులు తమలో తా మలాగే మరికొంతసేపు తగాదాపడి బాగా అలసిపోయి క్రమక్రమంగా శాంతించారు ఆరాత్రి అంతా తిమ్మన్న కొక్క కోడి కునుకయినా పట్టలేదు !

మరునాడు మధ్యాహ్నం ఇంచుమించుగా రెండు ఝాముల పొద్దెక్కేదాకా తిమ్మన్న నిద్రమత్తులోనే ఉన్నాడు మూడోయామం తిరిగేసరికి సరాసరి రాయల కొలువుకూటంనించి ఒక పల్లకి వచ్చి శివావధాని ఇంటిముందు నిలిచింది దానితో బాటే నిలుచున్నపాటుగా రావలసినదని రాజాధికారి ముఖతః తిమ్మన్న కొక శ్రీముఖం కూడా అందింది! తండ్రి కొడుకుల కిద్దరికి కూడా ఆ ఉత్తరువు పుట్టడానికి గల ప్రధాన కారణమేమో అంతు పట్టలేదు అదిగాక ఆ విషయమై ఆలోచించడానికి కూడా వ్యవధి కనబడలేదు

తిమ్మన్న అంతకుమును పెప్పుడు రాయుల పేరోలగంలో అడుగు పెట్టలేదు కాని తాతల నాటి పాత అంగరఖా ఒకటి ధరించి శిరస్సుమీద ఒక ఉష్ణీషం పెట్టుకొని ఆదరా బాదరాగా పల్లకి ఎక్కి ప్రయాణ మయినాడు శివావధాని వీధి మలుపుదాకా పల్లకీ వెంట వెళ్లి 'బాబూ! తిమ్మన్నా ! రాచవారితో భేటీ నాగుబాములతో చెలగాటం సుమా ! బహు భద్రం ! జాగ్రత్త !' అని ముమ్మారు హెచ్చరించాడు 'ఇంతకి ఉత్తరువెందుచేత పుట్టిందో తెలియచెప్పుడీ అనవసరమయిన మథన ఎందుకు ?' అని తిమ్మన్న తండ్రికి ధైర్యం చెప్పి ఓదార్చాడు కాని లోలోపల అతనికి బాగా బెదురుగానే ఉంది

అత డలాగ పరధ్యానంగా ఆలోచిస్తూండగానే పల్లకీ చక్రవర్తి భవనం కక్ష్యాంతరాలన్నీ దాటి సభాగారం సింహద్వారంలో ప్రవేశించింది పల్లకి దిగి నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ కొలువుకూటంలో ప్రవేశించిన తరవాత తిమ్మన్న మరి తన కన్నులే నమ్మలేక నిలువునా నిర్ఘాంత పడ్డాడు అతని కెదురుగా ఇంద్రనీలాలతో, పద్మరాగాలతో మలిచిన చతురంగబలం వేర్వేరు రంగుల మాణిక్యాలతో రూపొందించిన సమున్నత పీఠం మీద అమర్చబడి ఉన్నది దాని కిరువైపులవేసిన బంగారు సుఖాసనాల సరసన ఇద్దరేసి చామరగ్రాహిణులు శిరస్సులల్లన వంచుకొని సేవావసరంకోసం నిరీక్షిస్తున్నారు అంతేగాని తిమ్మన్న కక్కడ ఇంకెవ్వరు గోచరించలేదు చక్రవర్తి ఆజ్ఞలోగల అంతరార్థం అతని కప్పటికి రవంత బోధపడింది

ఇంకా ఉంది

# న్యూఢిల్లీ లేఖ

(7-వ పేజీ తరువాయి)

కల్పించలేదట! అయితే ఈ దొరక్క పోవటం, వీళ్ళంతా రాష్ట్రపతికి సేవ చేస్తుండటంవల్ల కాదు! రాష్ట్రపతిని చూట్టానికి ప్రధాన మంత్రి వస్తే, ఆయన్ను చూట్టానికి వీళ్ళంతా వెళ్ళారు స్వవచోవ్యాఘాతం చేసుకునే కాంగ్రెస్ మంత్రులు ఆస్పత్రులలో ఎలా ప్రాధాన్యం పొందుతున్నారో ఇది నిరూపిస్తుంది స్వతంత్ర వైద్యాలయాల్లో ప్రథమ పరిగణన కాంగ్రెస్ మంత్రులకే సామ్యవాదం ఆచరణలో వుందనటానికి నిదర్శనం ఇది!

*　　*　　*

ఇండో ఇటాలియన్ నూనె అభివృద్ధి ఒప్పందం ముసాయిదాను ఇటాలియన్ ప్రభుత్వ యాజమాన్యంలోవున్న సంస్థ "ఇ యన్ ఐ—ఎ జి ఐ పి" తయారు చేసింది ఈ ముసాయిదా ఇటీవల భారత ప్రభుత్వానికి చేరింది ఈ ఒప్పందం ప్రకారం ఇటాలియన్ ఇ యన్ ఐ సంస్థ ఋణంగా 200 మిలియన్ల డాలర్లు భారత ప్రభుత్వానికి ఇస్తుంది ఈ ఋణం తీర్చాల్సింది 12 సంవత్సరాల్లోగా ఈ ఋణంలో 20 మిలియన్ల డాలర్లు, భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోవున్న నాచురల్ ఆయిల్ అండ్ గాస్ కమీషన్ చేసే నూనె గనుల త్రవ్వకానికి కేటాయించటం జరుగుతుంది ఈ ఇ యన్ ఐ తనకు తానుగా నూనె అభివృద్ధి విషయం పట్టించుకోదని, ఇండియన్ ఆయిల్ అండ్ నాచురల్ గాస్ కమీషన్‌కు ప్రతినిధులుగా పని చేయవచ్చని పరిశీలనవల్ల తెలుస్తున్నది ఈ పని చేయటంకూడా పరస్పరం అంగీకార్యమైన నిబంధనలమీద నేనట ఈ ఇ యన్ ఐ త్రవ్వకం సామగ్రి కూడా సరఫరా చేస్తుందట

ఇ యన్ ఐ అధికారి శ్రీ యురికోమాట్టే గత శీతాకాలంలో వచ్చినప్పుడు, మన నూనెశాఖ మంత్రి ఇటలీ వెళ్ళినప్పుడూ, భారతదేశంలో నూనె పరిశోధనలను ప్రారంభించవలసిందిగా ఇటలీ ప్రభుత్వ నూనె సంస్థను ప్రోత్సహించేందుకుగాను మన మంత్రి (నూనె శాఖ) చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి ఇలా విఫలం కావటం భారత ప్రభుత్వ నూనె విధానంపైన ఒక దుర్వ్యాఖ్య అన్నమాట శ్రీ మాట్టే తాము మొరాకోతో చేసుకున్న ఒప్పందం మాదిరిగానే ఇక తగ్గించటానికి వీల్లేనంత తక్కువ ప్రతిఫలం కోరారు తమ పెట్టుబడులలో నిస్సంకంగా 25% తరుగు లేని రాబడికి హామీ ఇస్తే చాలు, భారత దేశానికి సహాయం చేయాలని ఎంతో తాపత్రయపడుతున్నారు

మన చూపు ఒప్పందం వైపు మళ్ళిద్దాం పరిశుద్ధి శాలను నెలకొల్పేందుకు 23 మిలియన్ల డాలర్లు కేటాయింపు జరిగింది అస్సాంలోని నున్మతి, బిహార్‌లోని బరౌని, గుజరాతులోని కొయాలీ నూనె పరిశుద్ధి కర్మాగారాలకు ఋణం రష్యా రుమేనియాలు వాగ్దానం చేశాయి ఇప్పుడు ఈ ఇటలీ సంస్థ సహకారంతో ఏర్పడే నూనె పరిశుద్ధి కర్మాగారం దక్షిణభారతంలో వుంటుందని, బహుశా రష్యానుంచి ముడినూనె వస్తుందని అనుకొంటున్నారు

ఇదికాక 30 మిలియన్ల డాలర్లు బరౌనీనుంచి కలకత్తాకు, బరౌనీనుంచి కాన్పూర్‌కుగాని, లక్నో నుంచి ఢిల్లీకిగాని నూనె గొట్టాలు వేయటంకోసం కేటాయించారు

మిగిలిన 34 మిలియన్ల డాలర్లధనం అస్సాంలోని గాస్ సపరేషన్ ప్లాంట్‌కు, పెట్రో—రసాయనిక వస్తువులు తయారు చేసేందుకు ఏర్పాటవుతున్న పథకానికి, ల్యూబ్రికేట్ ఆయిల్ కర్మాగారానికీ పెట్టుబడిగా ఉంటుంది అయితే రష్యా సహకారంతో బరౌనిలో ఏర్పడ్డ నూనె పరిశుద్ధి కర్మాగారంలో ల్యూబ్రికేటింగ్ ఆయిల్ ప్లాంటు ఉంది కనుక బరౌనీ నూనె శుద్ధి కర్మాగారంలో తయారుకాని, కావాలని వాటిని, ఇటలీ సహకారంతో ఏర్పడే సంస్థ తయారు చేస్తుందని అనుకోవాలి

నూనెశాఖ మంత్రి ఆశలకు విరుద్ధంగా ఈ పథకంలో ముఖ్యమైన వాటి ఒప్పందంపై ఇ యన్ ఐ స్థానిక ప్రతినిధి శ్రీ గాస్పరిని సంతకం చేయవచ్చు సంప్రదింపులు జరిపిన పిదప ప్రతి విషయంపైనా విడివిడిగా ఒప్పందాలు కుదుర్చుకొనటం జరుగుతుంది

ఇటాలియన్ ఋణం ఒక ప్రాజెక్టుకు కావలసిన విదేశీమారకాన్ని సమకూరుస్తుందనీ అనుకోవచ్చు భారతప్రభుత్వం తన స్వంత రాబడిమార్గాలనుంచే రూపాయిలలో పెట్టుబడి పెడ్తుంది గొట్టపు మార్గాల పథకానికి కావలసిన గొట్టాలను భారత దేశం సరఫరా చేస్తున్న దనుకోండి అప్పుడు ఇటాలియన్ ఋణం పంపింగు యంత్రాలకు, సాంకేతిక శాఖలకు పెట్టుబడవుతుందన్నమాట

మరొకమాట, ఇంతవరకు అందిన సమాచారాన్ని బట్టి ప్రభుత్వరంగంలో ఉన్న నున్మతి, బరౌనిలలో పని ఇంకా కొంత ఆలస్యం ఆయేటట్లుంది నున్మతి నూనెశుద్ధి కర్మాగారానికి సంబంధించి నంతవరకు ముడికి నూనెను గౌహతికి 18 మైళ్ల దూరంలో వెలువరించేందుకు అవసరమైన నూనె గొట్టాలు లభ్యం కావటంలేదని, అలా లభ్యం కావటానికి ఇంకా కొన్నాళ్ళు పట్టుతుందని తెలుస్తున్నది

*

వివిధ వర్గాల మధ్య సౌమనస్యాన్ని భంగపరచటం గాని, వివిధ వర్గాల మధ్య విరోధం ప్రోత్సహించడం గాని శిక్షార్హమైన నేరాలుగా చేసే బిల్లు ఒకటి త్వరలో పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టుతున్నారు

ఇండియన్ పీనల్‌కోడ్ సవరణ చట్టం 1961 అనేక ఈ బిల్లుతోపాటుగా ఇంకా 15 కొత్త బిల్లులు ఆగస్టు, సెప్టెంబరులో జరిగే పార్లమెంటు సమావేశంలో వస్తున్నవి

భత్యం ఐచ్ఛికంగా తగ్గించుకోటమనే విషయంలోని చట్టం అన్ని తరగతుల (జీతం సంపాయించే) ఉద్యోగు లందరికి విస్తరింపజేయాల్సి ఉంది హైకోర్టు న్యాయమూర్తుల ఉద్యోగ నిబంధనల సవరణబిల్లును ప్రతిపాదించబోతున్నారు ఇప్పుడున్న పెన్షన్, అదనపు పెన్షన్‌లు గాక, హైకోర్టు న్యాయమూర్తులకు మరణ—పదవీ విరమణాల గ్రాట్యుయిటీలు కల్పించేందుకు ఈ చట్టాన్ని ప్రవేశ పెట్టుతున్నారు

ఇప్పుడు పార్లమెంటులో ప్రవేశ పెట్టబోయే బిల్లుల్లో ఒకటి భారత కంట్రోలర్, ఆడిటర్

జనరళ్ల అధికారాలను నిర్వచిస్తుంది ఇంకో బిల్లు నేరస్థుల మార్పిడి బిల్లు ఇది ప్రస్తుతం అమలులో ఉన్న నేరస్థుల మార్పిడి చట్టం 1903 కు బదులుగా అమలులోకి వస్తుంది

రైలు ప్రమాదంలో మరణించినవారికి చెల్లించే గరిష్ఠ ధనాన్ని రు 10,000 నుంచి రు 20000 లకు పెంచటం జరుగుతుంది ఇదేవిధంగా భారతీయ రైల్వేల చట్టం (రెండవ సవరణ) 1966 లో పై హెచ్చింపు అదేవిధంగా భారత రైల్వేల (రెండవ సవరణ) బిల్లు 1961 లో, ఇంతకు ముందున్న చట్టంలోని కొన్ని సెక్షన్లలో చెప్పిన కనీసవు శిక్ష పెంపుదలకు కూడా అవకాశం కల్పించాల్సి ఉంటుంది

కొన్ని రాష్ట్రాల్లో చెరకుపై విధిస్తున్న సెస్సును ధృవపరిచేందుకు పంచదార చెరకు (ధృవీకరణ) బిల్లు 1961 ని కూడా ప్రవేశ పెట్టాల్సి ఉంది

పరిశ్రమలలో అప్రెంటిస్సులకు శిక్షణ గరిపే పథకం ఒక బిల్లు ద్వారా స్థిరంగా ఏర్పడబోతున్నది ఇంకోబిల్లు పరిశ్రమల అభివృద్ధి, క్రమ నిర్వహణల చట్టమును జమ్మూ — కాశ్మీరుకు విస్తరింప జేస్తుంది

న్యూఢిల్లీ మురికిపేటల బాగు త్వరగా జరిపేందుకు మురికిపేటల (పారిశుద్ధ్యాభివృద్ధి—నిర్మూలనం) సవరణబిల్లు 1961 ఏర్పడుతుంది ఇంకోబిల్లు ప్రస్తుతం ఉన్న 1948 అణుశక్తి చట్టం స్థానంలో ఏర్పడుతుంది

ఢిల్లీ కార్పొరేషన్ (సవరణ) బిల్లు 1961 ద్వారా కొన్ని సవరణలు జరుగుతాయి ఏకసభ్య నియోజకవర్గాల వారిని పురపాలక సంఘ సభ్యులుగా ఎన్నికయ్యే అవకాశం కల్గించటమే ఈ సవరణ ఉద్దేశ్యం వయోజన వోటింగ్ పద్ధతిన కేంద్ర పాలితప్రాంతం మణిపూర్‌లో ఎన్నికలు జరిపేందుకుగాను ఈ ప్రాంతంలో అమలులో ఉన్న అస్సాం పురపాలకచట్టం 1956 లను సవరించాల్సి ఉంటుంది

నిర్దిష్ట పరిమితుల వరకు, వాణిజ్య బ్యాంకుల లోని డిపాజిట్లు భీమాచేయటం జరుగుతుంది దీనికోసం, డిపాజిట్ల భీమాసంస్థ బిల్లును ప్రవేశపెట్టుతున్నారు 1956 వార్తాపత్రికల చట్టాన్ని ఇంకో ఏడాదిపాటు పొడిగించటం జరుగుతుంది

పార్లమెంటు రాబోయే సమావేశంలో తృతీయ పంచవర్ష ప్రణాళికను గూర్చి కూడా చర్చిస్తుంది ఇదిగాక అల్పసంఖ్యాక భాషావాదుల కమీషనర్ సమర్పించిన రెండవ, మూడవ నివేదికలు, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ విచారణసంఘం నివేదిక చర్చలను కూడా పార్లమెంటు చర్చిస్తుంది

కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ 10 వ వార్షిక నివేదిక 1961—62 వ సంవత్సరపు సప్లిమెంటరీ డిమాండ్లగ్రాంట్లు, విశ్వవిద్యాలయం గ్రాంట్ల సంఘం సమర్పించిన 1959 ఏప్రియల్—1960 మార్చి నివేదికలపైన కూడా పార్లమెంటులో చర్చలు జరుగుతాయి ★

BR FILMS


కోర్టులో






హత్య చేయబడ్డ
వాడికి, హత్య
చేసిన వాడికే
నిజంతెల్సు
హంతకుడు
దొరకలేదు

అయినా తెలిసింది ?






అశోక్‌కుమార్ రాజేంద్రకుమార్ నందా జీవన్ శశికళ,
గానాపల్సికర్ మన్మోహన్‌కృష్ణ, మహమూద్

* న్యాయశాస్త్రరీత్యా వాళ్లు అందరూ హంతకులే...... అయితే అందులో ఒక్కడే హంతకుడు.

# KANOON కానూన్

నిర్మాత - దర్శకుడు బి ఆర్ చోప్రా (హిందీ)

కథ సి జె పవ్రి ★ మాటలు అఖ్తార్-ఉల్-ఇమామ్ ★ ఛాయాగ్రహణం ఎం ఎస్ మల్హోత్ర ★ సంగీతం: సలిల్ చౌదరి


ఎడిటింగ్ ప్రాణ్ మెహరా —— ఆర్టు: సంత్ సింగ్

బాలెట్ వేరా బొచ్చారోవా మాధురి అండ్ గోపీకృష్ణ

## ఆంధ్రదేశమంతటా ఆగస్టు విడుదల

—నవయుగ

# గళ్లనుడికట్టు-65



ఈ నుడికట్టులో అక్కడక్కడ మన దేశ నాయకుల పేర్లు కనిపిస్తాయి. ఇవి వారి వారి నామధేయాలలో ఏవైనా కావచ్చు. గళ్లు క్రమంగా నింపుతూవస్తే సులభంగా తెలిసిపోతాయి!


## అడ్డం


1 సెలవంక తర్వాతచూస్తే వనిత!
3 బాబూ
5 వీరి ముందు చక్రవర్తి
7 సర్వోదయం
9 మనమూ—మన రాష్ట్రం!
12 సంగీత విశేషం ఇష్టమై పోవాలి
13 అటునించి చూస్తే న్యాయం
15 ఆనకట్టముందే తర్వాత
17 పాదముకోరు
19 నిజంగా స్వతంత్రుడేనా?
20 ఆర్థిక మంత్రి
21 అప్పడాలు యుద్ధంలో పనికొచ్చే వస్తువు విస్తాయ్
23 జనకుని పట్టణం
25 స్నేహితులు చిందరవందరయిపోయారు— మీరసలు కుదురుగాఉంటే చూడండి చాలు
28 తలక్రిందులుగా జ్వరం తగ్గిన తర్వాత తినేది!
30 —లింగీ (వదరాలని సూచించేది)
31 ఆహార శాఖమంత్రి పేరు
34 ఇటీవలే జన్మ దినోత్సవం చేసుకున్న ముఖ్య మంత్రులలో ఒకరు
38 సోషలిస్టు పార్టీలోనూ, ముఖ్యమంత్రి పదవిలోనూ ఈ పేరు కలవారు కనిపిస్తారు
39 'స్త్రైన చెప్పిన' (సదరహి!)
40 యస్వంతరావ్.

## నిలువు

1 ఇంకెవరు?
2 'పనికిరారా?' అని అర్థం కావాలి
3 ప్రణయ మతిశయము కాదనిచూస్తే నమ్రత (చిందర వందరయిన మాట)
4 సంపద, సౌషద్‌లలో సంతోషం కలిగించే మాట (మళ్ళీ చిందర వందరే!)
5 రావణుడిలో మూడు వంతులు సైన్యమే
6 —మామిడి
7 సర్పం
8 ఢిల్లీ ప్రక్కన నది
10 జీవు నడువు! అంటే ప్రాణమా, బృహస్పతియా?
11 క్రిందనుంచి మధురం, తియ్యమనకండి!
12 బెంగాల్‌లో ఒక డాక్టరు!
14 శ్యామలవర్ణమా లేక పార్టీ అధ్యక్ష పదవియా?
15 ఆ గానుగ మధ్య మిగిలిన వాటితో రాగలది.
16 మొదలడుగక కనుగొను అంకురము! (చిందరవందర)
17 దర్జీలు వ్రాతపూర్వకములైన మనవులతో ఎంత వరకూ కనిపిస్తారు?
18 గుడారమునకు పొగాకుతో కలిపిన బెల్లమునకు ఎంతవరకు అన్వయిస్తుందో తెలిసికొంటే మంచిది
22 రాజా మంత్రి కూడా! నిజం!!
24 శిరోజాలంకారములను ధిక్కరిస్తావంటే ఈ క్రిందుదైన మెడ కనిపించక మానదు
26 ఏడవకు! ఎన్ని?
27 పట్టంతానే కట్టుకుపోయినది పిరేనేమోనని పిస్తుంది!
29 పసరులోనే సారము
30 —దొంగ, ఈతగాడు
32 బల్వంతనాగేశ్—(కేంద్ర ప్రభుత్వంలో దేశీయ వ్యవహారాలమంత్రి ఇక్కడ చిందర వందరయిపోయారు!)
33 క్రమమే!
34 కరన్‌సింగ్‌దేశం
35 రాజహంస
36 ఆమెకములో ఎవరు?
37 శ్రీ—(గౌరవార్థమేకాక గిరీశం 'టర్కా డామిట్ టెల్—' అంటాడు) ★

## 64-వ గళ్లనుడికట్టుకు జవాబు






వనితాలోకం పోటీ
వివరాలు పైవారం
సంచికలో!

## పొట్టికథలు

### గోలీల కొట్టువద్దకెళ్లి

రాము, వేణు - మంచి గోలీలున్నావా?

షాపువాడు - ఆ! ఉన్నాయ్. ఎటువంటి గోలీలనైన దెబ్బకు పగల గొట్టేస్తాయ్.

రాము, వేణు - మేమిద్దరం మీ గోలీలతో ఆడితే ఎవరిగోలీ పగుల్తుంది?

డి వి యస్ (చల్లపల్లి)

* * *

మందమతి అయిన ఒక ప్రొఫెసర్‌తో ఒకావిడ యిలా అంది


ఆమె - "మీకు నేను జ్ఞాపకం ఉన్నానా? కొన్ని ఏళ్ళ క్రితం మిమ్మల్ని పెళ్లి చేసుకోమని నన్ను అడిగారుమీరు.


ప్రొఫెసర్ - (పరధ్యానంగా) ఔను! మరి మీరు చేసుకున్నారా?

సి హెచ రామమూర్తి (రాజమండ్రి)



Edited, Printed and Published by S Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street, Madras-1 Chief Editor S. Sambhu Prasad.


నేడే చూడండి!
చేతనా ఫిలింస్ వారి
గుళ్లో పెళ్లి
దర్శకత్వం.. కె.యస్.ప్రకాశరావు
నిర్మాత.. డి.జి.ప్రసాదరావు.
రచన.. అనిసెట్టి; సంగీతం.. రమేష్
ఆంధ్ర: పరమేశ్వరి, నైజాం: మహేశ్వరి, మైసూర్: మహాశక్తి మూవీస్
STUDIO Mitra


తప్పక చూడండి!
షా ఫిలిమ్స్....
కష్టసుఖాలు
నిర్మాత K.V.R. చౌదరి · దర్శకత్వం శ్రీధర్
వాణీ రిలీజ్...
REVATHI
సంగీతం A.M. రాజా · మాటలు మహారథి · పాటలు వేణుగోపాల్